

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 16

సోమవారం 8-4-2024



బాబును నమ్మితే పులికి బలే: ఏపీ సీఎం జగన్ 10లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



దేశంలో.. కశ్మీర్ అంతర్భాగం కాదా?

రాజ్యాంగాన్ని జమ్మూకశ్మీర్‌లో గతంలో పూర్తిస్థాయిలో ఎందుకు అమలు చేయలేదో ప్రతిపక్ష నేతలు చెప్పాలని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ఈసీ 'సోషల్' బాట

తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్న వారి కోసం 'టర్నింగ్ 18' పేరిట ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.


వివరాలు 6లో ▸



'ఆప్' సామూహిక నిరాహార దీక్షలు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టును వ్యతిరేకిస్తూ ఆప్ నేతలు, కార్యకర్తలు జంతర్‌మంతర్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేశారు.

వివరాలు 6లో ▸



సహజీవనం చేసినా భరణం

చట్టబద్ధంగా వివాహం చేసుకోకపోయినా సహజీవనం చేసి విడిపోయిన మహిళ భరణానికి అర్హురాలేనని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

నిస్సిగ్గుగా మా ఎమ్మెల్యేను లాక్కుంటారా?



'రాజీనామా చేయకుండా పార్టీలు మారే ప్రజా ప్రతినిధులపై అనర్హత వేటు వర్తించేలా రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను సవరించడం గురించి రాహుల్ మాట్లాడారు. కానీ ఇవాళ ఆయన పార్టీ నిస్సిగ్గుగా ఒక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను లాక్కుంది' అని కేటీఆర్ అన్నారు.

- వివరాలు 5లో▶

రైల్వే..'నత్త'నడక



జాతీయస్థాయిలో సగటున రోజుకు 16 కి.మీ. మేర కొత్త రైల్వేలైన్ నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే గత ఏడాదికాలంలో తెలంగాణలో సగటున రోజుకు ఎన్ని కిలో మీటర్ల మేర ట్రాక్ నిర్మాణం జరిగిందంటే.. 0.36 కి.మీ..అంటే కనీసం అర కిలోమీటర్ మేర కూడా పనులు జరగలేదు.

- వివరాలు 5లో▶

పన్ను భారం తగ్గేదెలా..?



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి రిటర్నులు దాఖలు చేసే వారికి నూతన పన్ను విధానం డిఫాల్ట్‌గా ఎంపికై ఉంటుంది. పాత పన్ను వ్యవస్థతోనే కొనసాగాలనుకుంటే విధిగా దానిని ఎంపిక చేసుకోవాల్సిందే.

- వివరాలు 13లో▶

గెలిస్తేనే నిలిచేది..!



మహారాష్ట్రలో ఎన్సీపీ (ఎస్‌సీపీ) అధినేత శరద్ పవార్, చీలిక వర్గం చీఫ్, ఆయన అన్న కుమారుడు అజిత్ పవార్, బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే, శివసేన చీఫ్, సీఎం ఏక్‌నాథ్ షిండే... ఈ నలుగురూ గెలుపు కోసం అన్ని అస్త్రాలనూ ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి.

- వివరాలు 6లో▶

కరీంనగర్‌లో నీరు లేక వెలవెల బోతున్న లోయర్ మానేరు డ్యామ్



నీళ్లు.. నేలమట్టం

డెడ్ స్టోరేజీలో జలాశయాలు/ కృష్ణా, గోదావరి బేసిన్లలోని 14 ప్రాజెక్టుల్లో అడుగంటిన నీళ్లు

- శ్రీశైలం, సాగర్, జూరాలలో కనీస మట్టాలకన్నా దిగువకు..
- కృష్ణా ప్రాజెక్టుల్లో నిల్వలు ఇంతగా తగ్గడం ఏడేళ్లలో ఇదే తొలిసారి
- శ్రీశైలం, సాగర్‌లకు 2015-16 తర్వాత ఇప్పుడే అతి తక్కువ ఇన్‌ఫ్లోలు
- గోదావరి ప్రాజెక్టులకు కూడా మూడేళ్ల తర్వాత తగ్గిన ప్రవాహాలు
- ఈసారి తాగునీటికీ కటకట తప్పని పరిస్థితులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటాయి. కృష్ణా, గోదావరి బేసిన్లలోని ప్రధాన జలాశయాల్లో కూడా నిల్వలు డెడ్ స్టోరేజీ స్థాయికి పడిపోయాయి. రాష్ట్రంలో 2015–16 తర్వాత ఇంతగా నీటి సమస్య రావడం ఇదే తొలిసారి. ఎగువ రాష్ట్రాల్లోని కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాభావంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు 2023–24 నీటి సంవత్సరం (వాటర్ ఇయర్ – జూన్ నుంచి మే వరకు)లో తగిన వరద రాలేదు. నిజానికి మొదట్లో రాష్ట్రంలో సాధారణం కంటే 5శాతం అధిక వర్షపాతం నమోదైనా.. అక్టోబర్ తర్వాత వానలు జాడ లేకుండా పోయాయి. గత ఏడాది అక్టోబర్ నుంచి మార్చి మధ్య సాధారణ వర్షపాతంతో పోల్చితే.. 56.7 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీనితో జలాశయాల్లోకి కొత్త నీరు చేరక.. ఉన్న నీటి నిల్వలు

మిగతా 2వ పేజీలో ▶

ఇద్దరు అన్నదాతల ఆత్మహత్య

పంట ఎండిపోయి ఒకరు..
తెగుళ్లు, నీటికొరతతో మరొకరు

మరో రెండు రోజులు కుతకుత!

పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక

- వివరాలు 2లో

బాధ్యులందరికీ నోటీసులు



అవసరమైతే మాజీ సీఎం, మంత్రులకూ లేఖలు

- ఎవరైనా రాతపూర్వకంగా సమాచారం ఇవ్వొచ్చు
- సాంకేతిక నిపుణులతో పరిమితరీతిలో బహిరంగ విచారణ
- మీడియాతో 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ' జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి స్పష్టీకరణ
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ ఒప్పందంపై న్యాయవిచారణ షురూ

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంతోపాటు ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం విషయంలో తీసుకున్న నిర్ణయాలకు బాధ్యులైన వారందరినీ విచారిస్తామని 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ'గా నియమితులైన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి స్పష్టం చేశారు. వారిని గుర్తించి త్వరలో నోటీసులు జారీ చేస్తామన్నారు. కమిషన్ ముందు హాజరై తమ అభిప్రాయాలు, వాదనలు తెలియజేయడానికి వారికి అవకాశమిస్తామని చెప్పారు. నిర్ణయాల్లో కీలకపాత్ర పోషించిన మాజీ సీఎం(కేసీఆర్), మాజీ మంత్రులను సైతం విచారణకు పిలుస్తారా? అని పాత్రికేయులు ప్రశ్నించగా, అవసరమైతే వారికీ లేఖలు రాస్తామని చెప్పారు. తొలుత రిక్వెస్ట్ లెటర్స్ రాస్తామని, అవసరమైతే సమన్లు జారీ చేసే అధికారం తమకు ఉంటుందన్నారు. రాజకీయాలకతీతంగా విచారణ నిర్వహిస్తామని, నిర్ణయాల్లో చట్టబద్ధతను మాత్రమే సమీక్షిస్తామన్నారు. కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు వెళ్లకుండా నామినేషన్ల ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం/ ఛత్తీస్‌గఢ్ డిస్కంల నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చు కోవడంపై న్యాయవిచారణ జరపడానికి.. పాట్నా హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ'గా

మిగతా 10వ పేజీలో ▶

త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ

యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాలు, ఛత్తీస్‌గఢ్ పీపీఏపై అన్ని వర్గాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని జస్టిస్ నరసింహారెడ్డి వెల్లడించారు. దీనికోసం త్వరలో బహిరంగ ప్రకటన జారీ చేస్తామన్నారు. ఎవరైనా సరే ఈ–మెయిల్ ద్వారా లేదా లేఖ ద్వారా తమ వద్ద ఉన్న సమాచారం పంపొచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కొద్దిమంది వ్యక్తుల నుంచి సమాచార సేకరణకు పరిమితరీతిలో బహిరంగ విచారణ సైతం నిర్వహిస్తామని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు కూడా బహిరంగ విచారణలో పాల్గొని తమ వద్ద ఉన్న సమాచారం అందజేయవచ్చని చెప్పారు. విద్యుత్ ఉద్యోగులు ఈఆర్‌సీ బహిరంగ విచారణలకు హాజరు కావొద్దని గతంలో ఆంక్షలు విధించారని, ఈ పరిస్థితిలో కమిషన్ ముందు హాజరై సాక్ష్యం చెప్పే ఉద్యోగులకు రక్షణ కల్పిస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా, అది విద్యుత్ సంస్థల అంతర్గత విషయమన్నారు. దూషణలు, రాజకీయ విమర్శలకు తావులేకుండా విచారణ నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

ఆ రెండు పార్టీల ప్రయత్నాలు ఫలించవు

- బీఆర్‌ఎస్ పనైపోయింది.. బీజేపీకి చెప్పేందుకేమీ లేదు
- సానుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

సికింద్రాబాద్, వరంగల్ నియోజకవర్గాల సమీక్షలో సీఎం



ఆదివారం వరంగల్ సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, కడియం శ్రీహరి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ పనై పోయిందని, తాము చేసింది చెప్పి ఓట్లడిగేందుకు బీజేపీ దగ్గర ఏమీ లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు ఆ రెండు పార్టీలు చేసే ప్రయత్నాలు ఫలించబోవని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న సాను కూల రాజకీయ వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని విజయం సాధించేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. ఆదివారం జూబ్లీ హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సికింద్రా బాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన నాయకులతో ఆయన విడివిడిగా సమీక్ష నిర్వహించారు. పార్టీ అభ్యర్థులు దానం నాగేందర్, కడియం కావ్యలతో పాటు వరంగల్ జిల్లాకు చెందిన

మిగతా 3వ పేజీలో ▶

సీఎం రేవంత్ సమక్షంలో తెల్లం వెంకట్రావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొంగులేటి



కాంగ్రెస్‌లోకి మరో ఎమ్మెల్యే

సీఎం రేవంత్ సమక్షంలో చేరిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నుంచి మరో ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆదివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో పాటు పలువురు ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు చెందిననేతలు పాల్గొన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తెల్లం వెంకట్రావు బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచినా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో బీఆర్ ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. అధికారికంగా పార్టీలో చేరకపోయినా, కాంగ్రెస్ సమావేశాలకు కూడా ఆయన హాజరవుతూ వచ్చారు. శనివారం తుక్కుగూడలో జరిగిన జనజాతర సభకు కూడా ఆయన హాజరై వేదికపై కూర్చున్నారు. ఈయన కాంగ్రెస్‌లోకి వస్తారన్న ప్రచారం చాలాకాలంగా జరుగుతున్నా ఆదివారం పార్టీ కండువా కప్పుకుని అధికారికంగా ఆ పార్టీలో చేరారు. వెంకట్రావు చేరికతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం లేకుండాపోయింది. ఇప్పటికే కాంగ్రెస్‌కు చెందిన తొమ్మిది ఎమ్మెల్యేలు ఆ జిల్లాలో ఉండగా, వెంకట్రావు చేరికతో పదికి పది చోట్లా ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కావడం, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేల సంఖ్య మూడుకు చేరడం గమనార్హం.

కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నివేదిత!

ఉగాది సందర్భంగా రేపు అధికారికంగా ప్రకటించే అవకాశం



కేసీఆర్‌తో నివేదిత, ఆమె కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి

కంటోన్మెంట్ (హైదరాబాద్): సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదిత పేరు దాదాపు ఖరారైంది. ఆదివారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ అధినేత కేసీఆర్ ఈ నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. కంటోన్మెంట్ టికెట్ విషయంపై చర్చించారు. ఏడాదిలోనే ఇద్దరు ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య నందితలను కోల్పోవడం దురదృష్టకరమని.. ఆ కుటుంబానికి పార్టీ అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలోనే సాయన్న రెండో కుమార్తె, లాస్య నందిత సోదరి నివేదితను ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేయించనున్నట్టు పార్టీ నేతలకు కేసీఆర్ స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ స్థానంలో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌ల సమక్షంలోనే కేసీఆర్ తన నిర్ణయాన్ని వెల్లడించినట్టు సమాచారం. నివేదిత గెలుపు కోసం పనిచేయాలని వారిని కోరినట్టు తెలిసింది. ఉగాది సందర్భంగా మంగళవారం నివేదిత అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం.

ఇదండీ వరస



పగటిపూట ఎండలు మండుతున్నాయని ఇలా మధ్యరాత్రి వచ్చి ప్రచారం చేస్తే ఎలాగయ్యా!

అడవి తల్లిని వీడం.. బయటకెళ్లి బతకలేం

నల్లమలలోని చెంచుల వివరాలు

చెంచుల ఆవాసాలు	గ్రామ పంచాయతీలు	చెంచు కుటుంబాలు		
88	69	2,595	పురుషులు :	4,341
			స్త్రీలు:	4,443
			మొత్తం :	8,784



మల్లాపూర్ పెంటలోని చెంచుల ఇల్లు

మైదాన ప్రాంతాలకు తరలింపును వ్యతిరేకిస్తున్న చెంచులు

- నల్లమల నుంచి సార్లపల్లి వాసుల రీలొకేషన్‌కు సర్వం సిద్ధం
- ఎన్టీసీఏ ద్వారా ప్రత్యేక ప్యాకేజీకి సన్నాహాలు
- పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద పునరావాసానికి ఏర్పాట్లు
- అయితే తాము వెళ్లేది లేదంటున్న చెంచులు
- తరలింపు స్వచ్ఛందమే అంటున్న అటవీ అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: అడవి నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు చెంచులు తీవ్ర విముఖత చూపుతున్నారు. ఏళ్లుగా అడవినే నమ్ముకుని జీవిస్తున్న తాము బయటకు వెళ్లి బతకలేమని, తాము అడవిలోనే ఉంటామని తేల్చి చెబుతున్నారు. అడవుల్లో పులులకు ఆటంకం లేకుండా జనసంచారాన్ని తగ్గించడంతో పాటు మానవులకు, వన్యప్రాణులకు మధ్య ఘర్షణ వాతావరణాన్ని తగ్గించే పేరిట నట్టడవిలోని చెంచులను మైదాన ప్రాంతాలకు తరలించాలని అటవీ అధికారులు నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఈ మేరకు నల్లమల అటవీప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఉన్న సార్లపల్లి చెంచుపెంట వాసులను అడవి వెలుపల ఉన్న మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లా డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ నుంచి రీలొకేషన్‌కు అనుమతి రావడంతో ఈ నెల 5వ తేదీ మొదలు గ్రామస్తుల నుంచి ఒప్పందాలపై సంతకాల సేకరణ ప్రారంభించింది. రీలొకేషన్‌లో భాగంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీకి లబ్ధిదారుల మధ్య మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్(ఎంఓయూ) పత్రాలు రాసుకునేందుకు అటవీశాఖ అధికారులు గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరో రెండు, మూడు నెలల్లోనే సార్లపల్లి వాసుల రీలొకేషన్ ప్రక్రియను ప్రారంభించేందుకు అటవీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. సార్లపల్లి తర్వాత విడతల వారీగా కుడిచింతలబైల్, కొల్లంపెంట, కొమ్మెనపెంట వాసులను సైతం అడవి బయటకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ చర్యలను చెంచులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విడతల వారీగా తమను

మిగతా 10వ పేజీలో ▶



ముంబై అదిరే బోణీ

ఎట్టకేలకు తమ నాలుగో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ జట్టు ఐపీఎల్ 17వ సీజన్‌లో గెలుపు రుచి చూసింది. ఈ సీజన్‌లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన ముంబై ఇండియన్స్ ఆదివారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుపై 29 పరుగుల తేడాతో గెలిచింది.

- వివరాలు 12లో

సాగర్ ఎడమ కాల్వకు నీరు నిలిపివేత



నాగార్జునసాగర్: సాగర్ ఎడమ కాల్వకు ఆదివారం నీటిని నిలిపివేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి వారంరోజుల పాటు కాల్వకు నీటిని విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో తాగునీటి కోసం పెద్దదేవులపల్లి చెరువుతో పాటు ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయం నింపేందుకు వారం రోజుల్లో 2.23 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 511.20 అడుగులు ఉంది. ఈ జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు కాగా, కనిష్ఠ స్థాయి నీటిమట్టం 510.00 అడుగులు.

రేవంత్‌రెడ్డిది ప్రతీకార పాలన

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



కరీంనగర్: సీఎం రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన కాదని.. ప్రతీకార పాలన అని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా యుద్ధభేరి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, ఈ ఎన్నికలు పదేళ్ల అభివృద్ధికి.. వందరోజుల అబద్ధపు పాలనకు జరుగుతున్న యుద్ధమని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయాలని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు, విష ప్రచారాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు, బహుజనవాదులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం, గారడీ చేస్తోందని విమర్శించారు. బీజేపీ దేశానికి పెను ప్రమాదమని, రాజ్యాంగాన్ని మార్చి బహుజనులను ఆగం చేసి, మనువాద ఎజెండాను అమలుచేయాలని చూస్తోందని దుయ్యబట్టారు. కరీంనగర్‌లో బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధే తప్ప.. బండి సంజయ్ చేసిందేమీ లేదన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ మాట్లాడుతూ పదేళ్ల పాలనను ప్రజలు గుర్తు చేసుకోవాలని, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మాయమాటలు నమ్మవద్దని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని సూచించారు.

కాంగ్రెస్ పంచ న్యాయాలంటే ప్రజలకు పంగనామాలే

బీజేపీ నేత కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పంచన్యాయాల పేరుతో ప్రజలకు పంగనామాలు పెట్టేందుకు సిద్ధమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఇప్పటికీ అమలు కాలేదని, ఇప్పుడు దేశంలోని మహిళలకు ఏటా రూ.లక్ష ఇస్తామంటే ఎవరు నమ్ముతారని వ్యాఖ్యానించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా తెలంగాణ డైరీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తుక్కుగూడ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించడానికి తెరలేపిందన్నారు. ఆరు గ్యారంటీలకు దిక్కులేకున్నా.. దేశప్రజలను మరోసారి గ్యారంటీల పేరుతో మభ్యపెట్టా లని చూస్తోందన్నారు. తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ సభ విఫలమైందన్నారు. అప్పట్లో అంబేడ్కర్‌ను ఓడించడానికి కుట్ర పన్నిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆయన పేరునే వాడుకుంటోందని, అయితే కనీసం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ ఫోటో కూడా ఉండదని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మోదీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చి వారి గౌరవాన్ని పెంచిందని పేర్కొన్నారు. విశ్వకర్మ పథకం ద్వారా కులవృత్తులకు చేయూతనిచ్చామని వివరించారు.

బీజేపీ విద్వేష రాజకీయాలు

కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ విద్వేషంతో రాజకీయం చేస్తుంటే.. రాహుల్ గాంధీ ప్రేమతో రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. జై శ్రీరామ్ పేరుతో బీజేపీ ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. ఆయన ఆదివారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ రక్తంలోనే పేదల గురించి ఆలోచించే గుణం ఉందని, ఆయన ప్రధాని అయితే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. పేదవాడి ఆత్మ ఉండేలా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో రూపొందించారని పేర్కొన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చినట్టే.. దేశంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావాలని హనుమంతరావు ఆకాంక్షించారు.

నాడు నిండు కుండ.. నేడు ఎడారిలా..



టేకుమట్ల చలివాగు అప్పుడు..

టేకుమట్ల: గత ఏడాది జూలైలో కురిసిన వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని చలివాగు, మానేరువాగులు నిండుకుండల్లా దర్శనమిచ్చాయి. ఆగస్టులోనూ అత్యంత భారీ వర్షాలు కురవడంతో పలుచోట్ల చెరువులు తెగి.. భారీ వరదల కారణంగా టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగు వంతెన సైతం కొంత మేర కూలిపోయింది. ఆగస్టు తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో చలివాగు, మానేరుల్లో నీటి జలధార పూర్తిగా నిలిచిపోయింది. మార్చి నుంచే చలివాగు, మానేరుల్లో పూర్తిగా నీరు లేక ఎడారిని తలపిస్తున్నది. యాసంగి పంటల కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిని కాల్వల ద్వారా చలివాగు, మానేరుల్లోకి ప్రతి సంవత్సరం వదిలేవారు. కానీ నీటి ఎద్దడి ఏర్పడడంతో ఇప్పటివరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిని విడుదల చేయకపోవడంతో భూగర్భజలాలు సైతం అడుగంటిపోయాయి. దీంతో సాగునీటికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



టేకుమట్ల చలివాగు ప్రస్తుతం..

నీళ్లు.. నేలమట్టం



నాగార్జునసాగర్ జలాశయం ఇలా..



జూరాల జలాశయం పరిస్థితి ఇలా..

▶ మొదటి పేజీ తరువాయి

శరవేగంగా అడుగంటిపోతూ వచ్చాయి. ప్రస్తుతం కృష్ణా, గోదావరి బేసిన్లలో 14 ప్రధాన జలాశయాలు డెడ్ స్టోరేజీకి చేరాయి. దీనితో మే, జూన్ నెలల్లో తాగునీటికి కూడా కటకట తప్పని పరిస్థితి నెలకొంది. ఒకవేళ జూన్‌లో వానలు ఆలస్యంగా మొదలైతే.. పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

'కృష్ణా'లో ఏడేళ్ల తర్వాత మళ్లీ కరువు..

ఏడేళ్ల తర్వాత ప్రస్తుత వాటర్ ఇయర్‌లో కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు అతి తక్కువ ఇన్‌ఫ్లో వచ్చింది. శ్రీశైలం జలాశయానికి ఏటా సగటున వెయ్యి నుంచి రెండు వేల టీఎంసీల వరద వస్తుందని అంచనా. కానీ 2015–16లో అతి తక్కువగా 71 టీఎంసీలే చేరింది. ఆ తర్వాత మళ్లీ 2023–24లో 144.36 టీఎంసీలు మాత్రమే వరద వచ్చింది. ఇక నాగార్జునసాగర్‌కు కూడా సాధారణంగా వెయ్యి నుంచి రెండు వేల టీఎంసీలు రావాల్సి ఉండగా.. 2015–16లో కేవలం 72 టీఎంసీలు.. ఆ తర్వాత మళ్లీ తక్కువగా ఈసారి 147 టీఎంసీలు వరద మాత్రమే వచ్చింది.

కనీస నిల్వలూ కరువే!

శ్రీశైలం జలాశయంలో సాగునీటి అవసరాలకు ఉండాల్సిన కనీస నిల్వ మట్టం (ఎండీడీఎల్) 854 అడుగులుకాగా.. ఇప్పటికే 810 అడుగులకు పడిపోయింది. నిల్వలు 34.29 టీఎంసీలకు పడిపోయాయి. నాగార్జునసాగర్ కనీస నిల్వ మట్టం (ఎండీడీఎల్) 510 అడుగులుకాగా.. ప్రస్తుతం 511.5 అడుగుల వద్ద ఉంది. నిల్వలు 134.23 టీఎంసీలకు తగ్గిపోయాయి. అయితే ఇందులో వాడుకోగల నీళ్లు అతి తక్కువే. ఇక జూరాల ప్రాజెక్టు కనీస మట్టం 1,033 అడుగులకుగాను.. ఇప్పటికే 1,031.27 అడుగులకు పడిపోయింది.

ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు, నిల్వల తీరు.. (నీటిమట్టం.. అడుగుల్లో/ నిల్వలు.. టీఎంసీల్లో)

జలాశయం	గరిష్ట మట్టం/నిల్వ సామర్థ్యం		01-12-2022 నాటికి		01-12-2023 నాటికి		05-04-2024 నాటికి	
జూరాల	1045	9.66	1044.69	9.46	1041.6	7.61	1031.32	3.2
శ్రీశైలం	885	215.81	869	137.59	838.6	59.75	810	34.29
నాగార్జునసాగర్	590	312.05	586.6	303.43	524	156.67	511.9	134.92
శ్రీరామ్‌సాగర్	1091	90.31	1091	90.31	1088.9	79.3	1059.1	12.64
ఎల్లంపల్లి	485.56	20.18	485.56	20.18	480.68	16.16	466.24	7.59
కడెం	700	7.6	695.4	6.46	683	3.96	675.33	2.82
మిడ్‌మానేరు	1043.31	27.5	1040.88	25.67	1037.86	23.44	1007.81	7.59
దిగువ మానేరు	920	24.07	917.85	22.19	914.80	19.76	887.8	5.23

గోదావరిలో మూడేళ్ల కనిష్టానికి వరదలు

గోదావరి నది బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులకు ఈ ఏడాది ఇన్‌ఫ్లోలు గణనీయంగా తగ్గాయి. ఇంత తక్కువ వరదలు రావడం మూడేళ్ల తర్వాత ఈసారే. కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 2023–24లో 203.73 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. 2019–20 తర్వాత ఇంత తక్కువ వరద రావడం ఇదే తొలిసారి. 2022–23లో 593 టీఎంసీలు, 2021–22లో 678 టీఎంసీలు, 2020–21లో 368 టీఎంసీలు వచ్చింది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కూడా 2019–20 తర్వాత ఈసారి అతితక్కువగా 396 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. ప్రస్తుతం జలాశయంలో 7.53 టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయి. 20.1 టీఎంసీల గరిష్ట నీటి నిల్వ సామర్థ్యమున్న ఈ ప్రాజెక్టులో గత ఏడాది ఇదే సమయానికి 12.26 టీఎంసీల నీళ్లు ఉండటం గమనార్హం. ఇక ఈ ఏడాది మిడ్ మానేరు ప్రాజెక్టుకు 45 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. దిగువ మానేరుకు సైతం 2019–20 తర్వాత అతితక్కువగా ఈ ఏడాది 78 టీఎంసీలే ఇన్‌ఫ్లో నమోదైంది.

ఒకేసారి వచ్చి.. లాభం లేక..

గోదావరిపై ప్రధాన ప్రాజెక్టుల్లోకి వందల టీఎంసీల్లో నీరు వచ్చినట్టు లెక్కలు చెప్తున్నా.. అదంతా భారీ వరద కొనసాగే కొద్దిరోజుల్లోనే కావడం గమనార్హం. అప్పుడు ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో నీరంతా దిగువకు వెళ్లిపోయింది. తర్వాత వానలు లేక ఇన్‌ఫ్లో లేకుండా పోయింది. ప్రాజెక్టులు అడుగంటే పరిస్థితి వచ్చింది.

మంజీరా వెలవెల

సంగారెడ్డి జిల్లాలోని మంజీరా రిజర్వాయర్‌లోనూ నీళ్లు అడుగంటుతున్నాయి. హైదరాబాద్ జంట నగరాలకు మంజీరా నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. ఏప్రిల్ తొలివారంలోనే ఇలా ఉంటే.. మే వచ్చే సరికి నీటి సరఫరా పరిస్థితి ఏమిటన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన ఇసుక తిన్నెలు తేలి ఎడారిని తలపిస్తున్న గోదావరి నది

60 ఏళ్లుగా నీళ్లు ఇంకలే



నడిగూడెం: ఆ బావి వయసు 60 ఏళ్లు.. అప్పటినుంచి నిరాటంకంగా నీళ్లం దిస్తూనే ఉంది. ఎండిపోకుండా దాహం తీరుస్తూనే ఉంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిధిలోని రామాపురంలో ఈ వేసవిలో పెరుగుతున్న ఎండలకు గ్రామ పంచాయతీలోని ఆరు బోర్లతో పాటు మూడు చేదబావుల్లో జలాలు పూర్తిగా తగ్గాయి. ఇప్పటికీ గ్రామానికి చెందిన 10 కుటుంబాలవారు ఆ బావికి మోటార్లు ఏర్పాటు చేసుకొని నీటిని వాడుకుంటున్నారు.

మరో రెండు రోజులు కుతకుత!


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రిపూట కూడా వేడిగా ఉంటోంది. అది తగ్గకముందే.. పొద్దున్నే మళ్లీ ఎండ వేడి రాజుకుంటోంది. వాతావరణంలో తేమశాతం పెరిగిపోవడంతో ఉక్కపోత తీవ్రమైంది. పగటి పూటే కాదు.. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం తీవ్రంగా అవస్థ పడుతున్నారు. ఆదివారం రాష్ట్రంలో అత్యధికంగా నల్లగొండలో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

పలుచోట్ల వడగాడ్పులకు చాన్స్..

చాలాచోట్ల సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అత్యధికంగా ఖమ్మంలో సాధారణం కంటే 5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్, నల్లగొండ ప్రాంతాల్లో 3.5 డిగ్రీలు అధికంగా.. మిగతాచోట్ల 2, 3 డిగ్రీల మేర ఎక్కువగా నమోదవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మరో రెండు రోజులు ఉష్ణోగ్రతలు ఇదే తరహాలో ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని.. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు పడవచ్చని వెల్లడించారు.

ఆదివారం తెలంగాణ, ఏపీల్లో నమోదైన ఉష్ణోగ్రతలివీ.. (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
మార్కాపురం	46.0	22.0
నల్లగొండ	42.0	25.2
ఖమ్మం	41.6	26.2
మెదక్	41.6	25.3
హనుమకొండ	41.0	25.0
భద్రాచలం	41.0	27.0
విజయవాడ	41.0	26.0
మహబూబ్‌నగర్	40.7	27.8
హైదరాబాద్	40.7	27.7
రామగుండం	40.6	26.8
నిజామాబాద్	40.5	27.6
విశాఖపట్నం	38.2	26.8



ఇద్దరు అన్నదాతల ఆత్మహత్య

పంట ఎండిపోయి ఒకరు... తెగుళ్లు, నీటికొరతతో మరొకరు..

మిరుదొడ్డి (దుబ్బాక)/ రామగిరి (మంథని): ఏడు బోర్లు వేసినా నీరందక పంట ఎండిపోవడంతో మనోవేదనతో ఓ రైతు, ఆరుగాలం కష్టపడ్డా నీటి కొరతతో పత్తి పంటకు దిగుబడి రాలేదన్న బాధతో మరో రైతు పురుగుల మందు తాగి తనువు చాలించారు. సిద్దిపేట, పెద్దపల్లి జిల్లాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. వివరాలు.. తొగుట మండల కేంద్రానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్‌కు (48) వ్యవసాయమే జీవనాధారం. భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడిని పోషించుకుంటూ బతుకు వెళ్లదీస్తున్నాడు. మిరుదొడ్డి మండల పరిధిలోని కాసులాబాద్ శివారులో నాలుగు ఎకరాల భూమిని కౌలుగోలు చేసి వరి పంట వేశారు. భూగర్భ జలాలు వట్టిపోవడం.. మండుతున్న ఎండలతో రెండు ఎకరాలు పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో సుమారు రూ.6 లక్షల వరకు అప్పు చేసి 7 బోరు బావులు తవ్వించాడు. అందులో ఒకటి రెండు బోరు బావుల నుంచి సన్నటి నీటి ధార మాత్రం వస్తోంది. పొట్ట దశకు వచ్చిన రెండు ఎకరాలకు సాగు నీరు అందక ఎండు ముఖం పట్టింది. దీంతో మనోవేదనకు గురైన శ్రీనివాస్ శనివారం సాయంత్రం పొలం వద్దే పురుగు మందు తాగాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మరోఘటనలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన ఉడుత సంతోష్ యాదవ్ (34) రెండేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నాడు. ఇందుకోసం కొంత అప్పు తీసుకొచ్చాడు. తనకున్న 8 ఎకరాల్లో పత్తి వేశాడు. ఇందుకోసం బ్యాంకులో మరికొంత లోన్ తీసుకున్నాడు. అప్పు రూ.35 లక్షల వరకు చేరింది. పత్తి పంట అధిక దిగుబడి వస్తే మొత్తం అప్పు తీర్చవచ్చని భావించాడు. కానీ, తెగుళ్లు, నీటి కొరతతో ఆశించిన దిగుబడి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన సంతోష్ ఈనెల 3న గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



రైతు చిక్కుడు శ్రీనివాస్ (ఫైల్)



ఉడుత సంతోష్ యాదవ్ (ఫైల్)

హైదరాబాద్ అభ్యర్థి మాధవీలతకు ప్రధాని ప్రశంసలు





సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాధవీలతకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. తాజాగా ఓ టీవీలో నిర్వహించే ఆప్‌కీ అదాలత్ కార్యక్రమంలో మాధవీలత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాత రజత్‌శర్మ ప్రశ్నలకు మాధవీలత ఇచ్చిన సమాధానాలు అసాధరణమైనవని, చాలా దృఢమైన అంశాలు ప్రస్తావించారని, తర్కంతో మాట్లాడారని ప్రధాని ప్రశంసించారు. ఈ కార్య క్రమాన్ని అందరూ వీక్షించాలంటూ ప్రధాని మోదీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల మేడ్చల్ జిల్లా చెంగిచర్లలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ మొదలు.. ఒకప్పుడు సంతోష్‌నగర్‌లో తన ఇల్లు వర్షపు నీటిలో మునిగిపోయిన ఘటన వరకు పలు అంశాలను మాధవీలత గుర్తుచేసుకున్నారు. తన చిన్నతనంలో హైదరాబాద్‌లో మత ఘర్షణలు ఎంత భయానక వాతావరణం సృష్టించేవో తెలిపారు. మత ఘర్షణలకు, రాజకీయ కక్షలకు పెద్దగా తేడాలేదన్నారు. హైదరాబాద్ నగరం లక్షలాది మందికి ఐటీలో ఉపాధి కల్పిస్తున్నప్పటికీ నియోజకవర్గ ప్రజల భాగస్వామ్యం ఒకశాతం కూడా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్, కేటీఆర్‌వి పచ్చి అబద్ధాలు

20 లక్షల ఎకరాలు ఎండిపోయాయంటూ తప్పుదోవ పట్టిస్తున్నారు: చిన్నారెడ్డి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలు ఎండిపోయాయంటూ బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి ఆరోపించారు. గత వర్షాకాలంలో తక్కువ వర్షపాతం ఉండటం వల్ల సుమారు రెండు లక్షల ఎకరాల వరకు ఎండిపోయి ఉంటాయని, కానీ వాటిని ఎక్కువగా చూపుతూ రైతులను తప్పు దోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ శాఖ విశ్రాంత అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ అధికారుల సంక్షేమ సంఘం చైర్మన్, రిటైర్డ్ సంయుక్త వ్యవసాయ సంచాలకులు భోమిరెడ్డి కృపాకర్‌రెడ్డి జన్మది నాన్ని పురస్కరించుకుని ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్నారెడ్డి మాట్లాడుతూ, రానున్న పార్లమెంటు ఎన్నికలలో లబ్ధిపొందేందుకు రైతులను, ప్రజలను ప్రతిపక్షాలు తప్పుదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ సంస్థల అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి. కృపాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సి.ఆర్.బిస్వాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కృపాకర్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

మంత్రి దామోదర రాజనర్సింహ హామీ



బాన్సువాడ: కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలలో కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం కల్పిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహ హామీ ఇచ్చారు. బాన్సువాడలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చారన్నారు. ప్రస్తుతం అన్ని కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోచుకునేందుకు కష్టపడుతున్నారా?

- ఢిల్లీకి సంచులు మోయడంలో సీఎం బిజీ
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రోజుకు 18 గంటలు కష్టపడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, దోచుకోవడానికి కష్టపడుతున్నారా? అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. వందరోజుల్లో సంపద అంతా దోచుకున్నారని, రాష్ట్రం నుంచి ఢిల్లీకి సంచులు మోస్తున్నారని ఆరోపించారు. కరువుతో రైతులు బాధపడుతున్నా..తుక్కుగూడ సభలో ఒక్క కాంగ్రెస్ నాయకుడు సైతం రైతుల గురించి మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9నే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసగించారన్నారు. ఇప్పుడు దేశ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు శ్రీకారం చుట్టారని, 2014 కంటే ముందు అరాచకాలు మళ్లీ రాష్ట్రంలో మొదలయ్యాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని, కేసుల గురించి ఎన్నడూ మాట్లాడ లేదని, మేము రైతుల గురించి మాట్లాడుతుంటే, కాంగ్రెస్‌వారు పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లా డుతున్నారని చెప్పారు. రైతుగోడు పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఐపీఎల్ మ్యాచ్ చూసేందుకు వెళ్లాడన్నారు. ఓ వైపు పార్టీ మారిన వారిని పక్కన కూర్చోబెట్టుకొని, మరోవైపు పార్టీ మారిన వారిని డిస్ క్వాలిఫై చేయాలని చట్టం తెస్తామని మాట్లాడుతుంటే.. నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి చూసి బాధపడి కేసీఆర్ సూచనలు ఇస్తుంటే..అవి పట్టించుకోకుండా కాంగ్రెస్ నాయకులు కేసీఆర్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏ నిబంధనలు లేకుండా కృష్ణా జలాలను నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు సాగునీటికి విడుదల చేసి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, వి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మరో ఎనిమిది.. జిల్లాకు ఒకటి

ఈ ఏడాది కొత్తగా ప్రారంభం కానున్న 8 ప్రభుత్వ వైద్య కళాశాలలు

- 33 జిల్లాల్లో మొత్తంమీద అందుబాటులోకి రానున్న 34 సర్కారు మెడికల్ కాలేజీలు
- ఇప్పటికే అన్ని కాలేజీల్లో అధ్యాపక నియామకాలు పూర్తి
- తాజాగా స్టాఫ్ నర్స్ సహా మరికొన్ని పోస్టుల భర్తీకి నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది మరో 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రానున్నాయి. 2024–25 వైద్య విద్యాసంవత్సరంలో జోగులాంబ గద్వాల, నారాయణ్‌పేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజీగిరి జిల్లాల్లో ఈ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. ఒక్కో కాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. 33 జిల్లాలకుగాను ఇప్పటికే 26 జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటవగా కొత్తగా 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను దాదాపు జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటైనట్లు అవుతుంది.

ప్రభుత్వ, ప్రైవేటులో దాదాపు 10 వేల సీట్లు..

2014లో ప్రభుత్వ కాలేజీల్లో కేవలం 850 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా ప్రస్తుతం 3,915 సీట్లు ఉన్నాయి. కొత్తగా అందుబాటులోకి రానున్న 8 ప్రభుత్వ కాలేజీల వల్ల అదనంగా 800 సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సీట్ల సంఖ్యపై కొంత స్పష్టత రావాల్సి ఉంది. కొత్త కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, పడకల సంఖ్యను జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) పరిశీలించాల్సి ఉంది. అయితే ఆయా కాలేజీల్లో ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ, లైబ్రరీ, భవనాలు మొదలైన వాటిని చూస్తే కొన్ని కాలేజీల్లో 50 సీట్లకు మించి ఎన్ఎంసీ ప్రస్తుతం అనుమతి ఇచ్చే అవకాశం కనిపించట్లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి కావాలంటే ప్రతి కాలేజీలో 21 స్పెషలైజేషన్ విభాగాలు ఉండాలి. అలాగే పడకల ఆక్యుపెన్సీ ఏటా కనీసం 80 శాతం ఉండాలి. 50 సీట్లకు 220 పడకలు, 100 సీట్లకు 420 పడకలు, 150 సీట్లకు 605 పడకలు... ప్రతి 50 సీట్లకు ఒక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఉండాలి. కానీ మొత్తంగా చూస్తే ఈ ఏడాది రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో సీట్ల సంఖ్య దాదాపు 10 వేలకు పెరిగే అవకాశముంది.

ఫ్యాకల్టీ నియామకాలపై దృష్టి...

వైద్య, ఆరోగ్యశాఖ ఇప్పటికే మొత్తం ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, కొత్త కాలేజీల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించింది. ఎన్ఎంసీ తనిఖీల నేపథ్యంలో 4,356 అధ్యాపక పోస్టులను ఏడాది కాలానికి కాంట్రాక్టు, గౌరవ వేతనం పద్ధతిలో గత నెల భర్తీ చేసింది. ఇందులో 498 ప్రొఫెసర్ పోస్టులు, 786 అసోసియేట్ ప్రొఫెసర్, 1,459 అసిస్టెంట్ ప్రొఫెసర్, 412 ట్యూటర్, 1,201 సీనియర్ రెసిడెంట్స్ పోస్టులు ఉన్నాయి. తాజాగా మరికొన్ని పోస్టుల భర్తీకి కూడా ఆర్థికశాఖ అనుమతించింది. వైద్యవిద్య సంచాలకుల (డీఎంఈ) విభాగం పరిధిలోని 3,235 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయించింది. వాటిల్లో చాలావరకు కొత్త మెడికల్ కాలేజీల్లో భర్తీ చేసే అవకాశముంది. అందులో 555 టెక్నీషియన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులతోపాటు 14 లైబ్రేరియన్, 5 ఫిజికల్ డైరెక్టర్, 1,545 స్టాఫ్ నర్సుల పోస్టులు ఉన్నాయి.

ఐపీఎల్ టికెట్ల పేరిట మోసం!

తక్కువ ధరకే ఇస్తామంటూ దగా

- నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లలో టికెట్లు విక్రయిస్తున్నట్లుగా సైబర్ నేరగాళ్ల ప్రకటనలు
- అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు కొనండి: తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

సాక్షి, హైదరాబాద్: ఇప్పుడంతా ఐపీఎల్ ఫీవర్ నడుస్తోంది. క్రికెట్ అభిమానులు వారి అభిమాన జట్ల ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు అమిత ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు తక్కువ ధరకే ఐపీఎల్ టికెట్లు అంటూ సరికొత్త మోసానికి తెరతీశారు. నకిలీ వెబ్‌సైట్‌లు, యాప్‌లు సృష్టించి ప్రకటనలు ఇస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇదే తరహాలో సైబర్ నేరగాళ్ల మోసానికి చిక్కిన బెంగళూరుకు చెందిన మహిళ రూ.86 వేలు పోగొట్టుకున్నారు. మార్చి 29న జరిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ చూసేందుకు సదరు మహిళ ఫేస్‌బుక్‌లో 'ఐపీఎల్ క్రికెట్ టికెట్' అనే అకౌంట్ ద్వారా టికెట్ కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా సైబర్ నేరగాళ్లు మోసగించారు. సైబర్ నేరగాళ్లు ఐపీఎల్ టికెట్ల విక్రయం పేరిట మోసగించే ప్రమాదం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు హెచ్చరించారు.

ఆ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఐపీఎల్ టికెట్లను బుక్ మైషోలో అధికారికంగా విక్రయిస్తున్నారు. అచ్చం బుక్ మై షో మాదిరిగానే సైబర్ నేరగాళ్లు ఫేక్ వెబ్‌సైట్‌లను క్రియేట్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. బుక్‌మై షో తరహాలో దగ్గరగా ఉండే పేర్లతో వీటిని తయారు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇదే తరహాలో మోసగిస్తున్న 'book.myshow&premium.net', 'bookmyshow.cloud' అనే వెబ్‌సైట్లను పోలీసులు మూసివేయించారు. నకిలీ వెబ్‌సైట్‌లో ఎర్లీబర్డ్, స్పెషల్ డిస్కౌంట్, పది టికెట్లు కొంటే కొంత డిస్కౌంట్ ఇలా ఆఫర్లను పెడుతూ మోసగిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యూపీఐ విధానంలోనే పేమెంట్లు వసూలు చేస్తున్నట్టు తెలిపారు. మరికొన్ని కేసులలో సైబర్ నేరగాళ్లు టికెట్‌కు అయ్యే మొత్తంలో కొంత డబ్బులు ఆన్‌లైన్‌లో చెల్లించి బుక్ చేసుకోండి..తర్వాత స్టేడియం వద్ద మిగిలిన సొమ్ము చెల్లించి టికెట్లు పొందండి అంటూ బురిడీ కొట్టిస్తున్నట్టు తెలిపారు.

ఆ వెబ్‌సైట్లలోనే కొనండి

కేవలం అధికారిక వెబ్‌సైట్‌లలో మాత్రమే ఐపీఎల్ టికెట్లు కొనాలని, ఫేక్ వెబ్‌సైట్ల మోసాలకు గురి కావొద్దని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు హెచ్చరించారు. ఐపీఎల్ సీజన్ ఇంకా నడుస్తున్నందున టికెట్ల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. టికెట్ కొనుగోలు చేసేందుకు వ్యక్తిగత, బ్యాంకు ఖాతా, ఏటీఎం, క్రెడిట్ కార్డు నంబర్లు, పిన్ నంబర్లు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని, అది సైబర్ మోసంగా గుర్తించాలని వారు పేర్కొంటున్నారు. సైబర్ మోసాలపై సైబర్ క్రైం పోలీసులకు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖాళీ

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సూర్యాపేట: పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కానీ మూడు నెలల్లోనే తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిని మూడు లక్షల నుంచి 5 లక్షల మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా రాదన్నారు. తనమీద ఎక్కడ కేసులు పెడతారో అన్న భయంతో ప్రజల దృష్టి మళ్లించడానికే కేసీఆర్ పొలం బాట పట్టారని విమర్శించారు. కరువు కారణంగా అప్పుల పాలై రైతులెవరూ చనిపోలేదన్నారు. ఎవరైనా చనిపోయి ఉంటే వారిని ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. 'కేసీఆర్, కేటీఆర్‌లకు చెబుతున్నా.. మీరు శవాల మీద పేలాలు ఏరుకునేలా వ్యవహరిస్తున్నారు. ఈ పద్ధతి మంచిది కాదు. శవ రాజకీయాలు చేస్తూ రైతుల జీవితాలతో ఆడుకోవద్దు'అని హితవు పలికారు. నయీం కేసుతో పాటు అన్ని కేసుల్లో దర్యాప్తు కొనసాగిస్తామన్నారు. భద్రాద్రి రాముల వారి పాదాల సాక్షిగా జూన్ 4 నుంచి ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇస్తామని తెలిపారు.

ఆ రెండు పార్టీల ప్రయత్నాలు ఫలించవు

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని కాంగ్రెస్ నేతలు అజారుద్దీన్, విజయారెడ్డి, ఫిరోజ్‌ఖాన్, రోహిణ్‌రెడ్డి, ఆదం సంతోశ్ తదితరులు హాజరయ్యారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలి

సికింద్రాబాద్ సమీక్షలో భాగంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గతంలో ఇక్కడ గెలిచిందని, ఇప్పుడు కూడా గెలవడం ద్వారా హైదరాబాద్ నగరంలో పార్టీకి పునర్వైభవం తీసుకురావాలని కో రారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి, ఇప్పటికి పరిస్థితిలో మార్పు వచ్చిందని, జీహెచ్ఎంసీ పరిధిలో కాంగ్రెస్ బలం పెరిగినందున ఈ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల నేతలందరితో కలిసి సమన్వ యంతో ముందుకెళితే గెలుపు కష్టమేమీ కాదని చెప్పారు. హైదరాబాద్‌లో కూడా కాంగ్రెస్ పార్టీకి ఆదరణ ఉందని చెప్పేందుకు సికింద్రాబాద్‌గెలుపు అవసరమని స్పష్టం చేశారు. వరంగల్ సమీక్ష సందర్భంగా.. సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి కుమార్తె కావ్యను ఇక్కడి నుంచి బరిలో దింపుతున్నందున అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల నాయకులు కష్టపడి పనిచేయాలని, కావ్య గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని సీఎం సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించాలని, బూత్ స్థాయి నుంచి కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేయాలని చెప్పారు.

నేడు కొడంగల్‌కు సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు వెళ్లను న్నారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని మండలాల వారీగా ఆయన సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశం తర్వాత సాయంత్రానికి సీఎం హైదరాబాద్ చేరుకుంటారని సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది.

కాంగ్రెస్‌ది దిక్కుమాలిన మేనిఫెస్టో

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ

సాక్షి, హైదరాబాద్: తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ సభలో దిక్కుమాలిన మేనిఫెస్టో విడుదల చేశారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే ఆరు గ్యారంటీలంటూ మోసగించిందని, ఇప్పుడు మరో ఐదు గ్యారంటీలంటూ ఊదరగొడుతోందని విమర్శించారు. ఆమె బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ చెప్పినట్టు కాంగ్రెస్ గ్యారంటీలన్నీ ఆత్మలే అన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడం చేతకాదు.. కానీ, ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లను చూస్తూ వినోదిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు మాని పరిపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. మహిళల ఖాతాల్లో ఏటా రూ.లక్ష గ్యారంటీతో కాంగ్రెస్ పార్టీ మభ్యపెడుతోందని ఆమె ఆరోపించారు.

పోటీ పరీక్షలపై ప్రొఫెసర్ నాగేశ్వర్ లైవ్‌షో

- టీ–శాట్ ద్వారా ప్రసారం చేస్తాం: సీఈఓ వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1, 2, 3 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం టీ–శాట్ ప్రత్యేక లైవ్ కార్యక్రమాలు ప్రసారం చేస్తుందని, ఇందులో భాగంగా ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌తో ఈ లైవ్ కార్యక్రమాలుంటాయని టీ–శాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగేశ్వర్ ఈ నెల 8వ తేదీన సలహాలు, సూచనలు అందిస్తారని, నిపుణ చానల్‌లో ఉదయం 11 గంటల నుంచి ప్రసారమయ్యే లైవ్‌లో అభ్యర్థులు తమ సందేహాలను ఫోన్ కాల్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 040- 23540326/726, టోల్ ఫ్రీ నంబరు 1800 425 4039లకు కాల్ చేయాలని సూచించారు. ఇవే ప్రసారాలు టీ–శాట్ విద్య చానల్‌లో సోమవారం సాయంత్రం 6 గంటలకు పునఃప్రసారంఅవుతాయన్నారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు ఇప్పటికే 'ఎక్స్‌ప్లే యిన్డ్ బై ప్రొఫెసర్ నాగేశ్వర్' అనే శీర్షికతో అవగాహన కార్యక్రమాన్ని ఇటీవలే ప్రారంభించినట్టు వివరించారు.

రేవంత్‌రెడ్డికి అభద్రతా భావం మొదలైంది

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో అభద్రతా భావం మొదలైందని, కేబినెట్‌లోని మంత్రులెవరూ ఆయనకు సహకరించట్లేదని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు వ్యాఖ్యానించారు. కొద్దిరోజుల్లోనే నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డిపై తిరుగుబాటు చేస్తారని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేసే దమ్ము, ధైర్యం రేవంత్‌కు లేదని, దమ్ముంటే టచ్ చేసి చూడమనండి.. పరిస్థితి ఎలా ఉంటుందో చూపుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.



మీ లోతైన తత్వశాస్త్రం కంటే
మీ శరీరంలో ఎక్కువ జ్ఞానం ఉంది.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 8 ఏప్రిల్ 2024

ప్ర'పంచాంగం'

విశ్వంలో ఏదైనా చక్రగతిలోనే తప్ప సరళరేఖలో సాగదు; మానవజీవితమూ దీనికి మినహాయింపు కాదు. పగటిని రాత్రి అనుసరిస్తుంది; సూర్యుని చంద్రుడూ, నక్షత్రాలూ అనుసరిస్తాయి. మనిషి జీవితంలోనూ సుఖాల వెలుగును వెన్నంటే కష్టాల చీకట్లూ ఉంటాయి. జీవపరిణామక్రమంలో మనిషిలో మెదడు అభివృద్ధి చెంది ఆలోచన పదునెక్కినకొద్దీ అతణ్ణి అమితంగా తికమక పెట్టిన వాటిలో ఈ చక్రగమనం ఒకటి. మనుగడ పూర్తిగానూ, నేరుగానూ ప్రకృతివనరులపై ఆధారపడిన ఆదిమకాలంలో వేడి, వర్షం, చలి చక్రగతిని ఎందుకు అనుసరిస్తాయన్నది, కడుపు నిండిన తర్వాత కలిగే జిజ్ఞాస కాదు; కడుపు నింపుకోవడంతో ముడిపడిన చిక్కుప్రశ్న.

ఈ ఋతుపరివర్తనలో అతని చుట్టూ ఉన్న పరిసరాలు మారిపోయి; తను ఆహారం కోసం ఆధారపడిన కొన్ని రకాల జంతువులు అదృశ్యమై, కొత్తవి అడుగుపెడుతున్నాయి! దీనిని అర్థం చేసుకోడానికీ, దీనికి ఎవరు కారణమో తెలుసుకోడానికీ సమయం పట్టింది. పెరిగి తరిగే చంద్రకళలే కారణమనుకుని వాటిని కాలానికి అన్వయించుకుని ఋతుచక్రానికి కాలచక్రాన్ని జోడించుకున్నాడు. అలా కాలగణనంలో చాంద్రమానం అడుగుపెట్టి ఇప్పటికీ ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఆ క్రమంలోనే రేపు, అంటే చైత్ర శుక్ల పాడ్యమి నాడు మనం జరుపుకొంటున్నది స్వస్తిశ్రీ చాంద్రమాన క్రోధి నామ సంవత్సర ఉగాది.

ఉగాదిని ఇప్పుడు మనం ఒక పండుగగానే భావిస్తాం; గడిచిన ఏడాది ఎదురైన కష్టనష్టాలూ, ఆశాభంగాల పాత దుస్తులు విడిచేసి కొత్త ఆశలూ, ఉత్సాహాల ఉడుపులు ధరించే సందర్భమనుకుంటాం; ఆరు రుచుల సమ్మేళనంగా జీవితాన్ని సంకేతించేదిగా గుర్తుపెట్టుకుంటాం; పంచాంగ శ్రవణానికీ, కవితా శ్రవణానికీ కూడా చెవులు అప్పగిస్తాం. నూతనశోభకు, శుభానికి తలుపు తెరిచేలా తోచే ఏ సందర్భమైనా పండుగే. అయితే, ఉగాది పేరిట కొత్త సంవత్సర ప్రారంభాన్ని పండుగగా మలచడం వెనుక ఎంతో కథ ఉంది; అంతుబట్టని కాలచక్రపు తిప్పుళ్ళకు బిత్తరపోయి, తిరిగి నిలదొక్కుకోడానికి బతుకు చేసే పెనుగులాట ఉంది; కాలగమనాన్ని అర్థం చేసుకోవడానికి పడిన అంతులేని వైజ్ఞానిక ప్రయాస ఉంది; మనం అనాగరికునిగా పొరబడే ఆదిమానవుణ్ణే తొలి ఖగోళవేత్తగా రూపించి నిరూపించే అద్భుత నేపథ్యం ఉంది. తప్పులు, సవరణల రూపంలో సాగిన ఆ కాలగణనం కసరత్తులోకి తొంగిచూసినప్పుడు నాటి మానవుల ఆరాటపోరాటాలతో పాటు మరెన్నో ఆసక్తికర విషయాలు మన కళ్లను మెరుపులా తాకి ఆశ్చర్యం గొలుపుతాయి.

చంద్రుని వృద్ధిక్షయాల ఆధారంగా కాలాన్ని గణించడం, యాభైవేల సంవత్సరాల క్రితమే పాతరాతియుగంలో మొదలైనట్టు శాస్త్రవేత్తలు నిరూపించారు. అప్పటి గుహాచిత్రాలలో కనిపించిన పొడవాటి దండాన్ని చంద్రకళల ఆధారంగా కాలాన్ని కొలిచే సాధనంగా గుర్తించారు. ఇప్పటికీ పన్నెండు రాశులలో ఒకటిగా ఉన్న మేషరాశిని సూచించే పొట్టేలు బొమ్మతో సహా వివిధ జంతువుల బొమ్మలు ఆ దండంపై ఉన్నాయి. అనంతరకాలంలో పురోహితులు, మాంత్రికులు, పాలకులు ధరించే దండాలకు అదే మాతృక అయినట్టు తేల్చారు. చంద్రునితో ఋతువుల మార్పును ముడిపెట్టి చాంద్రమానానికి అలా తెరదీయడం గొప్ప ముందడుగే కానీ; ఋతుచక్రానికి, చాంద్రమానంలోని మాసచక్రానికి పొంతన కుదరకపోవడంతో, ఋతుపరివర్తనకు సూర్యుడు కారణమన్న ఎరుక పుట్టి సౌరమానం అడుగుపెట్టింది. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ; ఇరవైమూడున్నర డిగ్రీల ఒంపుతో సూర్యుని చుట్టూ కూడా తిరుగుతోందన్న గ్రహింపు లేని ఆ కాలంలో కూడా సంవత్సరానికి 300 నుంచి 400 రోజులను లెక్కగట్టడాన్ని నేటి శాస్త్రవేత్తలు అబ్బురంగానే పరిగణిస్తారు. చాంద్రమానం సంవత్సరానికి 354 రోజులను లెక్కిస్తే, మరింత నిర్దుష్టమైన సౌరమానం 365 పైచిలుకు రోజులను లెక్కించింది. రెంటిమధ్యా ఉన్న 11 రోజుల పైచిలుకు తేడాను సరిపెట్టి రెండు మానాలనూ సమన్వయించడం ఖగోళ పండితులకు పెద్ద సవాలే అయింది. రోమన్, జూలియన్, గ్రెగేరియన్ లాంటి ఎన్ని కాలగణన పద్ధతులు వచ్చినా ఇలాంటి సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని 'కేలండర్ కథ' అనే పుస్తకంలో డా. మహీధర నళినీమోహన్ అంటారు.

మనదేశానికి చెందిన భాస్కరాచార్యులు సహా ప్రపంచవ్యాప్తంగా ఎందరో ఖగోళపండితులు సంవత్సరానికి 365 రోజుల పైచిలుకును సక్రమంగానే గుర్తించారు. కానీ అందులో ప్రకృతిసిద్ధంగా ఉన్న భిన్నాంకం వారి మేధకు లొంగేది కాదు. చాంద్రమానంలో భాగమైన నెలకు 29 రోజుల పైచిలుకు లెక్కా అలాంటిదే. భూభ్రమణంలో ఒంపు వల్ల కాలగణనంలో ఏర్పడే ఆ వైవిధ్యమే లేనప్పుడు ఋతుపరివర్తనే అంతరించి మరింత విషమసమస్య తలెత్తే మాటా నిజమే. మొత్తంమీద అప్పటినుంచీ ఇప్పటివరకూ కేవల చాంద్రమానం, కేవల సౌరమానం; చాంద్ర–సౌరమానాల సమన్వయం అనే మూడు పద్ధతులూ అమలులో ఉన్నాయి. విశేషమేమిటంటే, కాలగణానికి అనుసరించిన పద్ధతుల్లోనూ, ఆ క్రమంలో ఎదురైన సమస్యల పరిష్కారంలో సాఫల్య, వైఫల్యాలలోనూ ప్రపంచానుభవం ఒక్కలాంటిదే. కనుక 'పంచాంగం' అనే మాటను 'ప్రపంచాంగం'గానూ చెప్పుకోవడంలో తప్పులేదు.

పైన చెప్పిన సౌర, చాంద్రమానాల సమన్వయాన్నే 'యుగం' అంటారని 'జనకథ' అనే పుస్తకంలో రాంభట్ల కృష్ణమూర్తిగారి వివరణ. అధికమాసాలను పాటించడం ఇందులో భాగమే. అప్పుడు కూడా రెండు మానాల సమన్వయం అయిదేళ్ళకోసారే సాధ్యమవుతుంది. అదే అసలైన 'యుగాది'. ఇప్పుడు 'ఉగాది' పేరుతో ఏటా జరుపుకొంటున్నాం.

రైతుకు 'వినియోగ' ఆసరా!

విశ్లేషణ



దేవీందర్ శర్మ

'రైతు లేనిదే తిండి లేదు' అనేది పసలేని నినాదం కాదు. అందుకే వ్యవసాయాన్ని సజీవంగా ఉంచడానికి, ముందుకు తీసుకెళ్లడానికి వినియోగదారుల నిబద్ధత చాలా అవసరం. ఎల్లప్పుడూ ఆహారం చౌకగా ఉండాలని కోరుకునే బదులు, వినియోగదారులు తాము చెల్లించే న్యాయమైన, లాభదాయకమైన ధర రైతులకు మంచి జీవనాన్ని పొందడంలో మద్దతునిస్తుందని గ్రహించినట్లయితే, ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. అందుకు ప్రతిఫలంగా సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో అది వారికి సహాయపడుతుంది. వినియోగదారులు ఆహార గొలుసుపై నియంత్రణను క్రమేణా పెంచుకోవడంతో రైతుకూ, వినియోగదారుకూ మధ్య సంబంధం ఇద్దరికీ లాభదాయకం అవుతుంది. తద్వారా అది ఉత్పత్తుల అమ్మకాలలో ప్రతిబింబిస్తుంది.

2016లో ఫ్రాన్స్‌లో పాల ధరలు పడిపోయినప్పుడు 'ఎవరు బాస్?' అనే ఆలోచన వచ్చింది. ఫ్రెంచ్ డెయిరీ రైతులు కష్టాలను అధిగమించడంలో సహాయపడటానికి ప్రారంభించిన ఒక చిన్న ప్రయత్నమే 'ఎవరు బాస్?'. తర్వాత ఇది తనకుతానుగా ఒక ప్రత్యేకమైన వినియోగదారుల ఉద్యమంగా మారింది, ప్రపంచవ్యాప్తంగా దాని రెక్కలను విస్తరించింది. స్థిరమైన, పునరుత్పత్తి వ్యవసాయ వ్యవస్థలకు దారితీసే ఆరోగ్యకరమైన పరివర్తన దిశగా వ్యవసాయ ఆహార పరిశ్రమ పని చేస్తుందని నిర్ధారిస్తూ, ఫ్రెంచ్ ఆహార సహకార బ్రాండ్‌గా 'ఎవరు బాస్' అనే అవగాహనోద్యమం రైతులకు జీవనాధారంగా ఉద్భవించింది.



రైతులకు అధిక ధర ఇవ్వడం మార్కెట్లను కుప్పకూలుస్తుంది అని నమ్మే వారందరికీ, ఇక్కడ నేర్చుకోవడానికి గొప్ప అభ్యాసం ఉంది. ఎల్లప్పుడూ ఆహారం చౌకగా ఉండాలని కోరుకునే బదులు, వినియోగదారులు తాము చెల్లించే న్యాయమైన, లాభదాయకమైన ధర రైతులకు మంచి జీవనాన్ని పొందడంలో మద్దతునిస్తుందని గ్రహించినట్లయితే, ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. మరింతగా క్రమాంకనం చేస్తే, ప్రతిఫలంగా సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో అది వారికి సహాయపడుతుంది. వినియోగదారులు ఆహార గొలుసుపై నియంత్రణను క్రమేణా పెంచుకోవడంతో, ఈ క్విడ్ ప్రోకో (నీకిది, నాకది) సంబంధం మరింత పెరిగింది. ఇది ఆ ఉత్పత్తుల అమ్మకాలలో ప్రతిబింబిస్తుంది. సగటున 31 శాతం పైగా పెరిగింది.

కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలంటూ భారతీయ రైతులు నిరసన వ్యక్తం చేయడం ద్వారా ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుందని భయపడే ప్రధాన ఆర్థికవేత్తలు, మీడియా, మధ్యతరగతి వారు ఆగ్రహించిన తరుణంలో ఈ క్విడ్ ప్రో కో భావన ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఫ్రాన్స్, ఇతర ప్రాంతాలలో వినియోగదారులు స్వచ్ఛందంగా ఎక్కువ చెల్లిస్తున్నప్పుడు భయాందోళనలను సృష్టించే బదులు, భారత ఆర్థికవేత్తలు పంటలకు సరసమైన ధరను నిరాకరించడం వ్యవసాయ జీవనోపాధిని ఎలా చంపుతుందో గ్రహించి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించే ఈ ప్రయత్నం ఎంత కీలకమో వినియోగదారులకు అవగాహన కల్పించాలి. మొత్తానికి, వినియోగదారులు రైతుల కష్టాల పట్ల సున్నితంగా ఉంటారు. సరైన అవగాహనతో, వారు వినియోగ ప్రవర్తనను సులభంగా మార్చగలరు. అది మార్కెట్ శక్తులను సైతం మార్చేలా చేస్తుంది.

మిగులు ఉత్పత్తి కారణంగా ఫ్రాన్స్‌లో పాల ధరలు పడిపోయినప్పుడు ఆ పరిణామం ఫ్రెంచ్ పాడి పరిశ్రమ పతనానికి దాదాపుగా దారి తీసింది. పాడి రైతులు షట్టర్‌లు మూసివేయడం ప్రారంభించడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. ఆ కష్ట సమయాల్లో నికోలస్ చబన్నే. ఒక పాడి రైతు అయిన మార్షల్ దార్బన్‌ను కలుసుకున్నాడు. చబన్నే స్థానిక పాడి పరిశ్రమ సహకార సంస్థకు అధ్యక్షుడిగా ఉన్నారు. వారు రైతు సంఘం దుఃస్థితిని, చుట్టుపక్కల ఉన్న రైతుల బాధలను చర్చించినప్పుడు, రైతులను ఆదుకోవడానికి వినియోగదారులను ఒకచోట చేర్చే ఆలోచన రూపుదిద్దుకుంది. ''ఇది కష్టమని నాకు తెలుసు, కానీ ప్రయత్నించడం విలువైనదే'' అని నికోలస్ నాతో అన్నారు.

ఇలా 'ఎవరు బాస్?' అనేది రూపొందింది. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి ఆదుకోవడమే దీని లక్ష్యం. ''మనకు ఆహారం అందించే ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించడానికి ఇది అవసరం'' అని చబన్నే అన్నారు. 2016 అక్టోబర్‌లో, ఆపదలో ఉన్న 80 కుటుంబాలకు సహాయం చేస్తూ 7 మిలియన్ లీటర్ల పాలను విక్రయించే లక్ష్యంతో పాల కోసం బ్లూ కార్టన్ డిజైన్ ప్యాక్ ప్రారంభమైంది. సందేశాన్ని వ్యాప్తి చేయడంలో సహాయపడటానికి సోషల్ మీడియాను ఉపయోగించారు. రైతు చేయాల్సిందల్లా ఒక యూరో నమోదు రుసుము చెల్లించి, మంచి పద్ధతుల పట్ల తన నిబద్ధతను ప్రదర్శించడమే!

ఇది ప్రారంభమైన ఏడేళ్లలో, 'హూ ఈజ్ ది బాస్' సంఘీభావ బ్రాండ్ 424 మిలియన్ లీటర్ల పాలను లీటరుకు 0.54 యూరోల హామీతో కూడిన సరసమైన ధరకు విక్రయించింది. అయితే అది మార్కెట్ ధర కంటే 25 శాతం ఎక్కువ. అయినప్పటికీ ఇది నేడు ఫ్రాన్స్‌లో అత్యధికంగా అమ్ముడవుతున్న పాల బ్రాండ్‌గా ఉద్భవించింది. పైగా దాదాపు 300 వ్యవసాయ కుటుంబాలకు (వివిధ ఉత్పత్తుల కోసం సుమారు 3,000 మందికి) ఇది అండనిస్తోంది. మార్కెట్‌లో పనిచేసే ధరల వ్యత్యాసాల లాగా కాకుండా, మార్కెట్ ధోరణులతో హెచ్చుతగ్గులు లేని స్థిరమైన ధరను రైతులు పొందుతారు. ఫ్రాన్స్‌లో 38 శాతం రైతులు కనీస వేతనం కంటే తక్కువ సంపాదిస్తారనీ, పైగా 26 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవించి ఉన్నారని లెక్క. ఈ పరిస్థితుల్లో ఒక సర్వే ప్రకారం 75 శాతం మంది ప్రజలు తమ కొనుగోలుకు మరికొన్ని సెంట్లు జోడించడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తించడం హర్షించదగినది. ఇది ఉత్పత్తిదారులకు సరసమైన ధరకు హామీ ఇస్తుంది.

ఇది పాలతో ప్రారంభమైంది. కాలక్రమేణా ఈ సంఘీభావ బ్రాండ్ సేంద్రియ వెన్న, సేంద్రియ కాటేజ్ చీజ్, ఫ్రీ–రేంజ్ గుడ్లు, పెరుగు, ఆపిల్ రసం, ఆపిల్ పురీ, బంగాళాదుంపలు, పిండిచేసిన టమోటాలు, గోధుమ పిండి, చాక్లెట్, తేనె, ఘనీభవించిన గొడ్డు మాంసం(గ్రౌండ్ స్టీక్)తో సహా దాదాపు 18 ఉత్పత్తులకు విస్తరించింది. సహకార సంఘం సాగుదారులకు సరసమైన ధరను అందజేస్తున్నప్పటికీ, వారు ఆరోగ్యకరమైన పద్ధతులను అనుసరించాల్సి ఉంటుంది. అవేమిటంటే వంటకాల్లో లేదా పశువుల దాణాలో పామాయిల్ ఉపయోగించకపోవడం, జన్యుపరంగా మార్పు చెందిన పదార్థాలను వాడకపోవటం. సంవత్సరంలో కనీసం 4 నెలల పాటు జంతువులను మేపడం వంటివి.

ఈ భావన ఇప్పుడు జర్మనీ, బెల్జియం, గ్రీస్, ఇటలీ, మొరాకో, నెదర్లాండ్స్, స్పెయిన్, బ్రిటన్, అమెరికాలోని 9 దేశాల వినియోగదారులకు చేరువవుతోంది. ఇక్కడ ఫ్రెంచ్ మాతృ సంస్థతో లైసెన్సింగ్ ఒప్పందంతో వినియోగదారుల వ్యవస్థలు ఏర్పాటు చేయటం జరిగింది. ఫ్రాన్స్ తన పండ్లు, కూరగాయల అవసరాలలో 71 శాతం దిగుమతి చేసుకుంటుందని, ఇది స్థానిక ఉత్పత్తిదారుల జీవనోపాధిని దెబ్బతీస్తోందని గ్రహించిన నికోలస్ దేశీయ రైతులకు సహాయం చేయడానికి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ''మేము సుదూర ప్రపంచం నుండి రవాణా చేయకూడదనుకుంటున్నాము. మన స్థానిక ఉత్పత్తిదారులను, వారు ప్రతిరోజూ మన ఇంటి ముంగిట ఉత్పత్తి చేసే ఆహారాన్ని మనం రక్షించుకోవాలి'' అని ఆయన అన్నారు. స్థానిక ఉత్పత్తిదారులకు సహాయం చేయడానికి, సహకార బ్రాండ్ ఇటీవల తన ఆహార బాస్కెట్‌లో స్ట్రాబెర్రీ, తోటకూర, కివీ పళ్లను పరిచయం చేసింది.

మార్కెట్లు పోటీని తట్టుకునేందుకు అట్టడుగు స్థాయికి దూసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో 'ఎవరు బాస్' అనే ఆలోచన వారికి కలిసి వచ్చింది. ఏది ఏమైనప్పటికీ, వ్యవసాయ ఆదాయాలను పెంపొందించే విషయంలో ప్రపంచవ్యాప్తంగా విఫలమైన సాగుదారులను మార్కెట్‌లు కలిగి ఉన్నందున, రైతులకు వినియోగదారుల మద్దతుపై చాలావరకు ఈ 'ఎవరు బాస్' ఆధారపడి ఉంటుంది. ఫ్రాన్స్‌లోని 16 మిలియన్ల మంది ప్రజలు సాపేక్షంగా ఎక్కువ ధరలకు కొనుగోళ్లు చేయడం ద్వారా రైతులను ఆదుకోవడానికి ముందుకు వస్తే, నికోలస్ ప్రారంభించిన సంస్థ కచ్చితంగా చాలా ముందుకు వచ్చినట్లే అవుతుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇప్పుడెందుకు?



ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ నేత పి. చిదంబరం 70 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న 'గరీబీ హటావో' హామీనే తిరిగి హామీగా ఇస్తున్నారు. విషయం ఏంటంటే – భారతదేశంలో 2013–2014లో 29.17 శాతంగా ఉన్న పేదరికం 2022–23 నాటికి 11.28 శాతానికి గణనీయమైన తగ్గుదలను నమోదు చేసింది.

– సునందా రాయ్, వ్యంగ్య వ్యాఖ్యాత

'లా' ఇంగ్లీషే కాదా!



బీజేపీలోని రెండో మేధావి కంగనా రనౌత్ (తొలి మేధావి ఇప్పటికీ సుధాన్షు త్రివేది) చెబుతున్న దానిని బట్టి "సర్దార్ పటేల్‌కు ఇంగ్లిష్ రాదు. అందుకే ఆయన ప్రధాని కాలేకపోయారు". కానీ వాస్తవమేంటంటే లా డిగ్రీ చేయటానికి 1910లో పటేల్ ఇంగ్లండ్ వెళ్లారు. 1913లో లా పట్టభద్రులయ్యారు.

– స్వాతీ దీక్షిత్, సెంట్రిస్ట్

ఊపిరిపోసిన తీర్పు



'యు.పి.బోర్డ్ ఆఫ్ మదర్సా చట్టం – 2004' రాజ్యాంగ విరుద్ధమని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీమ్ కోర్టు స్టే విధించటంతో యూపీలోని 20 లక్షల మంది మదర్సా విద్యార్థులకు, 16 వేల మదర్సాలకు, 10 వేల మంది మదర్సా ఉపాధ్యాయులకు పెద్ద ఉపశమనం లభించినట్లయింది.

– ఆసిఫ్ ముజ్తబా, రిసెర్చ్ స్కాలర్


ప్రకృతి న్యాయం



ఆలయ ఆచారాల పేరిట జంతు హింసకు పాల్పడుతున్న వారు ఆ జంతువుల ఆగ్రహానికి గురైతే కనుక అందుకు వారు అర్హులే అని ఇటువంటి ఘటనలు చూసినప్పుడు మనసుకు అనిపిస్తుంది. (కేరళలో ఇటీవల ఆలయ ఆచార కార్యక్రమ నిర్వహణ సమయంలో ఆస్థాన ఏనుగు తొక్కడం వల్ల మావటి మరణించడంపై స్పందిస్తూ...)

– ఆనంద్ శంకరన్, సామాజిక వ్యవస్థాపకులు

అదేం జాడ్యం?!



మార్క్సిజం చరిత్రను ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటుంది. ప్రాచీన నాగరికతలు, నాటి రుషులపై వారికి అవగాహన లేదు. ఎంత గొప్పదాన్నయినా తేలిక చేసి పడేయటం కనిపిస్తుంది!

– డాక్టర్ డేవిడ్ ఫ్రాలే (పండిత వామదేవ శాస్త్రి)

ఇన్ బాక్స్

నిండుగ వెలుగు తెలుగు పండుగ

'ఉగాది' పేరు చెప్పగానే ముందుగా గుర్తుకు వచ్చేది అది మన తెలుగు పండుగ అని! ఉగాది నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ సృష్టిని ప్రారంభించారని నమ్ముతారు. మత్స్యావతారం ధరించిన విష్ణువు సోమకుని సంహరించి వేదాలను బ్రహ్మకప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణ ప్రతీతి. బ్రహ్మదేవుడు చైత్ర మాస శుక్లపక్ష ప్రథమ దినాన సూర్యోదయ వేళ సమగ్రంగా ఈ జగత్తును సృష్టించాడంటారు. 'ఉగాది', 'యుగాది' అనే రెండు పదాలు వాడుకలో ఉన్నాయి. 'ఉగ' అనగా నక్షత్ర గమనం. నక్షత్రగమనానికి 'ఆది'... 'ఉగాది'. అంటే సృష్టి ఆరంభమైన దినమే 'ఉగాది'.

ఉగాది పండుగ రోజున త్వరగా నిద్రలేచి ఇంటి ముందర ముగ్గులు వేసి వసంత లక్ష్మిని స్వాగతిస్తారు. తలంటు స్నానాలు చేస్తారు. కొత్త బట్టలు ధరిస్తారు. గుమ్మాలకు మామిడాకుల తోరణాలు కడతారు. షడ్రుచులతో కూడిన ఉగాది ప్రసాదాన్ని పంచాంగానికి, దేవతలకు నైవేద్యం చేసి తమ భవిష్యత్ జీవితాలు ఆనందంగా సాగాలని కోరుతూ ఉగాది పచ్చడి తింటారు. ఉగాది పచ్చడికి మనశాస్త్రాలలో 'నింబ కుసుమ భక్షణం'; 'అశోక కళికా ప్రాశనం' అని వ్యవహరించేవారు.



త్వామష్ట శోక నరాభీష్ట మధుమాస సముద్భవ
నిబామి శోక సంతప్తాం మమ శోకం సదా కురు

ఈ మంత్రం చదువుతూ ఉగాది పచ్చడి తినాలని శాస్త్రాలు చెప్తున్నాయి. ఉగాది పచ్చడి ఆహారంలో ఉండే ఔషధ గుణాన్ని, వృక్షసంరక్షణ అవసరాన్ని, ఆయుర్వేదానికీ – ఆహారానికీ గల సంబంధాన్ని చెప్పడమే కాక పండుగలకు, ఆచారాలకు, సముచిత ఆహారానికి గల సంబంధాన్ని చాటి చెప్తుంది. ఉగాది రోజున తినే పచ్చడిలో కొత్త చింతపండు, లేత మామిడి చిగుళ్ళు, అశోక వృక్షం చిగుళ్ళు, కొత్త బెల్లం, వేపపూత, మామిడి కాయముక్కలు, చెరకు ముక్కలు, జీలకర్ర లాంటివి ఉపయోగించాలి. ఈ పచ్చడి శారీరక ఆరోగ్యానికి కూడా ఎంతో శ్రేష్ఠమని ఆయుర్వేదం పేర్కొంటోంది. ఈ పచ్చడిని ఖాళీపొట్టతో తీసుకున్నప్పుడు ఆరోగ్యానికి మంచిదంటారు. బెల్లం – తీపి(ఆనందం), ఉప్పు (జీవితంలో ఉత్సాహం), వేప పువ్వు – చేదు (బాధ కలిగించే అనుభవాలు), చింతపండు – పులుపు (నేర్పుగా వ్యవహరించవలసిన పరిస్థితులు), మామిడి – వగరు (కొత్త సవాళ్లు), కారం (సహనం కోల్పోయే స్థితి) గుణాలకు సంకేతాలు అంటారు.

ఉదయంవేళ, లేదా సాయంత్రం సమయాలలో పంచాంగ శ్రవణం చేస్తారు. పంచాంగం అంటే అయిదు అంగాలని అర్థం చెపుతారు. ఉగాదికి సాహితీవేత్తలు ప్రత్యేకంగా 'కవి సమ్మేళనం' నిర్వహిస్తారు. ఒక్క తెలుగు సంప్రదాయంలోనే కాక దేశంలోని పలు ప్రాంతాల్లో వివిధ పేర్లతో ఉగాది జరుపుతారు. తెలుగు వారిలానే చాంద్రమానాన్ని అనుసరించే మరాఠీలకు కూడా ఉగాది చైత్రశుద్ధ పాడ్యమి నాడే వస్తుంది. వారి సంవత్సరాదిని 'గుడి పడ్వా'గా (పడ్వా అంటే పాడ్యమి) వ్యవహరిస్తారు. తమిళుల ఉగాదిని (తమిళ్) 'పుత్తాండు' అంటారు. వారిది సౌరమానం. ఏప్రిల్ 14న సంవత్సరాదిని చేసుకుంటారు. బెంగాలీల నూతన సంవత్సరం వైశాఖ మాసంతో మొదలవుతుంది. వారి కాలమానం ప్రకారం వైశాఖశుద్ధ పాడ్యమినాడు ఉగాది వేడుకలు చేసుకుంటారు. వ్యాపారులు ఆ రోజున పాత ఖాతా పుస్తకాలన్నింటినీ మూసి, సరికొత్త పుస్తకాలు తెరుస్తారు.

– నందిరాజు రాధాకృష్ణ | వెటరన్ జర్నలిస్ట్ 98481 28215
(రేపు ఉగాది పర్వదినం సందర్భంగా)

అనుకరణకు అందని చిత్తరువు

కామెంట్



కరణ్ థాపర్

ఎవరైనా మీకు సన్నిహితులు మరణించినప్పుడు వారి జ్ఞాపకాలు మిమ్మల్ని వరదలా ముంచెత్తడం అసాధారణమేమీ కాదని నేను ఊహించగలను. ఏనాడో మరిచిపోయిన సంఘటనలు – ఎక్కువగా ఆశ్చర్యం గొల్పేవి – తక్షణమే ఆ ముందురోజునే జరిగినంత స్పష్టంగా స్ఫురణకు వస్తాయి. అయితే అవి బహుశా మూడు, లేదంటే నాలుగు దశాబ్దాల క్రితానివి కూడా కావచ్చు. చిన్న చిన్న విషయాలు... భూమి బద్దలయ్యేలా ఒక నవ్వు, ప్రత్యేకమైన ఒక దేహభాష, విచలితపరచే ఒక స్వరశ్రుతి... హఠాత్తుగా మది పుటల్లోంచి పైకి లేస్తాయి. ఆరోజు ముందువరకు అవన్నీ ఎప్పటికీ జ్ఞాపకాల్లో లేనివన్నట్లే ఉంటుంది. ఇప్పుడు, ఒక విషాద మరణం తర్వాత, అవేవీ కూడా మీరు మర్చిపోలేనివి.

గత వారం నా కజిన్ అశోక్ థాపర్ అకస్మాత్తుగా మరణించారు. వయసులో ఆయన నాకన్నా పదిహేనేళ్లే పెద్దవారు కానీ... నా టీనేజీలో, ఇరవైల ఆరంభంలో ఆయన... నేను అనుకరించాలని అనుకున్న ఒక దివ్యమంగళ చిత్తరువు. మాట తూలని వ్యంగ్య ధోరణి, ఆచి తూచే ఆ మాట తీరు, ఉద్వేగాలకు తావివ్వని పైపై పొడి హాస్యం, కొన్ని సమయాల్లో చటుక్కున పడే ఆయన చురకలు నాకు నచ్చేవి. ఆ వయసులో ప్రతి విషయంలోనూ నేను ఎలా ఉండాలని అనుకున్నానో ఆయన అలా ఉండేవారు. ఆయనలా ఉండేందుకు ఎంత అనుకరించినా నా ప్రయత్నాలు నెరవేరలేదు.

1977 వేసవిలో, ఎమర్జెన్సీ ముగిసిన వెచ్చని మలి సంధ్యలో అశోక్, నేను కలిసి.. అతడి ఛత్తర్‌పుర్ వ్యవసాయ క్షేత్రపు చాళ్లలో నడుస్తూ సాయంత్రాలను గడిపేవాళ్లం. అమాయకత్వపు చిలిపిదనంతో అల్లరి పన్నాగంతో, బంధువులైన తోటి పిల్లల్ని ఆటపట్టించేవాళ్లం. అవి పిల్లచేష్టలను మించి పరిణతి చెందింది మాత్రం అశోక్‌లోని అల్లిబిల్లి నైపుణ్యాలతోనే! నూలు వడికినట్లుగా అతడు కథల్ని అల్లి మోసుకొచ్చేవాడు. ఎప్పటికప్పుడు అవి తాజాగా, నమ్మదగినవిగా ఉండేవి. ఆ కథల కల్పనలకు గంటలు గడిచిపోయేవి. తోటి పిల్లలను ఒకళ్లకొకళ్లకు ముడివేసే సందర్భాలలో అతడిదైన ఒక గుర్తుండిపోయే మాటల మెలిక ఉండేది. అదొక హాస్యవల్లరి.



"గుర్తుకొస్తున్నాయా... గుర్తుకొస్తున్నాయా.." (ప్రతీకాత్మక చిత్రం)

తేలిగ్గా బురిడీ కొట్టించేవాడు. వాదనలతో దంగైపోయేలా చేసేవాడు.

1981 డిసెంబరులో నాకు నిశ్చితార్థం జరిగిన సాయంత్రం ఇద్దరం కలిసి పార్టీ చేసుకోవాలని అశోక్ నిర్ణయించాడు. మద్యం సేవించాం. ఆ ముందు రోజు అశోక్ మా కజిన్ మాలా సింగ్ నుంచి అరువుగా తెచ్చిన జీపులో ఊరంతా తిరిగి, చివరికి అర్ధరాత్రి వేళ మరికొంత మద్యం కోసం మాలా ఇంటికి వెళ్లాం. నిజానికి ఆ సమయంలో మేము బాగా మత్తులో ఉన్నాం. దారి మధ్యలో ఒక తోపుడుబండిని తప్పించడానికి డివైడర్‌కు వెళ్లి గుద్దుకున్నాం. పెద్ద కుదుపుతో జీపు ఆగిపోయింది.

పోలీసులు వచ్చి మమ్మల్ని లేవనెత్తారు. అన్నిసార్లు వాళ్లు అలా ఉంటారా! ఆ శీతాకాలపు చీకటి రాత్రిని సూర్యుడు చూస్తూ ఉండగా, మాలాను అడిగి డబ్బు తెమ్మని అశోక్ నన్ను మాలా వాళ్ల ఇంటికి పంపాడు. ''ఇందులోకి నన్నూ లాగారా! మొదట తాగారు. తాగింది చాలక జీపును గుద్దేశారు. ఇప్పుడు పోలీసుల నుంచి మిమ్మల్ని విడిపించుకోటానికి డబ్బులు అడుగుతున్నారు'' అని మాలా గుర్రు మన్నారు.

అదంతా ముగిశాక అశోక్, నేను జింఖానా క్లబ్‌లో హృదయాన్ని సంతుష్టి పరిచిన ఒక అల్పాహారంతో వేడుక జరుపుకున్నాం. ఆ క్లబ్‌కి మాత్రమే ప్రత్యేకమైన బ్లాక్ కాఫీని గొంతులోకి చప్పరిస్తూ, ''ఓహ్ వాట్ ఎ టాంగిల్డ్ వెబ్ వియ్ వీవ్'' అంటూ స్కాట్లాండ్ రచయిత వాల్టర్ స్కాట్‌ను ఉటంకించాడు అశోక్. ఆ మాట వాల్టర్ స్కాట్‌ది అని అప్పటికి నాకు తెలీదు. భవిష్యత్తులో ఎక్కడైనా సమయోచితంగా వదలడానికి అశోక్ నా కోసం ఉదారంగా పక్కకు తీసి ఉంచిన పుంఖానుపుంఖాల జీవిత సత్యాలలో ఒకటిగా నేను ఆ మాటను స్వీకరించాను.

అశోక్ ప్రభావంతోనే నేను ఎదిగాను. అందులో సందేహం లేదు. కొన్నిసార్లు బహుశా అక్షరాలా అతడు నన్ను పైకి లాగిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే అతడు చాలానే నాకు నేర్పించాడు. ఒక మంచి కార్పెట్ పనితనాన్ని మెచ్చుకోవటంతో పాటుగా... హిందూ–ముస్లిం కట్టడాల నిర్మాణ కళల మధ్య వ్యత్యాసం ఎలాంటిది, ముదురు వర్ణాలు మనతో సంభాషించే విధానం; ఎవరికీ కనిపించని, తరచూ ఏ ఎవరూ పట్టించుకోని భారతదేశ రైతుల దుఃస్థితి వరకు... అన్నిటి గురించీ చెప్పేవాడు.

వ్యవసాయం అంటే అనాగరికం అనే భావన ఉన్న కాలంలోనే అశోక్ వ్యవసాయ నిపుణుడు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో అతడి వ్యాసాలు హరిత విప్లవాన్ని వివరించడటమే కాకుండా, ఆ విప్లవం సృష్టించిన సమస్యలను గురించి స్పష్టంగా చర్చించేవి. వాటిని నేను పూర్తిగా అర్థం చేసుకోగలిగానో లేదో చెప్పలేను కానీ, చదవనైతే చాలా నిశితంగా చదివే వాడిని. నిజం ఏమిటంటే యాభై ఏళ్ల తర్వాత కూడా ఆ విషయాల పట్ల నాలో విస్మయాసక్తి ఉన్నదంటే కారణం అతడే.

అతడిని నిజంగా అంత ప్రత్యేకం చేసింది ఏంటీ అంటే.. అతడేమిటో నిర్వచించటం అన్నది కష్టం కావటమే! అతడు సామ్యవాది కాదు కానీ, అతడిలో లోతైన సామాజిక స్పృహ ఉండేది. అతడు నిశితంగా ఉండేవాడు తప్ప ఎప్పుడూ సమాచారాన్ని కుమ్మరించేవాడు కాదు. అతడొక మాటల మాంత్రికుడు. అయితే ఎప్పుడు మౌనం వహించాలో తెలిసినవాడు. సందర్భాలకతడు చక్కదనాన్ని జోడిస్తాడు. చురుకుదనపు మెరుపుల్ని చేకూరుస్తాడు. అంతేకాదు, సమపాళ్లలో నియంత్రణనూ, నిగ్రహాన్నీ పాటిస్తాడు.

అశోక్‌ని ఎందుకు ఇంతగా నేను ఆరాధించానో మీకిప్పుడు తెలిసిందా? అతడి గురించి రాయటం తేలిక ఎందుకైందంటే ఒకప్పుడు నేను ఎలాగైతే ఉండాలని అనుకున్నానో అలా ఉన్న వ్యక్తి గురించి రాస్తున్నాను కాబట్టి! అతడికి వీడ్కోలు చెప్పడం కష్టం. ఎందుకంటే నాలోని ఒక భాగానికి సెలవిక అంటున్నాను కాబట్టి!!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** అమావాస్య రా.12.23 వరకు, తదుపరి చైత్ర శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.10.10 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.15 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి ఆదివారం దర్శించుకున్నారు

అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యం

● మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యంగా అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణ కోసం తెలంగాణ అటవీశాఖ చేపడుతున్న చర్యలను ప్రశంసిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు చేసిన ప్రముఖ పర్యావరణవేత్త ఎరిక్ సోల్హెమ్‌కు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ప్రశంసలు తెలంగాణ అటవీ శాఖకు ఎంతో స్ఫూర్తినిస్తాయని, అధికారులు, ఉద్యోగులు మరింత ఉత్తేజంతో పనిచేసేందుకు దోహదపడతాయన్నారు. అటవీ సిబ్బందికి అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవటం, మంటలను ఆర్పడం అత్యంత కష్టతరమైనదని, అంతకు మించి సవాల్‌తో కూడుకున్నదని శాస్త్రవేత్త ఎరిక్ సోల్హెమ్ తన పోస్టులో పేర్కొన్నారు. అడవుల్లో విస్తరిస్తున్న మంటలను ఆర్పుతున్న సిబ్బందిని హరిత సైనికులు (గ్రీన్ సోల్జర్స్)గా ఆయన అభివర్ణించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు వ్యాపించకుండా వీరు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నందువల్లే అడవులు, వన్యప్రాణులకు రక్షణ లభిస్తోందని స్పష్టం చేశారు.

కులగణన అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చడం హర్షణీయం: జాజుల



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా కులగణన అంశాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 50 శాతం పెంచుతామని, అదేవిధంగా ప్రస్తుతం రిజర్వేషన్లపై కొనసాగుతున్న 50 శాతం పరిమితిని ఎత్తివేస్తామని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పిస్తామనే అంశాలను మేనిఫెస్టోలో చేర్చినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తుక్కుగూడ జనజాతర సభలో విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఈ అంశాలని చేర్చుతూ ప్రకటన చేయడం అభినందనీయమని, ఇందుకు చొరవ చూపిన ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి బీసీ సమాజం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పై డిమాండ్లపై దేశవ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తున్నారని, కానీ బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంగా బీసీల ఆకాంక్షలను గౌరవించలేదని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకురావడంతో బీసీలు మరింత నష్టపోయారన్నారు. రాహుల్‌గాంధీ ప్రకటనతో బీసీల్లో ఎంతో భరోసా కలిగిందని జాజుల సంతోషం వ్యక్తం చేశారు.

వేటగాళ్ల ఉచ్చుకు చిరుత బలి

● చిరుత కళేబరం దహనం
● నెల తర్వాత వెలుగులోకి ఘటన
● సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో ఘటన



ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు

దుబ్బాకటౌన్: వేటగాళ్లు పన్నిన ఉచ్చులో పడి ఓ చిరుత మృతి చెందిన ఘటన దాదాపు నెల రోజుల తర్వాత వెలుగు చూసింది. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చేగుంట వెళ్లే మార్గంలోని అడవి శివారులో జరిగిన ఘటన వివరాలిలా.. చేగుంట సరిహద్దు ప్రాంతంలో పలువురు వేటగాళ్లు అడవి పందుల కోసం ఉచ్చును ఏర్పాటు చేశారు. ఈ ఉచ్చులో ఊహించని రీతితో చిరుత పులి పడి మృతి చెందింది. ఇది గమనించిన వేటగాళ్లు భయాందోళనకు గురై ఎవరికీ అనుమానం రాకుండా చిరుత కళేబరాన్ని దహనం చేసి విషయాన్ని రహస్యంగా ఉంచారు. ఘటన జరిగిన దాదాపు నెల రోజుల తర్వాత ఈ నోటా ఆ నోటా విషయం పోలీసులకు తెలిసింది. వెంటనే తొగుట సీఐ లతీఫ్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సందీప్ ఆధ్వర్యంలో దర్యాప్తు మొదలు పెట్టారు. ఆదివారం రాత్రి ఓ నిందితుడిని పట్టుకొని ఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ లభించిన వేట ఆయుధాన్ని సీజ్ చేశారు. మరో ముగ్గురు నిందితుల్ని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ లతీఫ్, అటవీ అధికారి సందీప్ తెలిపారు.

రైల్వే..'నత్త'నడక

● అన్ని పనుల్లో వెనుకబడిన తెలంగాణ
● గత ఏడాదికాలంలో అన్ని కేటగిరీలు కలిపి నిర్మించింది 135 కిలోమీటర్లే
● రైల్వేలైన్ నిర్మాణంలో జాతీయ సగటు 14 కి.మీ.. తెలంగాణలో 0.36 కిలోమీటర్లే

సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయిలో సగటున ఒక రోజుకు 14 కిలోమీటర్ల మేర కొత్త రైల్వేలైన్ నిర్మిస్తున్నారు. దీనిని ఈ ఏడాది 16 కిలోమీటర్లకు పెంచాలని కేంద్రం నిర్ణయించింది. అయితే గత ఏడాదికాలంలో తెలంగాణలో సగటున రోజుకు ఎన్ని కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మాణం జరిగిందంటే.. 0.36 కి.మీ..అంటే కనీసం అర కిలోమీటర్ మేర కూడా పనులు జరగలేదు. రైల్వే ప్రాజెక్టుల మంజూరు, మంజూరైన వాటిల్లో పనుల పురోగతి విషయంలో తెలంగాణ ఇప్పటికీ బాగా వెనుకబడే ఉందని దీనిని బట్టి చూస్తే స్పష్టమవుతోంది.

11 కి.మీ. ఆ ప్రాజెక్టులోనే..

మూడేళ్లుగా తెలంగాణకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరవుతున్నాయి. కానీ, పనుల పురోగతి చూస్తే నత్తతో పోటీ పడినట్టు ఉంటోంది. మెదక్-అక్కన్నపేట, భద్రాచలం రోడ్డు-సత్తుపల్లి, మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులు పూర్తయ్యి అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకేఒక కొత్త రైల్వేలైన్ పనులు జరుగుతున్నాయి. అదే మనోహరాబాద్-కొత్తపల్లి ప్రాజెక్టు. దీని పనుల్లో వేగం ఆశించిన స్థాయిలో లేదు. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. ఈ ప్రాజెక్టులో ఏడాది కాలంలో కేవలం 11 కి.మీ.లైన్ మాత్రమే పూర్తయింది. దుద్దెడ-సిద్దిపేట మధ్య జరిగిన పనుల పురోగతే అది. సికింద్రాబాద్ స్టేషన్ -సిద్దిపేట మధ్య రోజువారీ డెమూ రైలు నడుస్తోంది. సిద్దిపేట నుంచి సిరిసిల్ల మధ్య భూసేకరణ పరిహార జాప్యంతో ఆ సెక్షన్‌లో పనులు జరగలేదు. దీంతో అధికారులు సిరిసిల్ల తర్వాత పనులు కొనసాగిస్తున్నారు.



డబ్లింగ్ ఖాతాలో ఎంఎంటీఎస్

ఇక గత ఏడాదికాలంలో రాష్ట్రంలో ఎంఎంటీఎస్-2లో తప్ప ఇతర ప్రధాన మార్గాల్లో డబ్లింగ్ పనులు జరగలేదు. నగరంలోని సనత్‌నగర్-మౌలాలీ మధ్య 21 కి.మీ. మేర ఎంఎంటీఎస్ రెండో దశ పనులు జరిగాయి. ఇది డబ్లింగ్ ఖాతాలో రికార్డయ్యింది. ఇది తప్ప ప్రధాన రైల్వేలైన్ డబ్లింగ్ పనులంటూ లేవు. తాజా బడ్జెట్‌లో బీబీనగర్-గుంటూరు మధ్య డబ్లింగ్ ప్రాజెక్టు మంజూరైంది. ఆ పనులు ఇప్పుడు ప్రారంభం కావాల్సి ఉంది. సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్ ప్రాజెక్టు పూర్తి కావటంతో కొత్తగా డబ్లింగ్ పనులు జరిగే ప్రాజెక్టు అంటూ లేకుండా పోయింది.

మూడోలైన్ కొంత మెరుగు..

కొత్త రైల్వేలైన్, డబ్లింగ్ పనులతో పోలిస్తే మూడో లైన్ నిర్మాణ పనుల్లో కొంత పురోగతి కనిపిస్తోంది. రాష్ట్రంలో గత ఏడాది 103 కి.మీ. మేర మూడో లైన్ పనులు జరిగాయి. కాజీపేట-బల్లార్షా, కాజీపేట-విజయవాడ మధ్య మూడోలైన్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ 2 ప్రాజెక్టుల్లో 1103 కి.మీ. మేర పనులు నమోదయ్యాయి. కాజీపేట-విజయవాడ మధ్య 53 కి.మీ., కాజీపేట-బల్లార్షా మధ్య 50 కి.మీ. పనులు జరిగాయి.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇది ఓ ఆల్‌టైమ్ రికార్డు

తెలంగాణతోపాటు ఏపీ (వాల్తేరు డివిజన్ కాకుండా), మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలు కలిపి విస్తరించి ఉన్న దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఏడాది కాలంలో కొత్త రైల్వే లైన్, గేజ్ మార్పిడి, డబ్లింగ్, మూడో లైన్ నిర్మాణ పనులు కొత్త రికార్డు నెలకొల్పటం విశేషం. జోన్ మొత్తం కలిపి.. 39 కి.మీ. మేర కొత్త రైల్వే లైన్ పనులు నమోదయ్యాయి. 54 కి.మీ.మేర గేజ్ మార్పిడి పనులు జరిగాయి. 133 కి.మీ. మేర డబ్లింగ్ పనులు జరిగాయి. ఇక మూడో లైన్ నిర్మాణం 190 కి.మీ. మేర జరిగింది. అన్నీ కలిపి 416 కి.మీ.మేర కొత్త లైన్ నిర్మాణం జరిగట్టయింది. దక్షిణ మధ్య రైల్వే జోన్ ఏర్పడ్డ తర్వాత ఒక ఆర్థిక సంవత్సరంలో ఇన్ని కి.మీ. మేర కొత్త లైన్ నిర్మించటం ఇదే తొలిసారి. కొత్త రైల్వే లైన్‌కు సంబంధించి తెలంగాణ పరిధిలో 11 కి.మీ. పోను ఏపీలో నడికుడి-శ్రీకాళహస్తి ప్రాజెక్టులో భాగంగా గుండ్లకమ్మ-దర్శి మధ్య 28 కి.మీ. పనులు జరిగాయి.

ట్యాపింగ్ మాటున లైంగిక వేధింపులు.. వసూళ్లు!

● నల్లగొండ జిల్లాలో పోలీసులపై ఆరోపణలు
● దర్యాప్తు అధికారులు కీలక సమాచారం సేకరించినట్టు చర్చ

నల్లగొండ క్రైం: ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం నల్లగొండలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే జిల్లాలోని టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన ముగ్గురు పోలీస్ అధికారులను అదుపులోకి తీసుకున్న ప్రత్యేక అధికారుల బృందం ఆదివారం వారిని మరోసారి విచారించినట్టు చర్చ జరుగుతోంది. అప్పటి జిల్లా ఉన్నతాధికారితో నమ్మకంగా ఉన్న కానిస్టేబుల్‌తో మునుగోడు ఉప ఎన్నికలో డబ్బు పంపిణీతో పాటు వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపణలున్నాయి. పోలీసు ఉన్నతాధికారితో ఉన్న నమ్మకాన్ని టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన పలువురు కిందిస్థాయి పోలీసుఅధికారులు దందాలు, సెటిల్‌మెంట్లకు తెర లేపారని ఆరోపణలు వచ్చాయి. మిర్యాలగూడలో రౌడీషీటర్లతో సెటిల్‌మెంట్లు, నార్కట్‌పల్లి వద్ద దొరికిన గంజాయి కేసులో వసూళ్లకు పాల్పడ్డట్టు సమాచారం. పేకాట, బియ్యం దందా చేసేవారిని ఫోన్ ట్యాపింగ్ ద్వారా పట్టుకొని బ్లాక్‌మెయిల్ చేసి వసూళ్లకు పాల్పడినట్టు చర్చ జరుగుతోంది. పార్కులో తిరిగే ప్రేమ జంటలను, ఏదేని కేసులో ఉన్న వారిని కలవడానికి వచ్చే కుటుంబ సభ్యులైన మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు సమాచారం. పోలీసు అధికారులు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో అక్రమ సంపాదనతో ఒక పోలీస్ అధికారి గుర్రంపోడు మండల కేంద్ర సమీపంలోని 9ఎకరాల తోటను కొనుగోలు చేసినట్టు సోషల్ మీడియాలో ట్రోల్ అవుతోంది. ఈ విషయమై దర్యాప్తు అధికారులు కీలకమైన సమాచారం సేకరించినట్టు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. దర్యాప్తు అధికారుల విచారణలో మరిన్ని విస్తుగొలిపే అంశాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది.

కారు డోర్ లాక్.. ఊపిరాడక బాలుడి మృతి

బోధన్‌టౌన్: కారు డోర్ లాక్ అయ్యి ఆరేళ్ల బాలుడు ఊపి రాడక మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని రాకాసిపేట్‌కాలనీలో చోటు చేసుకుంది. బోధన్ సీఐ వీరయ్య కథనం ప్రకారం.. గోసంబస్తీకి చెందిన రేణుక శుక్రవారం తన కొడుకు రాఘవ(6)ను తీసుకొని రాకాసి పేట్‌కాలనీకి వెళ్లింది. తల్లి ఓ ఇంట్లో పనిచేస్తుండగా, రాఘవ బయట ఆడుకుంటున్నాడు. కొద్దిసేపటి తర్వాత రేణుక బయటకు వచ్చి చూడగా రాఘవ కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త ప్రవీణ్‌తో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా ఆదివారం రాత్రి రాకా సిపేట్‌కు చెందిన ఓ వ్యక్తి తన కారు డోర్ తెరిచి చూడగా, బాలుడి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాలుడు ఆడుకుంటూ కారు డోర్ తెరిచి లోపలికి వెళ్లి ఉంటాడని, డోర్ లాక్ కావడంతో ఊపిరాడక మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యా లేక మిస్‌ఫైరా?

అనుమానాస్పద స్థితిలో ఆర్ఎస్ఐ మృతి

● ఆదివారం తెల్లవారుజామున హుస్సేనీఆలం అవుట్ పోస్టులో ఘటన
● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



బాలీశ్వర్

దూద్‌బౌలి: పాతబస్తీ కబూతర్‌ఖానా పరిధిలోని పోలీసు అవుట్ పోస్టులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన గన్ ఫైరింగ్‌లో బాలీశ్వర్ (48) అనే ఆర్ఎస్ఐ అక్కడికక్కడే మరణించారు. అయితే ఇది ఆత్మహత్యా లేక గన్ మిస్ ఫైర్ అయ్యిందా అనేది తేలాల్సి ఉందని.. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని చార్మినార్ ఏసీపీ పి. చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన బాలేశ్వర్ బాచుపల్లి టిఎస్ బెటాలియన్‌లో రిజర్వ్‌డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ)గా పనిచేస్తున్నారు. రెండు రోజుల కిందటే హైదరాబాద్ దక్షిణ మండలంలోని హుస్సేనీఆలం అవుట్ పోస్టులో విధినిర్వాహణ కోసం వచ్చారు. ఏమైందో ఏమో తెలియదు కానీ ఆదివారం తెల్లవారుజామున అవుట్ పోస్టు నుంచి కాల్పుల శబ్దాలు వినిపించడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. అక్కడే నిద్రిస్తున్న తోటి సిబ్బంది మేల్కొని చూసేలోపే బాలేశ్వర్ రక్తం మడుగులో పడి ఉన్నాడు. తలలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే దక్షిణ మండలం డీసీపీ సాయిచైతన్య, అదనపు డీసీపీ షేక్ జహంగీర్, చార్మినార్ ఏసీపీ పి.చంద్రశేఖర్, హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ తదితరులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని అంచనా వేశారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. హుస్సేనీఆలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామంలో విషాదఛాయలు

అచ్చంపేట రూరల్/ఎర్రవల్లి చౌరస్తా: ఆర్ఎస్ఐ పిట్టల బాలీశ్వర్ మృతితో స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా లక్ష్మాపూర్‌తోపాటు జోగులాంబ గద్వాల జిల్లా పదో బెటాలియన్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడి మరణవార్త తెలియగానే తల్లిదండ్రులు పిట్టల రాములమ్మ, బాలస్వామి రోదనలు మిన్నంటాయి. అందరితో కలివిడిగా ఉంటూ ఆప్యాయంగా పలకరించే వ్యక్తి మృతితో గ్రామస్తులు, తోటి ఉద్యోగులు కూడా షాక్‌కు గురయ్యారు. 1995 బ్యాచ్‌కు చెందిన బాలీశ్వర్ 2000 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంతోపాటు 2018లో ఏఆర్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. బాలీశ్వర్‌కు భార్య శారద, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆదివారం సాయంత్రం సొంత వ్యవసాయ పొలంలో బాలీశ్వర్ అంత్యక్రియలు జరిగాయి.

మెట్రో ప్రయాణికులకు షాక్

రాయితీలను ఎత్తేసిన హెచ్ఎంఆర్



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ షాక్ ఇచ్చింది. కూల్ జర్నీపై ఆంక్షలు విధించింది. పర్యాటకులను, నగరవాసులను విశేషంగా ఆకట్టుకున్న హాలిడే పాస్‌ను ఎత్తేసింది. కేవలం రూ.59కే లభించే హాలిడే పాస్‌తో ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేసే అవకాశం ఉండేది. రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉండేది. దీంతో ఆ రోజుల్లో లక్షలాది మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మార్చి 31 నుంచి హాలిడే పాస్ పథకాన్ని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రోజువారీ ప్రయాణాలపై లభించే 10 శాతం రాయితీని కూడా నిలిపివేశారు. ఇప్పటి వరకు సుమారు 30 వేల మందికి పైగా విద్యార్థులు వినియోగించుకుంటున్న స్టూడెంట్ పాస్‌ల గడువు కూడా ఈ ఏప్రిల్ నెలాఖరుతో ముగియనుంది. ఈ పాస్‌ను తీసుకున్న విద్యార్థులు తాము ప్రయాణం చేసే మార్గంలో 20 ట్రిప్పులకు చార్జీలు చెల్లించి మరో 10 ట్రిప్పులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ప్రస్తుతం ఈ పాస్‌లను వినియోగిస్తున్నవారు ఈ నెలాఖరు వరకు ప్రయాణం చేయవచ్చు. కొత్త ఆర్థిక సంవత్సరం ఆదాయ వ్యయాలను అంచనా వేసేందుకే పథకాలను నిలిపివేసినట్లు సమాచారం.

శ్రీరామనవమి వేడుకలకు భద్రాచలం సిద్ధం..



విద్యుద్దీపాల కాంతుల్లో వెలిగిపోతున్న భద్రాద్రి రామాలయం

భద్రాచలం: భద్రాచలంలో ఈనెల 17న జరిగే శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు ఉగాది రోజున శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. ఈ మేరకు ఇప్పటికే పనులన్నీ పూర్తి కాగా, ఆదివారం రాత్రి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. కాగా, మంగళవారం నుంచి ఈనెల 23 వరకు స్వామివారి నిత్యకల్యాణం, పవళింపు సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు.

శ్రీరామునికి సగరుల పట్టు వస్త్రాలు, తలంబ్రాలు

● కల్యాణానికి అందించేందుకు భద్రాచలానికి సగర సంఘం మహా పాదయాత్ర
● హైదరాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించిన కుల సంఘం ప్రముఖులు
● ఇక నుంచి ప్రతి ఏటా సమర్పణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు మహా పాదయాత్ర ప్రారంభమైంది. సగర కులగురువు భగీరథుని వంశస్తుడైన శ్రీరాముడి కల్యాణ వేడుకకు ఇకపై ఏటా ఆనవాయితీగా పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు సగర సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 17న భద్రాచలంలో జరగనున్న సీతారాముల కల్యాణానికి సమర్పించే పట్టు వస్త్రాలతో పాటు ముత్యాల తలంబ్రాలతో ఆదివారం నగరంలోని కర్మన్ ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రగా తరలివెళ్లారు. తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, రాష్ట్ర సగర యువజన సంఘం అధ్యక్షుడు మర్క సతీష్ ఆధ్వర్యంలో సగరులు చేపట్టిన ఈ పాదయాత్రను సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఉదయ్ సాగర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సగర ఆత్మ గౌరవ భవన వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ అస్కాని మారుతి సాగర్, స్పెషల్ గ్రేడ్ అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ సగర సంఘం గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం, ముఖ్య సలహాదారుడు ఆర్. బి ఆంజనేయులు మహిళా సంఘం అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మోడల రవితో పాటు సగర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పాదయాత్రకు బయలుదేరుతున్న సగర సంఘం నాయకులు

నిస్సిగ్గుగా మా ఎమ్మెల్యేను లాక్కుంటారా?

● పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా మాట్లాడిన మర్నాడే ఇదేం ద్వంద్వ నీతి రాహుల్?
● లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ది నయా నాటకం.. నమ్మి ఓట్లేస్తే 4 నెలలుగా నయవంచన
● వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు బొందపెట్టారు: 'ఎక్స్'లో కేటీఆర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'పార్టీ ఫిరాయింపుల గురించి, పదవులకు రాజీనామా చేయకుండా పార్టీలు మారే ప్రజాప్రతినిధులపై తక్షణమే అనర్హత వేటు వర్తించేలా రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను సవరించడం గురించి నిన్న సభలో రాహుల్ గాంధీ వాక్చాతుర్యం ప్రదర్శించారు. కానీ ఇవాళ ఆయన పార్టీ నిస్సిగ్గుగా ఒక బీఆర్ఎస్ ఎమ్మెల్యేను లాక్కుంది. చెప్పే మాటలు ఆచరించే ఉద్దేశం లేనప్పుడు ఈ నాటకాలు, డ్రామాలు ఎందుకు రాహుల్ జీ' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా ప్రశ్నించారు. భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆదివారం అధికార కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఆయన ఆ పార్టీపై మండిపడ్డారు. ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు ఎంపీ టికెట్ ఇవ్వడమే కాంగ్రెస్ ద్వంద్వ రీతి, నీతి అని దుయ్యబట్టారు. ఈ విషయంలో బీజేపీకి, కాంగ్రెస్‌కు పెద్దగా తేడా లేదని విమర్శించారు.

కాంగ్రెస్ సభ జనజాతర కాదు.. హామీల పాతర

కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించింది జనజాతర సభ కాదని, హామీల పాతర, అబద్ధాల జాతర అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరిట గారడీ చేసి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ ఎన్నికల్లో 'న్యాయ్' పేరిట నయా నాటకానికి తెరతీశారని మండిపడ్డారు. 'తెలంగాణకు తీరని అన్యాయం చేసి నమ్మి ఓట్లేసిన ప్రజలను కాంగ్రెస్ 4 నెలలుగా నయవంచన చేస్తోంది. అసత్యాలతో అధికారంలోకి వచ్చి అన్నదాతలు, నేతన్నల ఆత్మహత్యలకు కారణమవుతోంది ఎన్నికల ప్రచారంలో అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చాక నరకం చూపిస్తోంది. కాంగ్రెస్ అసమర్థ పాలనలో సాగునీరు, రుణమాఫీ తదితరాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగి 200 మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా రాహుల్ గాంధీ స్పందించట్లేదు. కాంగ్రెస్‌కు ఓటేస్తే నిండా మునగడం ఖాయమని ప్రజలకు అర్థమైంది. వంద రోజుల్లోనే హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాలను ఇంటింటా వివరించాలి

● కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: పదేళ్లలో బీఆర్ఎస్‌తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతో చేస్తున్న మోసాలను ఇంటింటా వివరించాలని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని శుభమంగళ కన్వెన్షన్‌లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ 6 గ్యారంటీల పేరుతో ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదని, అయినా అమలు చేసినట్టు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ఈ విషయంపై వాస్తవాలు చెబుతూ రూపొందించిన కరపత్రాలను ప్రజల వద్దకు చేర్చాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కార్యక్రమాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై బీజేపీ చేసిన పోరాటాలపై రూపొందించిన కరపత్రాలను సైతం ఇంటింటికీ చేరవేయాలన్నారు. రాష్ట్రంలో నేతన్నల పరిస్థితి దుర్భరంగా మారిందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు చేసిన మోసాల వల్ల నాలుగు నెలలుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మూతపడి, నేతన్నలు రోడ్డున పడ్డారని మండిపడ్డారు. పాలకుల నిర్లక్ష్యంతో తినడానికి తిండిలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని చెప్పారు. పాలకుల మోసాలను ఎండగట్టడంతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నేతన్నలకు ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈనెల 10న సిరిసిల్లలో 'దీక్ష' చేయబోతున్నట్టు పేర్కొన్నారు. రాబోయే నెల రోజులు పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలను రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి వెల్లడించారు. సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గెలిస్తేనే నిలిచేది..!

లేదంటే పార్టీలే ఖాళీ | **మహారాష్ట్రలో ప్రాంతీయ పార్టీల పరిస్థితి** | **పవార్, ఉద్ధవ్, షిండే, అజిత్‌లకు కఠిన పరీక్ష**

ఈ లోక్‌సభ ఎన్నికలు మహారాష్ట్రలో ప్రాంతీయ పార్టీలకు జీవన్మరణ పరీక్షగా మారాయి. రాజకీయ కురువృద్ధుడు ఎన్సీపీ (ఎస్‌సీపీ) అధినేత శరద్ పవార్, చీలిక వర్గం చీఫ్, ఆయన అన్న కుమారుడు అజిత్ పవార్, బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే, శివసేన చీఫ్, సీఎం ఏక్‌నాథ్ షిండే... ఈ నలుగురూ గెలుపు కోసం అన్ని అస్త్రాలనూ ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా శరద్ పవార్, ఉద్ధవ్ ఎన్నికలయ్యేదాకా ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితులు కూడా లేవంటే అతిశయోక్తి కాదు. శివసేనను షిండే, ఎన్సీపీని అజిత్ చీల్చి వేరుకుంపటి పెట్టుకోవడం తెలిసిందే. వాటినే అసలైన శివసేన, ఎన్సీపీగా మహారాష్ట్ర స్పీకర్‌తో పాటు కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రకటించింది. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్, శరద్ పవార్ అధికారంలో భాగస్వాములుగా లేరు. పైగా మహావికాస్ అఘాడీ కూటమి పొత్తులో భాగంగా కొన్ని స్థానాలకే పోటీ చేస్తున్నారు. కనుక గణనీయమైన సీట్లు సాధిస్తే తప్ప వారి రాజకీయ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వీరిలో శరద్ పవార్ 50 ఏళ్లలో ఒక్క ఓటమీ ఎదుర్కోని నేత కాగా,



ఉద్ధవ్ ఠాక్రే ఒక్కసారీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ పడని నేత కావడం విశేషం!

ఠాక్రే... వీలైనన్ని చోట్ల పోటీ

2019లో బీజేపీతో పొత్తులో భాగంగా శివసేన 23 స్థానాల్లో పోటీ చేసి 18 గెలుచుకుంది. తర్వాత పార్టీని షిండే చీల్చడంతో ఉద్ధవ్ రాజకీయ భవితవ్యమే అనిశ్చితిలో పడింది. ఈసారి సాధ్యమైనన్ని స్థానాల్లో పోటీ చేసి సత్తా చాటే క్రమంలో 21 స్థానాలకు ఆయన అభ్యర్థులను ప్రకటించేశారు. ఈ ఏడాది చివర్లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వరకైనా ఉద్ధవ్ తన కేడర్‌ను కాపాడుకోవాలంటే కనీసం ఆరేడు లోక్‌సభ స్థానాలు గెలిచి తీరాలని రాజకీయ విశ్లేషకుడు అకోల్కర్ విశ్లేషించారు. - ముంబై

బారామతిలో ఎవరిదో పరపతి!

శరద్ పవార్ ఆధ్వర్యంలోని ఎన్సీపీ 10 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తోంది. వాటిలో బారామతి పవార్‌కు కీలకమైనది. అక్కడ 3సార్లుగా ఎంపీగా గెలుస్తున్న పవార్ కుమార్తె సుప్రియా సులే ఈ విడత అజిత్ పవార్ భార్య సునేత్ర గట్టి సవాలు విసురుతున్నారు. ''బారామతిలో సుప్రియ ఓడితే పవార్ అంతా కోల్పోయినట్టే. అలా చూస్తే ఈ యుద్ధం శరద్, అజిత్ మధ్యే!'' అని పరిశీలకులు అంటున్నారు.

కేడర్, ఓటర్ ఎటువైపు

శరద్ పవార్, ఉద్ధవ్‌లకు ఈ ఎన్నికలు గట్టి పరీక్షేనని సీనియర్ జర్నలిస్ట్ అభయ్ దేశ్‌పాండే అన్నారు. అయితే పార్టీలు చీలినా సంప్రదాయ ఓటర్లు, కేడర్ మద్దతు వావైపేనని అభిప్రాయపడ్డారు. ''పైగా బీజేపీ కేడర్‌లోనూ అశాంతి నెలకొని ఉంది. కనుక వాళ్లు అజిత్, షిండే అభ్యర్థుల విజయానికి మనస్ఫూర్తిగా పనిచేస్తారా అన్నది అనుమానమే'' అని ఆయన సందేహం వెలిబుచ్చారు. 2019 ఎన్నికల్లో బీజేపీ–శివసేన 41 లోక్‌సభ స్థానాలను గెలుచుకున్నాయి. వాటిని నిలుపుకోవడం వాటికి ప్రతిష్టాత్మకమని, ఆ లెక్కన ఈ ఎన్నికలు అధికార బీజేపీ–షిండే–అజిత్ కూటమికే అసలైన పరీక్ష అని ఉద్ధవ్, శరద్ పవార్ వర్గీయులు వాదిస్తున్నారు.

ఓట్ల చీలిక..

సీఎంగా ఉండగా ఇల్లు కదల్లేదన్న విమర్శలు మూటగట్టుకున్న ఉద్ధవ్ ఇప్పుడు పార్టీని బతికించుకునేందుకు రాష్ట్రమంతా చుడుతున్నారు. ఆయన ర్యాలీలకు మంచి స్పందనే వస్తోంది. శరద్ పవార్ ఉన్నచోటి నుంచే చక్రం తిప్పుతున్నారు. బారామతిలో కుమార్తె గెలుపు కోసం పుణె జిల్లాలో పూర్వపు ప్రత్యర్థులైన కాంగ్రెస్ నేతల మద్దతుకూ ప్రయత్నిస్తున్నారు. అంబేడ్కర్ మనవడైన ప్రకాశ్ అంబేడ్కర్ ఆధ్వర్యంలోని వంచిత్ బహుజన్ అఘాడి (వీబీఏ)తో ఎంవీఏ కూటమి సీట్ల పంపకం చర్చలు విఫలమయ్యాయి. దాంతో త్రిముఖ పోటీ నెలకొంది. ఇది అధికార కూటమికి అనుకూలిస్తుందంటున్నారు.

ఈసీ 'సోషల్' బాట



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పర్వంలో యువత ముఖ్యంగా పట్టణ ఓటర్లను మరింతగా భాగస్వాములను చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నడుంబిగించింది. తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్న వారి కోసం 'టర్నింగ్ 18' పేరిట కొత్త ప్రచార కార్యక్రమానికి ఈసీ శ్రీకారం చుట్టింది. తొలి ఓటును వృథా చేయొద్దని, ఖచ్చితంగా పోలింగ్ స్టేషన్‌కొచ్చి ఓటేయాలని వారికి విజ్ఞప్తిచేస్తోంది. ఎన్నికల క్రతువులో ప్రతి ఒక్కరూ చాలా ముఖ్యమంటూ 'యు ఆర్ ది వన్' కార్యక్రమానికి తెర తీసింది. ఓటర్లు మొదలుకుని పార్టీల దాకా, బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌ఓ), కిందిస్థాయి సిబ్బంది, పోలింగ్ బృందాలు, నిర్వహణ సిబ్బంది, మీడియా వర్గాలు, కేంద్ర బలగాలు, భద్రతా సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రక్రియలో అత్యంత ప్రధానమేనంటూ సోషల్ మీడియా వేదికగా వినూత్న ప్రచారం చేస్తోంది. స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రయోజనాలను చిన్న కథల రూపంలో, విజువల్స్‌తో ప్రచార వీడియోలను సామాజిక మాధ్యమాల వేదికగా అందరికీ చేరవేస్తోంది. ఎన్నికలకు సంబంధించి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అవాస్తవాలు, తప్పుడు కథనాలు, నకిలీ వార్తలు, అబద్ధపు సమాచారాన్ని పోల్చి చూసుకునేందుకు 'వెరిఫై బిఫోర్ యు యాంప్లిఫై' పేరిట మరో విధానాన్ని ఈసీ అందుబాటులోకి తెచ్చింది. సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్న తప్పుడు కథనాలు, నకిలీ వార్తల కట్టడికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈసీ ఆశిస్తోంది. 'కచ్చితమైన, వాస్తవిక, నిర్దిష్టమైన ఎన్నికల సమాచారాన్ని మాత్రమే ప్రజలు పొందేలా చేయడమే ఈ కార్యక్రమాల ఉద్దేశం. ప్రజలకు ఏది నిజమో ఏది అవాస్తవమో తెలిసేలా చేయగల్గిన నాడే ఎన్నికల సమగ్రతను కాపాడగలిగిన వారమవుతాం' అని ఈసీ పేర్కొంది.

కేజ్రీవాల్ అరెస్టుపై ఆప్ నిరాహార దీక్షలు



ఆదివారం ఢిల్లీలో దీక్ష చేస్తున్న అతిశి తదితరులు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆదివారం జంతర్‌మంతర్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేశారు. రోజంతా ఈ దీక్షలు కొనసాగాయి. ఢిల్లీ మంత్రులు, ప్రజాప్రతినిధులతోపాటు పార్టీ మద్దతుదారులు, అభిమానులు కూడా పాల్గొన్నారు. కేజ్రీవాల్‌కు అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లోనూ నిరాహార దీక్షలు చేపట్టారు. విదేశాల్లోనూ పలు నగరాల్లో దీక్షలు జరిగాయి. బోస్టన్, లాస్ ఏంజెలెస్, వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, టోరంటో, లండన్, మెల్‌బోర్న్ తదితర నగరాల్లో నిరాహార దీక్షలు జరిగినట్లు ఆప్ నేతలు వెల్లడించారు. జంతర్‌మంతర్ వద్ద ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రసంగించారు. నిజాతీయపరుడైన అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో సాక్ష్యాధారాలు లేకపోయినా అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. కేజ్రీవాల్ ఎప్పటికీ నిజాతీయపరుడిగానే ఉంటారని చెప్పారు. దేశంలో నిరంకుశ పాలన అంతం కావాలంటే సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోదీని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీపై యుద్ధం మొదలైందని, ఇకపై ఆ పార్టీ నాయకులకు నిద్రలేని రాత్రులేనని ఢిల్లీ మంత్రి అతిశీ అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ మార్చి 21న అరెస్టవడం తెలిసిందే.

కేజ్రీవాల్ రాజీనామా చేయాలని బీజేపీ నిరసన

మద్యం కుంభకోణంలో నిందితుడైన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఢిల్లీ ప్రజల సొమ్మును కేజ్రీవాల్ లూటీ చేశారని బీజేపీ నేతలు ఆరోపించారు.

కశ్మీర్ భారత్‌లో లేదా?

ప్రతిపక్షాలను నిలదీసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

నవదా/జల్పాయ్‌గురి/జబల్పూర్: కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అచ్చంగా ముస్లిం లీగ్ విధానాలను పోలి ఉందని విమర్శించారు. అది మేనిఫెస్టో కాదు, బుజ్జగింపు పత్రం అని ధ్వజమెత్తారు. ఆదివారం బిహార్‌లోని నవడా జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. ఆర్టికల్ 370 రద్దు గురించి బీజేపీ నాయకులు ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ప్రస్తావిస్తున్నారన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డారు. ''దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు చెందిన భద్రతా సిబ్బంది జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయారు. వారి పార్థివ దేహాలు త్రివర్ణ పతాకాలతో స్వస్థలాలకు చేరుకున్నాయి. రాజ్యాంగాన్ని జమ్మూకశ్మీర్‌లో గతంలో ఎందుకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదో ప్రతిపక్ష నేతలు చెప్పాలి. అది దేశంలో అంతర్భాగం కాదా?'' అని ప్రశ్నించారు.

రన్‌వేపై మా గ్రోత్ ఇంజన్ సిద్ధం

దేశాన్ని రెండు విభజించాలన్నదే కాంగ్రెస్ ఆలోచనా విధానమని మోదీ ఆక్షేపించారు. ''ప్రజల విరాళాలతో నిర్మించిన అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పెద్దలు బహిష్కరించారు. హాజరైన పార్టీ నేతలను బహిష్కరించారు. శ్రీరామనవమి రాబోతోంది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చేసిన పాపాలను మర్చిపోవద్దు'' అని ప్రజలకు సూచించారు. తమ పదేళ్ల పాలన ట్రైలర్ మాత్రమేనని, తమ గ్రోత్ ఇంజన్ రన్‌వేపై సిద్ధంగా ఉందని, ఇక టేకాఫ్ తీసుకుంటుందని అన్నారు. బెంగాల్‌లోని జల్పాయ్‌గురిలో ఎన్నికల మెగా ర్యాలీలో, మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో రోడ్ షోలో మోదీ పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అవినీతికి, హింసాకాండకు ఉచిత లైసెన్స్ ఇవ్వాలని అధికార టీఎంసీ కోరుకుంటోందని మండిపడ్డారు.


ఆదివారం జబల్‌పూర్‌లో మోదీ రోడ్ షో

భార్యను 224 ముక్కలుగా నరికేశాడు

లండన్: భార్యను భర్త హత్యచేసి ఏకంగా 224 ముక్కలుగా నరికి మృతదేహాన్ని మాయంచేసిన దారుణ ఘటన బ్రిటన్‌లో చోటుచేసుకుంది. నికొలస్ మెట్సన్ (28), హోలీ బ్రామ్లీ (26) లింకన్ సిటీలోని బస్సింగ్‌హామ్‌లో ఉంటున్నారు. గత నెల 17 నుంచి బ్రామ్లీ కనిపించట్లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆమె తనను చితకబాది వెళ్లిపోయిందని పోలీసులకు నికొలస్ చెప్పాడు. ఫ్లాట్‌ను తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో రక్తపు మరకలు, అతిగా శుభ్రం చేసినట్లు అమ్మోనియా, బ్లీచింగ్ ఆనవాళ్లు కనిపించాయి. దాంతో అతన్ని అరెస్ట్‌చేసి విచారణ మొదలెట్టారు. తనకేం తెలీదని మెట్సన్ తొలుత వాదించాడు. ఈలోపు సమీపంలోని విథమ్ నదిలో నరికిన చేయి సహా చిన్నచిన్న శరీరభాగాలున్న ప్లాస్టిక్ బ్యాగులు కొట్టుకుపోవడం చూసి స్థానికుడు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసు గజ ఈతగాళ్లు వాటిని సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అసలేమాత్రం గుర్తుపట్టలేనంతగా హోలీ బ్రామ్లీ శరీరాన్ని పలుమార్లు పొడిచి 224 ముక్కలుగా నరికి భర్త నదిలో పడేశాడు. శరీరభాగాలను పడేయటంతో సాయపడినట్లు భర్త స్నేహితుడు జాషువా హ్యాన్‌కాక్ తన నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో ఎట్టకేలకు భర్త తన నేరాన్ని ఒప్పుకున్నాడు. ఆమె చంపడానికి ముందు పెంపుడు కుక్క పిల్ల, పెంపుడు ఎలుకలనూ చంపేశాడు. తన మాజీ జీవితభాగస్వాములనూ మెట్సన్ హింసించినట్లు 2013, 2016, 2017 పోలీసు రికార్డుల్లో ఉంది. జంతువుల పట్ల అతను అమానుషంగా ప్రవర్తించేవాడని పోలీసు విచారణలో వెల్లడైంది. హత్యచేసి దాదాపు వారంపాటు శరీరం ముక్కలున్న బ్యాగులను దాచి తర్వాత వాటిని పడేశాడు. హత్య తర్వాత భార్య బ్యాంక్ ఖాతా నుంచి 50 పౌండ్లు విత్‌డ్రా చేసి వాడుకున్నాడు. 'భార్యను హత్య చేస్తే భర్తకు కలిగే లాభాలేంటి?. ఆ తర్వాత నన్ను ఎవరైనా వెంబడిస్తారా?. కూపీ లాగుతారా?' అంటూ హత్యకు ముందు కొన్ని అంశాలపై ఆన్‌లైన్‌లో సెర్చ్‌చేశాడు. ఈ ఆన్‌లైన్ సెర్చ్ హిస్టరీని సైతం పోలీసులు వెలికితీశారు.

సహజీవనం చేసినా భరణం

మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

భోపాల్: చట్టబద్ధంగా వివాహం చేసుకోకపోయినా ఒక పురుషుడితో చాలాకాలం సహజీవనం చేసి విడిపోయిన మహిళ భరణానికి అర్హురాలేనని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది. భరణం ఇవ్వాలన్న కింది కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. 38 ఏళ్ల శైలేంద్ర బాప్చే, 48 ఏళ్ల అనిత చాలాఏళ్లు సహజీవనం చేశారు. కుమారుడు పుట్టాక విడిపోయారు. బిడ్డను పోషించుకోవడానికి, తన జీవనానికి భరణం ఇవ్వాలని అనిత డిమాండ్ చేయగా శైలేంద్ర అంగీకరించలేదు. దాంతో ఆమె ట్రయల్ కోర్టును ఆశ్రయించింది. అనిత్ పిటిషన్‌పై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు ఆమెకు నెలకు రూ.1,500 చొప్పున భరణం చెల్లించాలని శైలేంద్రను ఆదేశించింది. ఈ ఉత్తర్వులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ శైలేంద్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ జేఎస్ అహ్లూవాలియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వును సమర్థించింది. శైలేంద్ర పిటిషన్‌ను కొట్టివేసింది. సహజీవనం చేసి విడిపోయిన మహిళ తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉంటే సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద ఆమెకు భరణం చెల్లించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

శిబిరాల నుంచే ఓటు

మణిపూర్‌లో భిన్న వాతావరణం
సగం పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమే

ఇంఫాల్: గత ఏడాదంతా జాతుల వైరంతో అట్టుడికిపోయిన మణిపూర్ ఇంకా నివురుగప్పిన నిప్పులానే ఉంది. సార్వత్రిక ఎన్నికల వేళ ప్రచారంతో మోతెక్కిపోయే రాష్ట్రాలకు భిన్న వాతావరణం మణిపూర్‌లో నెలకొంది. మెయితీ, కుకీ తెగల గొడవలతో 50,000 మందికిపైగా స్థానికులు సహాయక, పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. తమ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న భావన వారిలో గూడుకట్టుకుంది. లోక్‌సభ ఎన్నికలపైనా వ్యతిరేక భావన నెలకొంది. దాంతో మరో రెండు వారాల్లో పోలింగ్ ఉన్నా ఎన్నికల హడావుడే కనిపించడం లేదు. ''మణిపూర్‌లో 2,955 పోలింగ్ స్టేషన్లలో సగం సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో వేరే ప్రాంతాలకు వలసపోయిన వారి కోసం 94 స్టేషన్లు ఏర్పాటుచేస్తున్నాం. 24,000 మంది శిబిరాల నుంచే ఓటేయనున్నారు'' అని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ఝా అన్నారు. ఓటర్లతో మాట్లాడి ఎన్నికలపై సదాభిప్రాయం పెంచి పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నట్టు చెప్పారు. గత ఏడాది మే మూడో తేదీన లోయ ప్రాంతాల్లో ఉండే మెజారిటీ జనాభా మైతేయ్‌లకు రాష్ట్రంలో ఎస్టీ హోదా డిమాండ్‌కు వ్యతిరేకంగా కుకీలు చేపట్టిన గిరిజనుల సంఘీభావ ర్యాలీ తర్వాత హింస ప్రజ్వరిల్లింది. మైతేయ్, కుకీల విద్వేషకాండలో 219 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది ప్రాణభయంతో సొంతూరిని వదిలి పారిపోయి ఐదు లోయ జిల్లాలు, మూడు కొండ జిల్లాల్లోని శిబిరాల్లో దాక్కున్నారు. ఘర్షణలు పూర్తిగా సద్దుమణకముందే రాష్ట్రంలో ఎన్నికలు అవసరమా? అంటూ వేలాది మంది బాధితులు, కొన్ని పౌర సంఘాలు ప్రశ్నిస్తూ ఎన్నికల బాయ్‌కాట్‌కు పిలుపునిచ్చాయి. ''గత లోక్‌సభ ఎన్నికల్లో మణిపూర్‌లో చక్కటి పోలింగ్ శాతం నమోదైంది. ఇది ఎన్నికల ప్రక్రియపై రాష్ట్ర ఓటర్ల నమ్మకానికి అద్దంపడుతోంది. ఈసారి గణనీయమైన పోలింగ్‌కు కృషిచేస్తాం'' అని ప్రదీప్ ఝా అన్నారు.

జపొరిజియా అణు ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు

కీవ్: రష్యా ఆక్రమిత జపొరిజియా అణు విద్యుత్ ప్లాంట్‌పై డ్రోన్ దాడి జరిగిందని అధికారులు తెలిపారు. ప్లాంట్‌లోని ఆరో యూనిట్ డోమ్ సహా పలు చోట్ల ఉక్రెయిన్ మిలటరీ డ్రోన్లు ఆదివారం దాడి చేశాయన్నారు. అయితే ఎటువంటి నష్టం వాటిల్లలేదని, ఎవరూ చనిపోలేదని అన్నారు. ప్లాంట్‌లో అణుధార్మికత స్థాయిలు కూడా సాధారణంగానే ఉన్నట్లు వివరించారు. దాడి సమాచారం తమకు అందిందని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ(ఐఏఈఏ) తెలిపింది. ఇటువంటి దాడులతో భద్రతాపరమైన ప్రమాదాలున్నాయని హెచ్చరించింది. యూరప్‌లోనే అతి పెద్దదైన జపొరిజియా అణు విద్యుత్కేంద్రం 2022 నుంచి రష్యా ఆధీనంలోనే ఉంది. ఇందులోని ఆరు యూనిట్లు కొద్ది నెలలుగా మూతబడి ఉన్నాయి.

అరుణాచల్‌లో ఆమె ప్రాతినిధ్యమేది?

ఎన్నికల బరిలో కనిపించని మహిళలు • రెండు లోక్‌సభ స్థానాలకు ఒక్కరు, 50 అసెంబ్లీ స్థానాలకు 8 మంది



ఈటానగర్: చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం విషయంలో అరుణాచల్ ప్రదేశ్ అందుకు మినహాయింపేమీ కాదు. రెండు లోక్‌సభ స్థానాలతో పాటు రాష్ట్రంలో 50 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏకకాలంలో ఏప్రిల్ 19న ఎన్నికలు జరగనున్నాయి. కానీ ఈ ఈశాన్య రాష్ట్రంలో ఎన్నికల బరిలో దిగిన మహిళల సంఖ్య మాత్రం అంతంతే...

ఇప్పటివరకు 15 మంది...

అరుణాచల్ ఈస్ట్, అరుణాచల్ వెస్ట్ రెండు లోక్‌సభ స్థానాలకు మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. గణ సురక్ష పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న టోకో శీతల్ ఒక్కరే మహిళ. 50 అసెంబ్లీ స్థానాలకు ఎనిమిది మంది మహిళలు మాత్రమే నామినేషన్లు వేశారు. వారిలో అధికార బీజేపీ నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి ముగ్గురు కాగా ఒకరు ఇండిపెండెంట్. వీరిలో హయులియాంగ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి దాసంగ్లు పుల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1987లో అరుణాచల్ ప్రదేశ్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి కేవలం 15 మంది మహిళలు మాత్రమే అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు రాష్ట్రం నుంచి ఒక మహిళ మాత్రమే రాజ్యసభలో ప్రాతినిధ్యం వహించారు. సిబో కైను 1978లో అసెంబ్లీకి గవర్నర్ నామినేట్ చేశారు. పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ (పీపీఏ) అభ్యర్థిగా సెప్పా నియోజకవర్గం నుంచి 1980లో అసెంబ్లీకి ఎన్నికైన మొదటి మహిళ న్యారీ వెల్లి. కోమోలి మొసాంగ్ 1980లో నాంపాంగ్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. 1990లో కాంగ్రెస్ అభ్యర్థిగా తిరిగి ఆమె విజయం సాధించారు. ఒమేమ్ మోయోంగ్ డియోరీ 1984లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1990లో కాంగ్రెస్ టిక్కెట్‌పై లేకాంగ్ అసెంబ్లీ స్థానం నుంచి కూడా గెలుపొందారు.

బలమైన గొంతుకలు కావాలి..

సాంస్కృతిక అడ్డంకులు, సామాజిక–ఆర్థిక పరిమితులు, అవగాహన లేమి వంటి అనేక అంశాలు ఎన్నికల రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. రాజకీయ ప్రక్రియలో మహిళల ప్రమేయాన్ని ప్రోత్సహించే వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రభుత్వం, పౌర సమాజ సంస్థల సమష్టి కృషి అవసరమని అరుణాచల్ ప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ కెంజుమ్ పాకం అన్నారు. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లపై చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలని రాజీవ్ గాంధీ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాని బాత్ సూచించారు. అప్పుడే అరుణాచల్ వంటి చోట్ల వారికి ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు.



ఎన్నికల విచిత్రం

భువనేశ్వర్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ అపరాజితా సారంగి (చీరకట్టులో ఉన్న వ్యక్తి) ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆనంద బన అర్బన్ ఫారెస్టులో ఇలా జుంబా డాన్స్ చేసి అలరించారు

ఎలక్షన్ బీట్

ఆజాద్‌పై మెహబూబా ముఫ్తీ పోటీ

శ్రీనగర్: లోక్‌సభ ఎన్నికల్లో అనంత్‌నాగ్–రాజౌరీ లోక్‌సభ స్థానంలో డీపీఏపీ అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్‌పై పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ(పీడీపీ) చీఫ్ మెహబూబా ముఫ్తీ బరిలో దిగుతున్నారు. కశ్మీర్లో మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ఆమె ఆదివారం ప్రకటించారు. తనకు మద్దతివ్వాల్సిందిగా కాంగ్రెస్, ఎన్సీలను కోరారు.

బీజేపీ తెచ్చిపెట్టిన నిరుద్యోగమిది: ఖర్గే

న్యూఢిల్లీ: దేశంలో బీజేపీ తెచ్చిపెట్టిన నిరుద్యోగ సమస్యే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానాంశమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. ఉద్యోగాలు దొరక్క యువత అల్లాడుతోందని ఆదివారం ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ''ఐఐటీ, ఐఐఎం పట్టభద్రులకే ఉపాధి దొరకడం లేదంటే దేశ యువత భవితను బీజేపీ ఎలా నాశనం చేస్తోందో ఊహించుకోవచ్చు. మోదీ హయాంలో 2014 నుంచి దేశంలో నిరుద్యోగం మూడు రెట్లు పెరిగింది'' అన్నారు.

జూన్ 4 తర్వాత మోదీకి లాంగ్ లీవ్ తప్పదు

మోదీ అబద్ధాలు విని విని దేశ ప్రజలు విసిగిపోయారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. జూన్ 4 తర్వాత ఆయన లాంగ్ లీవ్‌పై వెళ్లక తప్పదన్నారు.

అవినీతి అంతమే ప్రధాని పంతం: నడ్డా

అరియలూర్ (తమిళనాడు): దేశంలో అవినీతిని అంతం చేసేందుకు ప్రధాని మోదీ తీవ్రంగా కృషి చేస్తోంటే..జైలులోనో, బెయిలుపైనో ఉన్న ఇండియా కూటమి నేతలు అవినీతిపరులను కాపాడేందుకు కంకణం కట్టుకున్నారని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వంటి వారు జైలుకెళ్లగా, కాంగ్రెస్ నేతలు సోనియా, ఆమె కుమారుడు రాహుల్ గాంధీ తదితరులు బెయిల్ తెచ్చుకున్నారన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే వసూళ్ల పాల్పడుతూ ప్రైవేట్ పంచాయతీలు చేస్తోందన్నారు.

బీజేపీలో చేరకుంటే దాడులే!

దర్యాప్తు సంస్థలే బెదిరిస్తున్నాయి: మమత

కోల్‌కతా: అధికార బీజేపీపై తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి ఫైరయ్యారు. బీజేపీలో చేరాలని, లేదంటే దాడులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని తమ పార్టీ నేతలను దర్యాప్తు సంస్థలు బెదిరిస్తున్నాయని ఆరోపించారు. ఆదివారం పురులియా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ, ఐటీ వంటి జాతీయ దర్యాప్తు సంస్థలను ఆయుధంగా చేసుకొని బీజేపీ తమ పార్టీ నేతలను వేధిస్తోందని ఆమె మండిపడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా ఆయా సంస్థలు ఇళ్లలోకి చొరబడుతున్నాయని విమర్శించారు. శ్రీరామ నవమి నేపథ్యంలో మత కల్లోహాలు సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

జమ్మూలో మహిళా భద్రతా బృందం

జమ్మూ: జమ్మూ లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 26న జరగనున్న పోలింగ్‌కు భద్రత కోసం జమ్మూ కశ్మీర్ పోలీస్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్‌వోజీ)లోని ప్రత్యేక మహిళా దళం మోహరించింది. పూర్తి ఆటోమేటిక్ ఆయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ దుస్తులు ధరించిన ఎనిమిది మంది సభ్యుల బృందం పెట్రోలింగ్ విధులు నిర్వహించనుంది. సోదాలు, వాహన తనిఖీలు చేయనుంది. దీన్ని మహిళా ప్రయాణికులు స్వాగతించారు.

ఎన్డీఏకు 4,000 సీట్లు ఖాయం: నితీశ్

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మరోమారు నాలుక్కరుచుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 4 వేలకు పైగా సీట్లు సాధించనుందని ఆదివారం బిహార్‌లోని నవడా ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలోనే అన్నారాయన. తొలుత ఎన్డీఏ నాలుగు లక్షలకు పైగా సీట్లు సాధించనుందన్నారు. వెంటనే నాలుక్కరుచుకుని, నాలుగు వేల సీట్లు గెలుస్తుందన్నారు. చివరికి 400కు పైగా సీట్లు సాధిస్తుందంటూ సరి చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

మోదీ గ్యారెంటీ... బంగారమే: రాజ్‌నాథ్

జైపూర్: ప్రధాని నరేంద్ర మోదీ గ్యారెంటీ అంటే 24 క్యారెట్ల స్వచ్ఛ బంగారంతో సమానమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆయన చెప్పినవన్నీ చేస్తున్నారు, ప్రజలే ఇందుకు సాక్ష్యమని చెప్పారు. ఆదివారం ఆయన జైపూర్‌లో మీడియాతో మాట్లాడారు. భారీగా హామీలిచ్చి, అమలు చేయని కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరన్నారు. మోదీ ప్రభుత్వ విశ్వసనీయతపై విదేశాలకు కూడా ఎలాంటి సందేహాలు లేవని స్పష్టం చేశారు.

సువిధ పోర్టల్‌కు 73వేల దరఖాస్తులు

సాక్షి, న్యూఢిల్లీ: నిష్పాక్షిక, స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన సువిధ' పోర్టల్‌కు పార్టీలు, అభ్యర్థుల నుంచి 73 వేలకు పైగా దరఖాస్తులు, అభ్యర్థనలు అందినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. తెలంగాణ నుంచి 863, ఆంధ్రప్రదేశ్ నుంచి 1,153 వచ్చాయని తెలిపింది. వీటిలో 44,626 అభ్యర్థనలను ఆమోదించామని తెలిపింది.

'కాంగ్రెస్ ఓడితే రాహుల్ తప్పుకోవాలి'

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆశించిన ఫలితాలను సాధించకుంటే ఆ పార్టీ అగ్రనేత రంగం నుంచి తప్పుకుంటే బాగుంటుందని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అభిప్రాయపడ్డారు. దాదాపు పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి చెప్పుకోదగ్గ విజయాలను అందించలేకపోయినప్పటికీ రాహుల్ గాంధీ పక్కకు తప్పుకోవడం లేదా వేరొకరికి బాధ్యతలను అప్పగించకుండా పార్టీని నడుపుతున్నారని చెప్పారు. తనను అడిగితే ఇలాంటి వైఖరి సైతం ప్రజాస్వామ్య వ్యతిరేకమని అంటానన్నారు.


అసోంలోని నగావ్ జిల్లాలో ఆదివారం ఇంటినుంచే ఓటేస్తున్న ఓ 85 ఏళ్ల వృద్ధురాలు. 80 ఏళ్లు దాటినవారు ఇంటినుంచే ఓటేసేందుకు ఈసారి ఈసీ వెసులుబాటు కల్పించడం తెలిసిందే.

సాక్షి కరీంనగర్

సోమవారం ¡ 8 ¡ ఏప్రిల్ ¡ 2024



భక్తుల పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురి గోదావరికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ(సా॥)	సహర్ మంగళ(ఉ॥)
కరీంనగర్	6.29	4.35
పెద్దపల్లి	6.36	4.42
రాజన్న సిరిసిల్ల	6.36	4.42
జగిత్యాల	6.36	4.42

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.0/28.0

ఎండలు దంచికొడతాయి. మధ్యాహ్నం తీవ్ర వడగాలులు వీస్తాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలి



హోటల్‌లో అరటి ఆకులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని హోటళ్ల ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశించారు. ఆదివారం నగరంలోని పలు హోటళ్లను తనిఖీ చేశారు. కొన్ని హోటళ్లలో ప్లాస్టిక్ ప్లేట్స్‌కు బదులు, అరిటాకులు వాడడాన్ని అభినందించారు. అన్ని హోటళ్లు ప్లాస్టిక్ ప్లేట్స్‌ను వాడడం నిలిపివేయాలని, అరటి ఆకులు ఉపయోగించుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్.మహేందర్, శ్యాం, నర్సయ్య, అమర్ ఉన్నారు.

స్పెషల్ అసిస్టెంట్లకు రెమ్యూనరేషన్ పెంచాలి

కరీంనగర్: పదో తరగతి మూల్యాకనం స్పెషల్ అసిస్టెంట్లకు రెమ్యూనరేషన్ పెంచాలని కోరుతూ టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి ఆదివారం రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావుకు ఫ్యాక్స్ ద్వారా, ఎంఈవో మధుసూదనచారికి రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని హెచ్‌ఆర్‌ఏ పరిధిలో మాత్రమే పనిచేస్తున్న ఎస్‌జీటీ, పీఈటీలను తీసుకోవాలి కానీ జిల్లా కేంద్రం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తున్న వారికి విధులు కేటాయించారన్నారు. ఎనిమిది కిలోమీటర్ల దూరం దాటితే టీఏ, డీఏ మంజూరు చేయాలని కోరారు. సెలవు దినాల్లో పనిచేసిన స్పెషల్ అసిస్టెంట్లకు సీసీఎల్స్ మంజూరు చేయాలని పేర్కొన్నారు.

వైరాగ్యంకు శ్రీశ్రీ కళా వేదిక పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్: వైరాగ్యం ప్రభాకర్‌కు పురస్కారం వరించింది. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శ్రీశ్రీ కళా వేదిక, కోనసీమ రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమలాపూర్‌లో నిర్వహించిన 132వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో కరీంనగర్‌కు చెందిన ప్రభాకర్ శ్రీశ్రీ కళా వేదిక పురస్కారం అందుకున్నారు. శాలువా, మెమొంటో, ప్రశంసాపత్రం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు అభినందించారు.


ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళా శాలలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయు ల శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఐటీ రంగంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ అంశంపై వివిధ రంగాలకు చెందిన ఏడుగురు వక్తలు ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ వేదికగా శిక్షణ ఇచ్చారు. చివరిరోజు ఆదివారం ఇస్రో శాస్త్రవేత్త చంద్రశేఖర్ ఇండస్ట్రీ 4.0 అనే అంశంపై ప్రసంగించారు. శిక్షణలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 313 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమత, వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, శిక్షణ సదస్సు కన్వీనర్ లలితా అశ్విని పాల్గొన్నారు.

నగరంలో పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులతో పాటు సబ్ స్టేషన్ నిర్వహణ, విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున సోమవారం ఉ.9 నుంచి మ.12 గంటల వరకు 33/11 కేవీ పద్మనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మంకమ్మతోట, సంతోష్‌నగర్, వినాయక్‌నగర్, కుర్మవాడ, శ్రీహరినగర్, పీటీసీ, మార్కండేయనగర్, ప్రగతినగర్, రాజీవ్‌పార్కు, పాత లేబర్ అడ్డ, ఆదిత్య అపార్ట్‌మెంట్, సిద్ధార్థ స్కూల్, వాసర హాస్పిటల్, పారమిత, లారెల్ పాఠశాలల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.




లోయర్ మానేరు డ్యాంలో తగ్గిన నీటిమట్టం



లోయర్ మానేరు డ్యాంలో నీటిమట్టం తగ్గడంతో తేలిన పాత రోడ్డు



మధ్యమానేరులో నీరు లేక తేలిన శాభాష్‌పల్లి గ్రామ నీళ్ల ట్యాంకు, ఇళ్లు



ఎల్లంపల్లిలో తగ్గిన నీటి మట్టం



వట్టిపోయిన ఎల్లంపల్లి ప్రాజెక్టు



కథలాపూర్ శివారులో నీరులేక ఎండిపోయిన వరద కాలువ

వట్టిపోయి.. నీటి జాడలు కోల్పోయి..

ఎండల ధాటికి ఉమ్మడి జిల్లాలోని జలాశయాలు అడుగంటాయి. గతేడాది ఇదే సమయంలో నీటితో కళకళలాడిన ప్రాజెక్టులు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. జలాశలయాల ఎగువ, దిగువ ప్రాంతాలు ఎడారిని తలపిస్తున్నాయి. భూగర్భజలాలు పడిపోయి చెరువులు, బావులు వట్టిపోతున్నాయి. తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలోని లోయర్ మానేరు డ్యాం, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేరు, పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో నీళ్లు అడుగంటి ఇసుక తిన్నెలు తేలాయి. జగిత్యాల జిల్లాలోని వరదకాలువ పూర్తిగా ఎండిపోయింది. ఈ చిత్రాలు ఉమ్మడి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. - సాక్షి నెట్‌వర్క్

‘పెద్దల’ ఇళ్లలో బల్దియా కార్మికులు

- నగరపాలక సంస్థ నుంచి జీతాలు
- సేవలు రాజకీయ నేతలకు..
- సీడీఎంఏ ఆదేశాలు బేఖాతరు
- ఎలక్షన్ కోడ్ ఉన్నా పారిశుధ్య కార్మికులు అక్కడే..



పారిశుధ్య కార్మికులు (ఫైల్)

నగరపాలకసంస్థలో కార్మికుల వివరాలు..	
పారిశుధ్య కార్మికులు	1,092
రెగ్యులర్ కార్మికులు	76
ఔట్‌సోర్సింగ్ కార్మికులు	1,016

కరీంనగర్ కార్పొరేషన్: వారంతా.. నగరంలోని వీధులు, రోడ్లు శుభ్రం చేస్తూ రోజుకు 8 గంటలు విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులు. చేసిన పనికి ఫలితంగా నగరపాలకసంస్థ నుంచి జీతాలు తీసుకుంటున్న ఒప్పంద కార్మికులు. నిత్యం వీధుల్లో కనిపించాల్సిన పారిశుధ్య కార్మికులు పెద్దల ఇళ్లలో దర్శనమిస్తున్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల ఇళ్లలో పారిశుధ్య కార్మికులు ఉండొద్దని సీడీఎంఏ స్పష్టమైన ఆదేశాలు ఉన్నా నగరపాలకసంస్థలో వాటిని పట్టించుకున్న నాథుడు లేడు. ఇటీవలి కాలంలో నగరం శరవేగంగా విస్తరిస్తుండడం తెలిసిందే. శివారు గ్రామపంచాయతీలు విలీనం కావడం, నివాసాలు పెరిగి కొత్త కాలనీలు పుట్టుకొస్తుండడంతో నగర విస్తరణ కొనసాగుతోంది. దాదాపు 4 లక్షల 25 వేల జనాభా ఉన్న నగరంలో పారిశుధ్య నిర్వహణ నిత్యం సవాల్‌లాంటిదే. రోజూ ప్రధాన రహదారులతో పాటు, పలు కాలనీల్లోని రోడ్లు, వీధులను శుభ్రం చేస్తూ, డ్రైనేజీల్లో సిల్ట్, జంతు కళేబరాలు తొలగిస్తూ నగర ప్రజానీకానికి పారిశుధ్య పరంగా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు నగరపాలకసంస్థలో శానిటేషన్ విభాగమనే పెద్ద వ్యవస్థే ఉంది. ప్రస్తుతం 1,092 మంది పారిశుద్ధ్య కార్మికులు నగరపాలకసంస్థ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారు.

పెద్దల సేవలో..

క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన పారిశుధ్య కార్మికులు పెద్దల ఇళ్లలో సేవలు అందిస్తున్నారు. నగరంలోని పలువురు రాజకీయ నేతలు, కొంత మంది ఉన్నతాధికారుల ఇళ్లలో పారిశుధ్య కార్మికులు నిబంధనలకు విరుద్ధంగా ఇంటిపని చేయడం ప్రస్తుతం ఎన్నికల వేళ మరోసారి వివాదాస్పదమైంది. రాజకీయ నేతలు, ఉన్నతాధికారుల ఇళ్లలో పారిశుధ్య కార్మికులు ఉండొద్దనే పురపాలక శాఖ కమిషనర్ (సీడీఎంఏ) స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, నగరంలో మాత్రం కనీసం వంద మంది పారిశుధ్య కార్మికులు నేతలు, ఉన్నతాధికారుల ఇళ్లలో పనిచేస్తుండడం గమనార్హం. ఇందులో చాలా మంది ఇంటి పనికి, కొంతమంది రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ప్రతి నెలా నగరపాలకసంస్థ నుంచి జీతాలు తీసుకుంటున్నా, పని మాత్రం పెద్దల ఇళ్లలో చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పలువురు గతంలో ఫిర్యాదులు చేసినా, పెద్దగా ఫలితం కనిపించడం లేదు. ఇదిలాఉంటే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అయినా రాజకీయ నేతల ఇళ్లలో పారిశుధ్య కార్మికులు పనులు చేస్తుండడం హాట్‌టాపిక్‌గా మారింది.

పనులెట్లా..?

పారిశుధ్య కార్మికులంతా పనిచేస్తేనే నగరంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం, డ్రైనేజీలు నిండిపోవడం, చాలా ప్రాంతాలు అపరిశుభ్రంగా కనిపిస్తూ ఉంటుంది. అలాంటిది దాదాపు వంద మంది కార్మికులు నిత్యం ఈ పనులకు దూరంగా ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడం పెద్ద కష్టం కాదు. ఒక కార్మికుడు రోజూ 8 గంటల పాటు పనిచేస్తాడు. ఈ లెక్కన వందమంది కార్మికుల ఎన్ని పనిగంటలు క్షేత్రస్థాయిలో నగర ప్రజానీకం కోల్పోతుందో ఊహించొచ్చు. రోడ్లపై చెత్తాచెదారం, డ్రైనేజీల్లో సిల్ట్ పేరుకుపోవడం, అపరిశుభ్ర రోడ్లు, శివారు డివిజన్‌లలో అధ్వానంగా పారిశుద్ధ్యం, నిత్యం తగలబడిపోతున్న డంప్‌యార్డ్ ఇలా శానిటేషన్‌కు సంబంధించిన సమస్యలెన్నో ఉన్నాయి. అందుకు సరిపడా కార్మికులు కాగితాల్లో ఉన్నారు. కానీ ప్రైవేట్ సేవల కారణంగా క్షేత్రస్థాయిలో పారిశుధ్య సేవలు ప్రజలకు అందడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా ×పెద్దల¶ ఇళ్లలో లేబర్ల వ్యవహారంపై దృష్టి సారిస్తే, పూర్తిస్థాయిలో నగర ప్రజానీకానికి పారిశుధ్య సేవలందుతాయి.

మోదీ, సంజయ్ గాలి వీస్తోంది



మాట్లాడుతున్న అభయ్‌పాటిల్

- పార్లమెంట్ ఎన్నికల రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్‌పాటిల్

కరీంనగర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు బండి సంజయ్ గాలి వీస్తోందని పార్లమెంట్ ఎన్నికల బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. ఆదివారం నగరంలోని శుభమంగళ కన్వెన్షన్‌లో నిర్వహించిన కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ అంతర్గత సమావేశంలో మాట్లాడారు. గతంతో పోలిస్తే ఈసారి బండి సంజయ్ రెట్టింపు మెజార్టీతో గెలవబోతున్నారని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి 10 కంటే ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ గెలుపునకు నిర్వహించాల్సిన సభలు, సమావేశాలు, కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. మోదీ ప్రభుత్వం దేశం కోసం చేపట్టిన విప్లవాత్మక చర్యలతోపాటు ప్రజల అభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మీడియాలో ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా సంజయ్ చేసిందేమీ లేదు

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్: గత ఎన్నికల్లో ఎంపీగా ఓడినా కరీంనగర్‌లోనే ఉంటూ ప్రజలకు సేవకుడిలా పని చేస్తున్నానని.. కానీ బండి సంజయ్ ఎంపీగా గెలిచి పార్టీ అభివృద్ధి కోసం పని చేశాడు తప్ప ప్రజల కోసం చేసిందేమీ లేదని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 9వ డివిజన్ కార్పొరేటర్ జంగిలి అయిలేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రముఖులు, ప్రజలతో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావుతో కలిసి హాజరై మాట్లాడారు. 3 లక్షల జనాభా ఉన్న కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ చేయడం కష్టమని కేంద్ర పెద్దలు చెప్పినా.. పట్టుబట్టి అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వద్దకు వెళ్లి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయించి నగరాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న సంజయ్ నయాపైసా నిధులు తేలేదని, కరీంనగర్‌కు మంజూరైన ట్రిపుల్ ఐటీని ఇతర రాష్ట్రాలకు కేంద్రం తరలిస్తుంటే చేతులు ముడుచుకుని ఉన్నారని విమర్శించారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతునవుతానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ, కరీంనగర్ ప్రజలు తనను నాలుగుసార్లు గెలిపించడం అదృష్టమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే ఇద్దరం జోడెద్దుల్లా కలిసి జిల్లా రూపురేఖలు మారుస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గందే మహేశ్, ప్రభావతి, కలర్ సత్తన్న, బండ వేణు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం పోగానే రైతులు గుర్తుకొచ్చారా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

కరీంనగర్ కార్పొరేషన్: అధికారం పోగానే బీఆర్‌ఎస్ నాయకులకు హఠాత్తుగా రైతులు గుర్తుకొచ్చారా అని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రశ్నించారు. ఆదివారం డీసీసీ కార్యాలయంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అకాల వర్షాలకు సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 20 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందిస్తామని, తక్షణమే రూ.228 కోట్లు విడుదల చేస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. అలాంటి కేసీఆర్ ఇప్పుడు పొలంబాట అంటూ రైతుల పట్ల మొసలికన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. వర్షాభావంతో ఏర్పడిన కరువును కాంగ్రెస్ ప్రభుత్వంపైకి నెట్టే బూటకపు మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితుల్లో లేరన్నారు. సమావేశంలో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్లం.. నిర్లక్ష్యం

- ముందుంది దిగుబడి కాలం
- పూర్తయ్యేనా నిర్మాణం
- అర్జీలిచ్చి నెలలు గడిచినా మంజూరేది?



ఇప్పలనర్సింగాపూర్‌లో రోడ్డుపైనే ధాన్యం(ఫైల్)

కరీంనగర్ అర్బన్: మరోవారం రోజుల్లో ధాన్యం ముంచెత్తనుంది. రోడ్లపై కుప్పలుగా ధాన్యం ఆరబెట్టడం.. రోడ్డు ప్రమాదాలు జరగడం ప్రతి సీజన్‌లో జరుగుతున్న తంతు. ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు అనాథలుగా మిగులుతుండగా దిద్దుబాటు చర్యలు శూన్యం. పంట దిగుబడులను ఆరబోసుకునేందుకు ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి రాయితీని ప్రకటించగా అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం విడ్డూరం. ఔత్సాహిక రైతులను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాల్సి ఉండగా ప్రేక్షకపాత్ర పోషించడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి రూ.22.03కోట్లు కేటాయించగా రాయితీపై నిర్మించనున్న విషయం తెలిసిందే.

కల్లాలు మూడు రకాలు..

ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులు కల్లాలు నిర్మించుకునేందుకు అర్హులు. రైతులు తమ సొంత పొలంలో నిర్మించుకోవాలి. ఇందుకు మూడు రకాల నిర్మాణాలు ఉండగా 50 చదరపు అడుగుల నిర్మాణానికి రూ.56వేలు, 60 చదరపు గజాలకు రూ.68వేలు, 75 చదరపు గజాలకు రూ.85వేలు ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు కల్లాల నిర్మాణం పూర్తి ఉచితం కాగా ఓసీ, బీసీ రైతులకు 90శాతం రాయితీపై నిర్మించనున్నారు. మిగతా 10శాతం వాటాగా సదరు రైతులు చెల్లించాలి.

రహదారులే కల్లాలా..?

జిల్లాలో మంజూరైన కల్లాలు నామమాత్రమే. రైతుల సంఖ్య లక్షల్లో ఉండగా మంజూరు చేసిన వాటి సంఖ్య కేవలం 2,728 కాగా పూర్తయినవి 466మాత్రమే. గతేడాది జూలైలో కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయగా.. ఆరంభంలో హడావుడి చేసిన సంబంధిత శాఖలు అంతలోనే నీరుగార్చాయి. అర్జీలు పట్టుకుని రైతులు ప్రజావాణిని ఆశ్రయించడం, మంజూరు చేసిన వాటికి దిక్కులేకపోవడం విడ్డూరం. జిల్లాలో గన్నేరువరం చిన్న మండలమైనా అన్ని మండలాలకు మించి 469 మంజూరు చేశారు. అక్కడి యంత్రాంగం కృషి ప్రశంసనీయం కాగా 200లకు పైగా కల్లాలు పూర్తి చేయగా మిగతావి ప్రగతిలో ఉన్నాయి. మిగిలిన మండలాల ప్రగతి పరిశీలిస్తే అత్యంత పేలవం. ఇల్లందకుంట, జమ్మికుంట, తిమ్మాపూర్ మండలాల్లో తక్కువ సంఖ్యలో పూర్తి చేయడం గమనార్హం. చిగురుమామిడి, చొప్పదండి, గంగాధర, హుజూరాబాద్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, సైదాపూర్, వీణవంక మండలాల్లోనూ అంతే.

ప్రచారం అంతంతే

జిల్లాలో కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూరు వ్యవసాయ డివిజన్లుండగా గతంలోనే వ్యవసాయ అధికారులు సదస్సులు నిర్వహించారు. మొక్కుబడిగా ప్రచారం నిర్వహించగా ఆచరణలో చేతులెత్తేశారు. ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు అవగాహన కల్పించగా పలు మండలాల్లో పూర్తిస్థాయిలో విశేష అవగాహన కల్పించారు. మంజూరు నుంచి బిల్లుల చెల్లింపు వరకు కీలకంగా వ్యవహరించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే కల్లాల నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని, తదనుగుణంగా రైతులను ప్రోత్సహిస్తామని వ్యవసాయ, డీఆర్డీఏ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో గణాంకాల్లో వివరాలు	
వ్యవసాయ భూములు:	3.50లక్షల ఎకరాలు
మొత్తం రైతులు:	1,62,311
మంజూరైన కల్లాలు:	2,728
పూర్తయిన కల్లాలు:	466

మండలాల వారీగా మంజూరు సంఖ్య

మండలం	మంజూరు
చిగురుమామిడి	149
చొప్పదండి	154
ఇల్లందకుంట	148
గంగాధర	145
గన్నేరువరం	469
హుజూరాబాద్	99
జమ్మికుంట	241
కరీంనగర్ రూరల్	83
శంకరపట్నం	173
కొత్తపల్లి	100
మానకొండూరు	271
రామడుగు	215
సైదాపూర్	259
తిమ్మాపూర్	128
వీణవంక	94

క్లుప్తంగా

గోవుల పట్టివేత



వ్యాన్‌లో ఉన్న గోవులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యాన్‌ను హిందూవాహిని కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మహారాష్ట్ర చంద్రపూర్ సమీపం నుంచి పెద్దపల్లి జిల్లా ఎలిగేడు గ్రామానికి కొమురయ్య వ్యానులో అక్రమంగా తరలిస్తున్న మూడు ఎద్దులు, ఒక ఆవు, లేగ దూడను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని గౌతమినగర్‌లోని గోశాలకు తరలించారు. హిందూవాహిని కార్యకర్తలు మణి, రాజ్‌కుమార్, నివాస్, సాయి, రంజిత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

శంకరపట్నం: కేశవపట్నంలో రూ.3,210 విలువ చేసే మద్యం పట్టుకున్నట్లు కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. సైదాపూర్ మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న షాబోద్దీన్ ఆదివారం కేశవపట్నంలో మద్యం దుకాణంలో రూ.3,210 విలువ చేసే మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య

మల్యాల(చొప్పదండి): అప్పుల బాధతో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మల్యాల ఏఎస్సై కృష్ణకుమార్ కథనం ప్రకారం.. ఒబులాపూర్ గ్రామానికి చెందిన బొజ్జ లక్ష్మీ(39) ఇటీవల నూతనంగా ఇల్లు నిర్మించుకుంది. అప్పులు తీర్చే మార్గం కానరాక మనస్తాపం చెంది శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గ్రామ శివారులోని గుట్టపై చెట్టుకు ఉరివేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. మృతురాలి భర్త బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

పెద్దపల్లిరూరల్: రాఘవాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల సదయ్య, గాండ్ల రామకృష్ణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లేశ్ ఆదివారం తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో సదయ్య, రామకృష్ణ భూ సంబంధమైన విషయాన్ని ప్రస్తావించి కులం పేరుతో దూషించారంటూ రాఘవాపూర్ గ్రామానికే చెందిన కుమ్మరి జీవన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫిట్స్‌తో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఒకరు ఆదివారం ఫిట్స్‌కు గురయ్యారు. వెంటనే ఆలయ అధికారులు, స్థానికుల సమాచారంతో 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు వేములవాడటౌన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు. సదరు వ్యక్తి వివరాలు తెలిసిన వారు వేములవాడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

నెల ముందే నిప్పుల సూరీడు

- ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వేడెక్కుతున్న భూభాగం..
- వాతావరణ సమతుల్యతకు దెబ్బ



కరీంనగర్ అర్బన్: మే నెలకు ముందే సూరీడు నిప్పులు కక్కుతుండటం ఆందోళనకర పరిణామం. ఇటీవల వాతావరణ శాఖ హెచ్చరికల క్రమంలో మూడు రోజులు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. వాతావరణ శాఖ కొలమానం ప్రకారం 35 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైతే ప్రజలకు, పంటలకు ప్రయోజనం. 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీలు నమోదైతే జాగ్రత్తగా వ్యవహరించాలి. 41–45 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైతే అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు చెబుతున్నారు ఆరెంజ్ అలర్ట్‌గా భావించాలి. ఇక 45కు పైగా ఉష్ణోగ్రత చేరిందంటే.. మానవాళి ప్రమాదంలో ఉన్నట్లు లెక్క. రెడ్ అలర్ట్ అన్నమాట.

హరితహారంలో సైనికులమవుదాం..

హరితహారం పథకం గతంలో ఆశించిన స్థాయిలో ఫలితాన్నివ్వలేదు. వర్షాభావ పరిస్థితులతో 2016–23 వరకు కోట్ల మొక్కలు నర్సరీల్లో మిగిలిపోయాయి. 2018–19లో మొక్కలు నాటినా.. వాటి సంరక్షణ చర్యలు పడకేయడంతో సగం మొక్కలు జీవం కోల్పోయాయి. వచ్చే వానాకాలంలో హరితహారాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఈక్రమంలో మనమంతా మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడంలో సైనికులమైతే పర్యావరణం పూర్వ వైభవం సంతరించుకుంటుంది.

తగ్గని ప్లాస్టిక్ వినియోగం..

40 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లను ప్రభుత్వం నిషేధించినా.. నియంత్రణలో అధికారులు విఫలమవుతున్నారు. సదరు వాడకం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఈ సంచులను మురుగు కాలువల్లో పారేయడంతో.. నీటి ప్రవాహాలకు అడ్డు తగులుతున్నాయి. వాతావరణ కాలుష్యం పెరగడానికి వాహనాల వినియోగం అధికమవడం ఓ కారణం. కాలం చెల్లిన వాహనాలు వినియోగించడం.. అసలు వాహన పరీక్షలే లేకపోవడంతో వాతావరణానికి ప్రతికూలంగా మారింది. జిల్లాలో రోజుకు సగటున 500 వాహనాలు కొత్తగా చేరుతున్నాయి. రవాణా శాఖ అధికారుల అంచనాల ప్రకారం జిల్లాలో గత డిసెంబర్ నాటికి 1.51లక్షలకు పైగా వాహనాలున్నాయి. వీటి ద్వారా వచ్చే పొగ, ధ్వని కాలుష్యం వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి.

వనంపై గొడ్డలి వేటు

ఉమ్మడి జిల్లా గణాంకాల ప్రకారం.. గతంలో ఉన్న పశ్చిమ డివిజన్‌లో 80వేల హెక్టార్లు, తూర్పు డివిజన్‌లో 1.50లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉండేవి. విభజించిన కరీంనగర్ జిల్లాలో మాత్రం కేవలం 0.03 శాతమే అడవులున్నాయి. అయిదేళ్ల కాలంలో పోడు వ్యవసాయం కోసం సుమారు 40వేల హెక్టార్లలో అడవులు నరికినట్లు అధికారులు గుర్తించారు. వందల మందిపై కేసులు నమోదు చేశారు. కానీ వనమేధం మాత్రం ఆగడం లేదు.

ప్రతి ఏటా ప్రమాదకరంగా ఉష్ణోగ్రతలు(సెంటిగ్రేడ్‌లలో)

2019	45.4
2020	45.8
2021	46.1
2022	45.2
2023	45.6
2024	44.1

గత అయిదు రోజులుగా ఉష్ణోగ్రతల తీరిలా..

తేదీ	జగిత్యాల	కరీంనగర్	సిరిసిల్ల	పెద్దపల్లి
03	40.0	40.3	40.5	41.0
04	41.1	42.8	42.1	42.8
05	42.1	43.1	42.0	43.5
06	44.2	44.4	43.2	44.6
07	40.5	41.2	39.5	40.5

వీణవంకలో 44 డిగ్రీలు

వీణవంక: వీణవంకలో రెండో రోజు కూడా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. రైతులు ఉదయం 9 గంటల్లోపే పనులు ముగించుకొని ఇంటికి చేరుతున్నారు. శనివారం జిల్లాలోనే అత్యధికంగా ఇక్కడ 44 డిగ్రీలు నమోదు కాగా.. ఆదివారం కూడా 44 డిగ్రీలు దాటింది. గతేడాది ఇదే సమయంలో రాష్ట్రంలోనే వీణవంకలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి., ఈసారి కూడా అదే రీతిలో నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కపోత తట్టుకోలేకపోతున్నారు. అసలే వరి కోతలు ఊపందుకున్నాయి. ఈ సమయంలో ఎండలు దంచి కొడుతుండటంతో రైతులు ఉదయం 6 గంటలకు వెళ్లి 9 గంటలకే ఇళ్లకు చేరుతున్నారు. పగటి పూట ఇళ్లకే పరిమితమవుతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితేనే బయటకి వస్తున్నారు. పంటలు చివరి దశకు చేరడంతో ఎండిపోయే ప్రమాదముంది.

పంటలపైనా ప్రభావం

ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల పంటలపైనా ప్రభావముంటుంది. వేడి ప్రభావాన్ని అడ్డుకునేందుకు పొలాల మధ్య ఖాళీ స్థలాల్లో చెట్లను పెంచాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల పండ్ల తోటలకు కొంత నష్టం కలిగే అవకాశముంది. – డా.జి.మంజులత, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం

విదేశాలకు వెళ్లే ప్రయత్నం.. అంతలోనే పరలోకానికి..

- రేణికుంట వద్ద రోడ్డు ప్రమాదం
- లారీని ఢీకొని యువకుడి దుర్మరణం



రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

తిమ్మాపూర్: ఆ యువకుడు ఇటీవల ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. తల్లిదండ్రుల కల అయిన విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇటీవలే బ్యాంకు లోన్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇంతలోనే ఆ యువకుడిని మృత్యువు కబళించింది. ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు కథనం ప్రకారం.. కోహెడ మండలం గుండారెడ్డిపల్లి చెందిన కడతల రాజశేఖర్‌రెడ్డి(24) సొంత పనుల నిమిత్తం ఆదివారం వారి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గుండారెడ్డిపల్లెకు రాత్రి 9 గంటలకు బయలుదేరాడు. ఈక్రమంలో రాజీవ్ రహదారిపై రేణికుంట వద్ద టైర్ పంచర్ కావడంతో లారీ ఆగి ఉంది. రాజశేఖర్‌రెడ్డి ఆగి ఉన్న లారీని గమనించకుండా వెనక నుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న రాజశేఖర్‌రెడ్డిని స్థానికులు అంబులెన్స్‌లో కరీంనగర్ తరలించే క్రమంలో కొత్తపల్లి–నుస్తులాపూర్ మధ్యలో మరణించాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారమందించడంతో.. వారు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులంటున్నారు. రాత్రివేళలో వాహనాలు నిలిచి ఉన్న క్రమంలో హెచ్‌కేఆర్ సిబ్బంది ఎలాంటి సహాయ చర్యలకు పాల్పడడం లేదని గ్రామస్తులు, వాహనదారులు మండిపడుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీని ఓడించండి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్



మాట్లాడుతున్న జె.వెంకటేశ్

కరీంనగర్: పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ సమగ్రత, సమైక్యతకు విఘాతం కలిగించేలా మతోన్మాదాన్ని పెంచి పోషించిందని, మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే దేశానికి పెను ప్రమాదమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.వెంకటేశ్ అన్నారు. కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిత్రాభవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెంచుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్ముకుంటూ దేశ సంపదను దోచుకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 200 సీట్లు కూడా దాటదని అన్నారు. సీపీఎం తెలంగాణ రాష్ట్రంలో భువనగిరి స్థానంలో పోటీ చేస్తుందని, మిగతా 16 స్థానాల్లో ఇండియా కూటమికి మద్దతిస్తుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు, సాగు, తాగునీటి సమస్యలు వస్తున్నాయని, వీటిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈనెల 17 వరకు బీజేపీ వైఖరిని ఎండగడుతూ జిల్లావ్యాప్త క్యాంపెయిన్ చేపడుతున్నామని, వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సులు, బహిరంగ సభలు నిర్వహిస్తామని తెలిపారు. బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధి చేయకుండా మత కల్లోలాలు సృష్టిస్తున్నారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు.శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేశ్, వెలమారెడ్డి రాజిరెడ్డి, జి.రాజేశం, నరేష్, మక్కపల్లి పూజ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



మృతిచెందిన లక్ష్మీకాంతం

కోరుట్లరూరల్: జోగిన్‌పెల్లి శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయికల్ మండల కేంద్రానికి చెందిన కటుకం లక్ష్మీకాంతం(64) అనే వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పైడిమడుగు గ్రామంలో జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తుండగా.. జోగిన్‌పెల్లి శివారులో బైకు అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు కటుకం కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

ఆరేళ్ల చిన్నారిపై వృద్ధుడి లైంగిక దాడి?

ధర్మారం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల పాపపై అదే గ్రామానికి చెందిన 60 సంవత్సరాల వృద్ధుడు అత్యాచారం చేసినట్లు సమాచారం. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ధర్మారం పోలీస్ స్టేషన్‌లో వృద్ధుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

పంట దొంగలకు చెక్..

- పండ్ల తోటలో విద్యుత్ స్తంభానికి సీసీ కెమెరా



విద్యుత్ స్తంభానికి సీసీ కెమెరా



ఖర్బూజ తోట వద్ద శ్రీనివాస్–మాధురి దంపతులు

జగిత్యాలఅగ్రికల్చర్: విద్యుత్ మోటార్లతోపాటు పండ్లు, కూరగాయలను కొంతమంది వ్యక్తులు ఎత్తుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన మర్రిపెల్లి శ్రీనివాస్–మాధురి దంపతులు వినూత్నంగా తాము సాగు చేసిన తోటలో సీసీ కెమెరా ఏర్పాటు చేసి దొంగల భరతం పడుతున్నారు. శ్రీనివాస్ దంపతులకు రోడ్డునాను కొని ఏడెకరాల భూమి ఉంది. ఇందులో ఖర్బూజ వంటి పండ్లతోపాటు బీర, బెండ, వంగ, టమాట వంటి రకరకాల కూరగాయలు సాగు చేస్తుంటారు. పంట కోతకు వచ్చినప్పుడు పంట ఉత్పత్తులు దొంగతనం చేస్తుండేవారు. రాత్రి తోట వద్ద కాపలా ఉండటం కష్టం కావడంతో.. జగిత్యాల నుంచి రూ.9వేల విలువ గల సీసీ కెమెరాను తెప్పించారు. తోటలోని విద్యుత్ స్తంభానికి బిగించారు. ఈ కెమెరా 360 డిగ్రీల వ్యాసర్ధంతో 40 మీటర్ల వరకు తిరుగుతుంటుంది. సోలార్‌తో పని చేస్తుంది. ఇందులో రాత్రి సమయంలో వెలుతురు కోసం లైట్ పని చేస్తుంది. ఈ కెమెరా రైతు ఫోన్‌కు అనుసంధానమై ఉంటుంది. తోటలోకి ఎవ్వరు వచ్చినా.. రైతులకు సైరన్ వెళ్తుంది. రైతు సైతం తోటల్లోకి రాకుండా అక్కడి నుంచే ఎవరు వచ్చారంటూ గట్టిగా అరిస్తే.. ఆ కెమెరా బాక్స్ నుంచి అరుపులు వినబడతాయి. కెమెరాలో నిక్షిప్తమైన సమాచారం వారం రోజుల వరకు ఉంటుంది. ఇందుకోసం 64జీబీ డాటా కార్డును ఉపయోగిస్తున్నారు. చాలా మంది రైతులు తోటల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

వాహనాల తనిఖీ పేరుతో వసూళ్ల దందా



రోడ్డు పక్కన మకాం వేసి దందా షురూ



వ్యాపారిని పక్కకు తీసుకెళ్తూ..

- తంగళ్లపల్లిలో గూడ్స్ వాహనాలే టార్గెట్
- సేల్స్ టాక్స్, జీఎస్టీ అధికారులమంటూ బెదిరింపులు
- అందినకాడికి దండుకున్న వైనం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సేల్స్‌టాక్స్, జీఎస్టీ అధికారులమంటూ తంగళ్లపల్లిలో గూడ్స్ వాహనాలను ఆపుతూ అక్రమ వసూళ్లకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తంగళ్లపల్లి–సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన కారును ఆపుకున్న వ్యక్తులు డ్రైవర్‌తో వాహనాలు ఆపుతూ డబ్బులు వసూళ్లకు పాల్పడ్డారు. తంగళ్లపల్లి–సిరిసిల్ల మార్గంలో ఆదివారం వెళ్తున్న గూడ్స్ వాహనాలను డ్రైవర్ ఆపి.. పత్రాలు సరిగా లేవు పక్కకు రావాలంటూ పిలిచి డబ్బుల బేరం మొదలుపెట్టాడు. డబ్బులు ఇవ్వకపోతే సరుకుతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన చిరు వ్యాపారులు అడిగినకాడికి ముట్టజెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ వ్యవహారం సమీపంలోని సీసీ కెమెరాలలో రికార్డయ్యింది. ఈ విషయంపై బాధితులను సంప్రదించగా.. ఆ అధికారులు ఎవరో కూడా తమకు తెలియదని డబ్బులు ఇమ్మంటే భయంతో ఇచ్చినట్లు చెప్పడం కొసమెరుపు. ఇంతకీ వాహనాలు తనిఖీ చేసింది అసలైన అధికారులా? నకిలీనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నిధుల స్వాహా విషయంలో రాజభానుకు సంబంధం లేదు

- గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం

కరీంనగర్: ఉపాధ్యాయుల సప్లమెంటరీ బిల్లులకు సంబంధించి రూ.10లక్షలు స్వాహా చేశారని తిమ్మాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్‌పై ఇటీవల వచ్చిన ఆరోపణలు సత్యదూరమని, రాజభానుకు ఆర్థిక లావాదేవీలతో ఎలాంటి సంబంధం లేదని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ సమావేశంలో పలువురు నాయకులు ఖండించారు. చాలాకాలంగా బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గత నెల 27న పలువురు ఉపాధ్యాయులు కాంప్లెక్స్ హెచ్‌ఎం దృష్టికి తీసుకొచ్చారని, ఈ విషయాన్ని రాజభాను ట్రెజరీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, రెండు, మూడు సంవత్సరాల నుంచి సప్లమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయం బహిర్గతమైందని అన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్ ఫేక్ చలాన్లు, దొంగ ముద్రలు సృష్టించుకొని స్టేట్ బ్యాంక్, ట్రెజరీలో చలాన్లు కట్టినట్లుగా చూపుతూ మభ్యపెట్టాడని వారు వెల్లడించారు. దొంగ బిల్లుల విషయంపై కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజభాను ట్రెజరీ అధికారికి, డీఈవోకు స్వయంగా ఫిర్యాదు చేశాడని, తనకు డబ్బుల దుర్వినియోగంపై సంబంధం లేదనే విషయాన్ని పై అధికారులకు వెల్లడించి జూనియర్ అసిస్టెంట్‌తో దుర్వినియోగమైన చలాన్లను కట్టించే ప్రయత్నంలో ఉన్నాడని అన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, సుదర్శనం, ప్రతినిధులు చంద్రకళ, కరుణ, మధుసూదనచారి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, అశోక్‌రెడ్డి, మోహన్, శంకర్, కృష్ణాగోపాల్, విష్ణు, నీరజ, శ్రీనివాస్, పద్మ, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోలు తీసి... బెదిరించి..

- అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్



మోహన్

జగిత్యాలక్రైం: ఓ వివాహితను బ్లాక్‌మెయిల్ చేసి అత్యాచారానికి పాల్పడ్డ నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. జగిత్యాల పట్టణంలో నివసిస్తున్న ఓ వివాహితను జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్‌కు చెందిన కోటగిరి మోహన్ జనవరి నెలలో పరిచయం చేసుకున్నాడు. ఆ సమయంలో ఆమె ఎగ్జిబిషన్‌లో పని చేస్తోంది. మాయమాటలు చెప్పి ఆమెకు దగ్గరయ్యాడు. ఆమెతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు మొబైల్‌లో తీసుకున్నాడు. తర్వాత కోరిక తీర్చమని, లేకుంటే ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తూ ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశాడు. ఎవరికీ భయపడనని, పోలీసు, ప్రెస్‌వాళ్లను కూడా బెదిరించానని, నాపై చాలా కేసులున్నాయని, నన్ను ఎవరు ఏం చేయరంటూ బెదిరిస్తూ అత్యాచారం చేస్తూ వచ్చాడు. బెదిరింపులు భరించలేక మహిళ ఫిర్యాదు చేయగా.. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 6 కేసులు, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 5 కేసులు, కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు మొత్తం 12 కేసులున్నాయని పట్టణ సీఐ తెలిపారు.

నిండుకుండలా మే'నూతి'



ముస్తాబాద్(సిరిసిల్ల): రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి బావులు ఎత్తిపోయాయి. అంతటా నీటికరువుతో పంటలు ఎండిపోతుంటే పురాతన బావుల్లో ఇప్పటికీ గంగమ్మ పుష్కలంగా ఉంది. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ శివారులోని పురాతన మేనూతి బావిలో ఇప్పటికీ పుష్కలంగా నీరు ఉంది. తన్నీరు శ్రీనివాస్‌రావుకు చెందిన వ్యవసాయ బావి పదెకరాలకు నిరంతరంగా సాగు నీటిని అందిస్తోంది. ముప్పై ఏళ్ల క్రితం వరకు గ్రామస్తులు ఈ బావిలో నుంచే తాగు నీటిని తీసుకెళ్లేవారు. అంతటా భూగర్భజలాలు అడుగంటిపోగా మేనూతి మాత్రం నిండుకుండలా ఉంది. గతంలో వేసవి వచ్చిందంటే విద్యార్థులు ఈ బావిలోనే ఈత నేర్చుకునేవారు.

శరణు.. శరణు రాజన్నా





వేములవాడ: శివ నామస్మరణతో ఆదివారం ఎములాడ రాజన్న ఆలయం మారుమోగింది. కొందరు భక్తులు కోడె మొక్కును చెల్లించుకోగా.. భక్తులు వరుసలో నిల్చొని రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు సెలవుల రద్దీ పెరిగింది. కొన్ని తరగతులకు పరీక్షలు ముగియడంతో తమ కుటుంబ సభ్యులతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రాజన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడి బట్టలతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.35 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

హరిప్రసాద్‌కు ఉగాది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న హరిప్రసాద్

కరీంనగర్ కల్చరల్: విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానంలో కరీంనగర్‌కు చెందిన బరిబద్దల హరిప్రసాద్‌కు సువర్ణ కంకణ బహూకరణ చేసి సన్మానం చేశారు. జిల్లాలకు చెందిన పలువురు హరిప్రసాద్‌కు అభినందనలు తెలిపారు..

ఉచిత కోచింగ్

కరీంనగర్: అభయ రామన్ సొసైటీ(ఏఆర్ అకాడమీ)ఆధ్వర్యంలో గ్రూప్–2, ఆర్‌ఆర్‌బీ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు నెల రోజుల పాటు అడ్మిషన్ ఫీజుతో క్లాసులు నిర్వహిస్తున్నట్లు ఏఆర్ అకాడమీ డైరెక్టర్ భూపెల్లి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్మిషన్ ఫీజు ఈనెల 12వ తేదీ వరకు రూ.1000లు చెల్లించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8520946155, 9490963155 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

అల్పాహారం అందజేత


అల్పాహారం అందజేస్తున్న నాయకులు

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు జన్మదినం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ తిమ్మాపూర్ మండల సోషల్ మీడియా కన్వీనర్ సదయ్యగౌడ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో యూత్ నాయకులు దరిపల్లి వేణుకుమార్, మస్కురి నరేశ్, బొలుమల్ల రాకేశ్, మంగపట్నం శ్రీరామ్, బీనపల్లి సంపత్, రమేశ్, విష్ణువర్ధన్, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సామగ్రి పంపిణీ



కరీంనగర్: సీఎస్‌ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా మ్యాన్‌కైండ్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కపిల్ బాలకుటీర్‌లోని అనాథ పిల్లలకు, వెంకట్ ఫౌండేషన్‌లోని అనాథ పిల్లలకు పాఠశాల సామగ్రి పంపిణీ చేశారు. స్కూల్‌బ్యాగ్స్, లంచ్‌బాక్స్, వాటర్ బాటిల్స్‌లను వైద్యులు కన్నం దుర్గేశ్, జొన్నల శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు శ్రీనివాస్, గంప వెంకట్, రామ్మోహన్‌రావు, ప్రతాప్, కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ అమ్ముల తిరుమలేశ్, ప్రశాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా 'మర్రి'



వెంకటస్వామి

కరీంనగర్: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఎన్నికయ్యారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల, ప్రజాసంఘాల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సమక్షంలో ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా మర్రి వెంకటస్వామి ఎన్నికవ్వగా, కమిటీ సభ్యులుగా సిద్దిపేట, హన్మకొండ, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, కర్రె భిక్షపతి, గుంటి వేణు, వెన్న సురేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేదారి, మల్లేశ్, శ్రీనివాస్, మణికంఠరెడ్డి, భారత జాతీయ మహిళా సమాఖ్య ఐదు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులైన కిన్నెర మల్లవ్వ, గూడ పద్మ, మంచాల రమాదేవి, అనసూయ, కొక్కుల శాంతవ్వలు ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్‌టౌన్: తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం ఆదివారం భగత్‌నగర్‌లోని సంఘ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏ.రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.అంజయ్య, ఉపాధ్యక్షులుగా నరసింహరెడ్డి, శ్రవణ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా సంపత్ రెడ్డి, నరేందర్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీధర్, నాగేశ్వర్‌రావు, విద్యాసాగర్, సదానందచారీ, శ్రీనివాస్, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


హలీం


చికెన్ హరీస్


చికెన్ బిర్యానీ


పాయా సూప్


ఖుర్బానికా మీఠా


డబుల్కామీఠా

రంజాన్ ఘుమఘుమలు

ముస్లింలు రంజాన్ మాసంలో చేసే కఠిన ఉపవాస దీక్షలో భాగంగా రోజా సాయంత్రం ఇఫ్తార్ తర్వాత బలమైన ఆహారం తీసుకోవడం అనివార్యం. ఈ నేపథ్యంలో వారి ఆహారపు అవసరాల దృష్ట్యా నగరంలో అనేక హలీం కేంద్రాలు వెలిశాయి. హలీంతో పాటు నాన్‌వెజ్‌లో చికెన్, మటన్‌తో చేసిన పలు రకాల వంటకాలు నగర ప్రజల నోరూరిస్తున్నాయి. ముస్లింలతో పాటు ముస్లిమేతర జనం కూడా ఈ రుచులను ఆరగించేందుకు ఎగబడుతున్నారు. దీంతో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు హలీం కేంద్రాలు ప్రజలతో సందడిగా మారుతున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్


చికెన్ కబాబ్స్


విక్రయానికి సిద్ధంగా వంటకాలు


హలీం తింటున్న కుటుంబం


హలీం తయారు చేస్తున్న హోటల్ నిర్వాహకుడు

మతసామరస్యానికి ఇఫ్తార్ ప్రతీక


ఇఫ్తార్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కొత్తపల్లి: మతసామరస్యానికి ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలుస్తాయని కరీంనగర్ పార్లమెంట్ బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంటలో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ, మాజీ కోఆప్షన్ సభ్యుడు జమీల్, వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, నాయకులు పిల్లి మహేశ్, చాంద్ పాషా, నజీమా, సలీం, వాజిద్, రైయిస్, జాంగిర్, అన్వర్, నఫీజా, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

'భీమ్‌యాత్ర'ను విజయవంతం చేయండి

కరీంనగర్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14న కిసాన్‌నగర్ నుంచి కోర్టు చౌరస్తా వరకు నిర్వహించే భీమ్‌యాత్రను జయప్రదం చేయాలని అంబేడ్కర్ యూత్ క్లబ్ ప్రతినిధులు కొమ్మల కరుణాకర్, అసంపల్లి సాయికిరణ్, దాసరి సాయిచరణ్, తాండ్ర రాజేశ్, నవీన్‌లు కోరారు. ఆదివారం భీమ్‌యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే గంగు కమలలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, శేఖర్, కొంకటి శేఖర్‌లు ఆవిష్కరించారు.

ఆరోగ్యవంతమైన నిద్రతో వ్యాధులు దూరం

కరీంనగర్‌టౌన్: ఆరోగ్యవంతమైన నిద్రతోనే ప్రతి మనిషిలో 24 గంటలపాటు పనిచేసే గుండె, బ్రెయిన్ పనితీరు మెరుగుపడుతుందని మెడికవర్ సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ కొండపాక కిరణ్, యూరాలజిస్టు డాక్టర్ రవిశంకర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎస్సారార్ కళాశాల మైదానంలో ఉచిత గుండె, కిడ్నీ, గైనకాలజీ, న్యూరో, ఎముకల, సాధారణ వ్యాధుల వైద్య శిబిరంతో పాటు హెల్త్‌టాక్ నిర్వహించారు. శిబిరాన్ని కార్పొరేటర్ బండ సుమరమణారెడ్డి ప్రారంభించగా, సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గుండె పనితీరు మెరుగుపడాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు మంచి నిద్ర శరీరానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. అలాగే వేసవిలో కిడ్నీలో రాళ్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, దీనంతటికీ నీరు ఎక్కువ తీసుకోకపోవడమే కారణమన్నారు. పలువురు వాకర్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలిపారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, వేణుగోపాల్, ఉపేందర్‌రెడ్డి, రవి మల్లారెడ్డి, మార్కెటింగ్ హెడ్ కరుణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మెడికవర్ ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

రెనె ఆసుపత్రి ఆధ్వర్యంలో..

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రెనె ఆసుపత్రి ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి మేయర్ వై.సునీల్‌రావు, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రమశిక్షణ కలిగిన జీవన విధానం, వ్యాయామం, ఆహారపు అలవాట్లు వ్యక్తిగత ఆరోగ్యానికి ఊతమిస్తాయన్నారు. 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. రెనె ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ బంగారి స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ రవీంద్రాచారి, డాక్టర్ దినకర్, డాక్టర్ యోగేందర్, అరవింద్‌రావు, జనార్దన్‌రెడ్డి, రమేశ్ రెడ్డి, బుర్ర మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.


రెనె హెల్త్ క్యాంపుకు హాజరైన మేయర్ వై.సునీల్‌రావు


అగ్నిగుండాలు దాటుతున్న ఒగ్గు పూజారులు

వైభవంగా మల్లన్న కల్యాణోత్సవం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో ఆదివారం మల్లన్న కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి పుట్ట బంగారం తీసుకొచ్చే కార్యక్రమాన్ని నిర్వహించగా ఆదివారం మహిళలు మల్లన్నకు బోనాలు చేసి నైవేద్యం సమర్పించారు. ఒగ్గుపూజారులు ప్రత్యేక పూజలు చేసి చేపట్టిన అగ్నిగుండాల ప్రవేశ కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం పెద్దపట్నం వేసి కేతమ్మ–మల్లిఖార్జునస్వామి కల్యాణాన్ని వైభవంగా జరిపించి ఒగ్గు కళాకారులు మల్లన్న కథను ప్రదర్శించారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఎంపీటీసీలు డి.పుష్ప అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ జె. నర్సయ్య, ఉప సర్పంచ్ కె. తిరుపతియాదవ్, దుర్శేడ్ సింగిల్ విండో డైరెక్టర్లు డి.లచ్చయ్య, కె.రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మల్లన్నకు వేసిన పెద్దపట్నం


తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎంపీ బండి సంజయ్

మన సంస్కృతిని చదువుతో మేళవించాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): మన సంస్కృతిని చదువులతో మేళవించాలని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం సప్తగిరికాలనీలోని సప్తగిరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞా భారతి చైర్మన్ రాజభాస్కర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ మందల నగేశ్ రెడ్డి, ప్రిన్సిపల్ అనితారెడ్డి, డైరెక్టర్ విపుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆటలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి


చెస్ ఆడుతున్న విద్యార్థులు

కరీంనగర్: ఆటలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ అన్నారు. హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, గాయత్రినగర్‌లోని కపిల్ బాలకుటీర్‌లో ఉంటూ సరస్వతీ శిశు మందిర్‌లో చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చెస్ ఆడించడం జరిగిందన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఉగాది రోజున ఫైనల్స్ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకుటీర్ ఇన్‌చార్జి వకుల, మేనేజర్ శ్రీనివాస్, చెస్ కోచ్ కనకయ్య, శ్రీముఖి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్ర కథ



కంప్యూటర్లు నిరుపయోగం

గ్రామపంచాయతీలకు సాంకేతిక సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 2017లో టీ ఫైబర్ ఇంటర్నెట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. రెండేళ్ల క్రితం ప్రతీ గ్రామపంచాయతీకి కంప్యూటర్లు, ఇంటర్నెట్ పరికరాలు, విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ ప్లేట్లను పంపిణీ చేశారు. అయితే ఇంతవరకు ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో కంపూటర్లు నిరుపయోగంగా మారాయి. కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామపంచాయతీలో కంప్యూటర్లపై సిబ్బంది బట్టను కప్పి మూలన పడేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. - కరీంనగర్‌రూరల్

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

కరీంనగర్‌టౌన్: నగరంలోని 6వ డివిజన్ బొమ్మకల్ చౌరస్తాలో రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ నగర ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం మున్సిపల్ కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ట్రాక్టర్లు నిత్యం ఇసుక లోడులతో పరిమితికి మించి వేగంగా వెళ్తున్నాయని, పిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. అలాగే బైకులు, ఫోర్ వీలర్లు నియంత్రణ లేని వేగంతో జనవాసాల మీదుగా వెళ్లడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఈవిషయమై రెండుసార్లు కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా, త్రీటౌన్ పోలీసులకు, ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వెంటనే స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అహ్మద్ సిద్దిఖీ


నియామక పత్రం అందజేస్తున్న తాజొద్దిన్

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఇక్రమ్ అహ్మద్ సిద్దిఖీ నియమితులయ్యారు. ఈమేరకు మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. తాజొద్దిన్ ఆదివారం నగరంలోని 54వ డివిజన్ కాశ్మీర్‌గడ్డ పార్టీ కార్యాలయంలో నియామక పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి నేహాల్ అహ్మద్, వైస్ చైర్మన్ మహ్మద్ ఖలీం, సిటీ వైస్ చైర్మన్ మహ్మద్ రజియుద్దిన్, సయ్యద్ కరీం పాల్గొన్నారు.

గుమ్లాపూర్ గ్రామ రెడ్డి సంఘం కార్యవర్గం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామం రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కొన్న తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రఘుపతిరెడ్డి, సహాయ కార్యదర్శిగా రాజేందర్‌రెడ్డి, కోశాధికారిగా హన్మంతరెడ్డి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బాపురెడ్డి, జగన్ రెడ్డిలు నియామకమయ్యారు.

ఎస్‌ఎఫ్‌ఐ కార్యవర్గం ఎన్నిక


అరవింద్

కరీంనగర్: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) కరీంనగర్ జిల్లా 17వ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరం రజనీకాంత్ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా కాంపెల్లి అరవింద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గజ్జెల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులుగా పూజ ,రోహిత్, శ్రీజ ,వినయ్, అభిలాష్. సహాయ కార్యదర్శులుగా ఇషాక్, బోగేష్ ,శ్రీజతో పాటు ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నామని అన్నారు.

భాగ్యనగర్ రెడ్డి సంక్షేమ సంఘం..

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని భాగ్యనగర్‌లో ఆదివారం నూతనంగా భాగ్యనగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకుని ఆ సంఘానికి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాకాల వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి. కార్యదర్శిగా నర్ర నరోత్తంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బారాజు మోహన్‌రెడ్డి, కోశాధికారిగా పిన్నింటి నారాయణరెడ్డి, సలహాదారులుగా దాసరి తిరుపతిరెడ్డి, నంది రాజిరెడ్డి, కొంగల రాజిరెడ్డి, ఆర్‌ఎస్‌పీ రెడ్డి, గోలి సత్యనారాయణరెడ్డి, దామెర రాజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆకారపు శ్రీనివాసరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ నరేందర్ రెడ్డిని నూతన కమిటీ సన్మానించింది.


చెర్లభూత్కూర్‌లో బోనాలతో మహిళల ఊరేగింపు


తీగలగుట్టపల్లిలో..


నగునూరులో..


22వ డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో..

పోచమ్మ బోనాలు

కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలతో సందడిగా మారింది. చెర్లభూత్కూర్‌లో రెడ్డి సంఘం, చామనపల్లిలో కురుమ సంఘం, నగునూరులో మాల సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు చేశారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించారు. తీగలగుట్టపల్లిలో నిర్వహించిన బోనాల వేడుకల్లో ఎంపీ బండి సంజయ్‌కుమార్ పాల్గొని పోచమ్మకు పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పి.శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కూర నరేశ్‌రెడ్డి, నల్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గాండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. -కరీంనగర్/కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా...

ఆ డబ్బులు మావే ఇచ్చేయండి

- రూ.51,99,800 నగదుతోపాటు చెక్కులు కూడా ఇవ్వండి
- రామోజీరావుకి చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ లొల్లి

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.51,99,800 నగదుతోపాటు రూ.36,88,675 విలువైన 51 చెక్కులను స్వాధీనం చేసుకున్న వ్యవహారంలో పచ్చ పత్రికాధినేత రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ డ్రామాలకు తెరలేపింది. ఆ నగదుతోపాటు చెక్కులు కూడా తమవేనని చెబుతున్న మార్గదర్శి ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపమంటే చూపడం లేదు. దీంతో ఈ సొమ్ము మార్గదర్శిది కాదని.. టీడీపీ నేతలు ఓట్ల కొనుగోలుకు తరలిస్తున్న నగదని అంతా చెబుతున్నారు. ఇప్పటికే ఈ నగదుకు సంబంధించి కేసు కూడా నమోదైంది. అంతేకాకుండా ఈ వ్యవహారం ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్లిపోయింది. ఆధారాలు చూపించి నగదును తీసుకునే అవకాశం ఉన్నా ఆ పనిచేయకుండా జిల్లా ఎన్నికల యంత్రాంగం చుట్టూ మార్గదర్శి సిబ్బంది తిరగడం చర్చనీయాంశంగా మారింది.

మళ్లీ జగనే సీఎం కావాలని...

- భద్రాచలం రామాలయానికి అభిమానుల పాదయాత్ర



బూర్గంపాడు: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ఆయన అభిమానులు పాదయాత్ర చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామం నుంచి భద్రాచలం రామాలయానికి ఆదివారం పాదయాత్రగా వెళ్లారు. మొదట రెడ్డిపాలెం రామాలయంలో, ఆ తర్వాత భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా వందలాది మంది అభిమానులు పాదయాత్రగా వెళ్లి భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. ఐదేళ్లుగా అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ఆయనకు శ్రీరామరక్షగా నిలుస్తాయని వారు అన్నారు.

బాబును నమ్మితే పులికి బలే

ప్రజలకు మంచి జరుగుతుంటే చూడలేని శాడిస్టు.. కొనకనమిట్ల 'మేమంతా సిద్ధం' సభలో ఏపీ సీఎం జగన్



టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల 2014 మేనిఫెస్టో చూపిస్తూ.. వారి మోసపూరిత హామీలను వివరిస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ''ప్రకాశం జిల్లా పొదిలిలో ఈరోజు ఇసుక వేసినా రాలనంతగా జనసముద్రం, ప్రజా కెరటం కనిపిస్తోంది. మంచి చేసిన మన ప్రభుత్వానికి మద్దతుగా, ఆ మంచిని కొనసాగించేందుకు చేయీ చేయీ కలిపి చేస్తున్న నినాదమే సిద్ధం.. సిద్ధం! ప్రజల అజెండాతో మనం, జెండాలు జతకట్టి వారు తలపడుతున్న ఈ ఎన్నికల్లో పేదల వ్యతిరేకులను ఓడించి ఇంటింటా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు మీరంతా సిద్ధమేనా?'' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. 10వ రోజు బస్సు యాత్ర సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొనకనమిట్ల జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన ''మేమంతా సిద్ధం'' బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. ఎండ నిప్పులు చెరుగుతున్నా భారీ ఎత్తున తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి సీఎం మాట్లాడారు. 'ప్రజల రాజ్యాన్ని, అవ్వాతాతల సంక్షేమ రాజ్యాన్ని, రైతు రాజ్యాన్ని, మహిళా పక్షపాత రాజ్యాన్ని, పిల్లల అభివృద్ధి రాజ్యాన్ని ధ్వంసం చేసేందుకు వస్తున్న మూడు పార్టీల కూటమిని అడ్డుకునేందుకు మీరంతా సిద్ధమేనా? ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు జరుగుతున్నవి కాదు. గత ఐదేళ్లుగా బాగుపడ్డ మీ పిల్లలు బడులు, చదువులు, అక్కచెల్లెమ్మల సాధికారత, అవ్వాతాతల సంక్షేమం, రైతుకు అందుతున్న భరోసా, సామాజిక న్యాయం.. ఇవన్నీ కొనసాగి మరో రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మోసపోయి వెనక్కు వెళ్లాలా? అన్నది నిర్ణయించే ఎన్నికలు ఇవి. ఈ ఎన్నికలు మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి. రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మళ్లీ మోసపోయి వెనక్కు వెళ్లాలా? అనే అంశాన్ని నిర్ణయించే ఎన్నికలు అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామా?

మన జెండా తలెత్తుకుని రెపరెపలాడుతుంటే.. వారి జెండా మరో నాలుగు జెండాలతో జత కట్టినా కూడా ఎగరలేక కింద పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చంద్రబాబు, కూటమి చరిత్ర ఏమిటి? 2014లో ఏం చెప్పారో ఒక్కసారి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామా? ముఖ్యమైన హామీలు ఒక్కసారి చూద్దాం. రూ.87,612 కోట్ల రైతుల రుణమాఫీ చేశాడా? రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలు ఒక్క రూపాయి అయినా చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేశారా? ఇంటింటికీ ఒక ఉద్యోగం లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. 60 నెలల్లో నెలకు రూ.2 వేల చొప్పున రూ.1.20 లక్షలు మీ ఇంటికి వచ్చాయా? పేదలకు 3 సెంట్ల స్థలం కథ దేవుడెరుగు ఒక్క సెంటు స్థలమైనా, కనీసం ఒక్కరికైనా ఇచ్చాడా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాల మాఫీ.. అయ్యాయా? మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా? రాష్ట్రాన్ని సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు చేశాడా? ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మీ పొదిలిలో ఏమన్నా హైటెక్ సిటీ కనిపిస్తోందా? మార్కాపురంలో అయినా కనిపిస్తోందా? పోనీ ఒంగోలులో కనిపిస్తోందా? పోనీ ప్రత్యేక హోదా ఇచ్చారా? ఇదే చంద్రబాబు మరోసారి కూటమి కట్టి మళ్లీ వస్తున్నాడు. చంద్రబాబును నమ్మడం అంటే పులి నోట్లో తలకాయ పెట్టడమే. ఇలాంటి మోసగాళ్ల బారి నుంచి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు మీరంతా సిద్ధమేనా? సెల్ ఫోన్ టార్చ్ లైట్ వెలిగించి సిద్ధమే అని గట్టిగా నినదించండి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అడవి తల్లిని వీడం.. బయటకెళ్లి బతకలేం

▶ మొదటి పేజీ తరువాయి

బలవంతంగా అడవి బయటకు తరలించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

ఎన్టీసీఏ ద్వారా పునరావాస ప్యాకేజీ.. అయినా చెంచులు విముఖం

అడవి లోపల నివసిస్తున్న వారిని బయటకు తరలిస్తే ఒక్కో కుటుంబానికి ఎన్టీసీఏ ద్వారా రూ.15 లక్షల పునరావాస ప్యాకేజీ అందించనుంది. వీరి పునరావాసం కోసం నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెద్ద కొత్తపల్లి మండలం బాచారం వద్ద అటవీశాఖకు చెందిన స్థలాన్ని కేటాయించారు. రూ.15 లక్షల ప్యాకేజీ వద్దనుకుంటే బాచారం వద్ద 220 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం, జీవనోపాధి కోసం 5 ఎకరాల వ్యవసాయ భూమిని అందజేస్తారు. సార్లపల్లిలో 269 కుటుంబాలు ఉండగా, వీరిలో 83 కుటుంబాలు మాత్రమే చెంచులు కాగా, మిగతా వారిలో ఇతర వర్గాల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఎన్టీసీఏ ప్యాకేజీకి ఇప్పటి వరకు 186 కుటుంబాలు అంగీకరించగా, వీరిలో చెంచు కుటుంబాలు ఆరు మాత్రమే ఉన్నాయి. అడవి నుంచి బయటకు తరలింపునకు మెజార్టీ శాతం చెంచు కుటుంబాలు విముఖత వ్యక్తం చేస్తున్నాయి.

కనీస సౌకర్యాలు లేకున్నా..

నల్లమల అటవీప్రాంతంలో మొత్తం 88 ఆవాసాల్లో చెంచులు నివసిస్తున్నారు. వీటిలో 20 ఆవాసాలు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాలో ఉన్నాయి. అడవిలో అటవీ శాఖ ఆంక్షల నేపథ్యంలో ఇక్కడి చెంచులు కనీస మౌలిక సదుపాయాలకు సైతం నోచుకోవడం లేదు. టైగర్ రిజర్వ్ ప్రాంతం కావడంతో పులులు, వన్యప్రాణుల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. అడవిలో ఉన్న అప్పాపూర్ గ్రామ పంచాయతీ మినహా మరెక్కడా చెంచుపెంటల్లో కనీసం అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, వైద్యశాల లేవు. తాగునీటికి సైతం ఎలాంటి సురక్షిత మంచినీటి వ్యవస్థ అందుబాటులో ఉండదు. స్థానికంగా సోలార్ బోరు ద్వారా వచ్చే నీటితో పాటు కుంటలు, చెలిమెల నీటినే చెంచులు నిత్యం తాగేందుకు వినియోగిస్తున్నారు.



మల్లాపూర్ పెంటలోని చెంచుల ఆవాసాలు

మేం అడవిలోనే ఉంటాం.. బయటకు పోలేం



ఏళ్లుగా తాతల కాలం నుంచి అడవినే నమ్ముకుని బతుకుతున్నాం. మేం బయటకు పోయి జీవించలేం. మా వల్ల వన్యప్రాణులు, పులులకు ఎలాంటి హాని లేదు. ఇప్పుడు కూడా ఉండదు. దయచేసి మమ్మల్ని అడవి నుంచి విడదీయద్దు. మేమంతా అడవిలోనే ఉంటాం.

–చిగుర్ల లింగమ్మ, చెంచు మహిళ, సార్లపల్లి, అమ్రాబాద్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

మమ్మల్ని ఆగం చేయొద్దు..



అడవిలో జీవిస్తూ ప్రశాంతంగా ఉన్న మమ్మల్ని ఆగం చేయద్దు. మా వాళ్లు బయటి ప్రపంచంలో బతకలేరు. బాచారం లాంటి మైదాన ప్రాంతాలకు తరలిస్తే అక్కడ ఏజెన్సీ నియమాలు, హక్కులు వర్తించవు. మైదాన ప్రాంతాల్లో ఉన్న చెంచులు మాకంటే దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. అడవి నుంచి బయటకు పంపితే చెంచుల ఉనికికే ప్రమాదం ఉంది.

– కుడుముల మల్లేశ్, చెంచు యువకుడు, సార్లపల్లి గ్రామం

స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే తరలింపు



టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో అమూల్యమైన వన్యప్రాణుల సంరక్షణ కోసం, వాటికి ముప్పును నివారించేందుకే స్థానికులకు మరోచోట పునరావాసం కల్పిస్తున్నాం. అడవిలో వారికి ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు సాధ్యం కాదు. పునరావాస కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తాం. రీలొకేషన్‌లో ఎలాంటి ఒత్తిడి లేదు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారినే తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– రోహిత్ గోపిడి, డీఎఫ్ఓ,నాగర్‌కర్నూల్ జిల్లా

రాష్ట్రం సరఫరా చేసిన బియ్యంలో ఖాప్రా పురుగు

- పలువురు సిబ్బందిపై ఎఫ్‌సీఐ వేటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి ఎఫ్‌సీఐకి సరఫరా అయిన బియ్యంలో ఖాప్రా అనే పురుగు ఉన్నట్లు తేలింది. ఈ మేరకు చెన్నైలోని ఎఫ్‌సీఐ జోనల్ కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన సంస్థ.. తెలంగాణకు చెందిన ఆరుగురు ఎఫ్‌సీఐ మేనేజర్లు, 14 మంది టెక్నికల్ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేసింది. తెలంగాణ నుంచి తమిళనాడు, కేరళ, కర్ణాటకలోని పలు ప్రాంతాలకు కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద పంపిన బియ్యం వ్యాగన్లకుగాను కొన్నింటిలో ఖాప్రా పురుగు ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో బాధ్యులపై ఎఫ్‌సీఐ ఈ మేరకు చర్యలు చేపట్టింది.

బాధ్యులందరికీ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

నియమిస్తూ గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బీఆర్‌కేఆర్ భవన్‌లోని 7వ అంతస్తులో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీకి కేటాయించిన కార్యాలయంలో ఆదివారం జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి న్యాయవిచారణ ప్రక్రియ ప్రారంభించి ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీ ఎస్ఏఎం.రిజ్వీ, ఇతర అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గడువు మేరకు 100 రోజుల్లోగా నివేదిక సమర్పిస్తామన్నారు. నాటి నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులే ఇంకా విద్యుత్ సంస్థల డైరెక్టర్లుగా కొనసాగుతూ న్యాయ విచారణలో కమిషన్‌కు సహకరిస్తున్నారని, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ఫైళ్లు తారుమారు చేసినట్టు ఆరోపణలూ వచ్చాయని విలేకరులు జస్టిస్ నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, మూడు ఒప్పందాలకు సంబంధించిన అన్ని ఫైళ్లు తమ కార్యాలయానికి చేరాయని ఆయన బదులిచ్చారు. వాటి ప్రాథమిక పరిశీలన కూడా పూర్తయిందన్నారు. అవసరమైతే ఇంకా ఫైళ్లు అడుగుతామని చెప్పారు. కాంపిటీటివ్ బిడ్డింగ్‌కి బదులుగా నామినేషన్లు, లిమిటెడ్ టెండర్ల పేరుతో రూ.వందల కోట్ల సివిల్ పనులు కాంట్రాక్టర్లకు అప్పగించిన అంశంతోపాటు యాదాద్రి విద్యుత్ కేంద్రం భూసేకరణలో అవకతవకతలపై సైతం విచారణ నిర్వహిస్తారా? అని విలేకరులు ప్రస్తావించగా ఆయన సమాధానం దాటవేశారు.

మధుర ఫలం.. మస్తు పిరం!

- కిలో రూ.200లకు పైనే..
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం



చెన్నూర్ మార్కెట్‌లో విక్రయిస్తున్న మామిడి

చెన్నూర్: పండ్లలోనే రారాజుగా పిలిచే మధుర ఫలం(మామిడి) ధరలు మండుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో మామిడి ధర రూ.150 నుంచి రూ.200 పలుకుతోంది. మామిడి పండ్ల ధరలే ఇలా ఉంటే పచ్చడి కాయ ధరలు ఆకాశాన్నంటే అవకాశం ఉంది. ఈ ఏడాది వాతావరణ మార్పుల కారణంగా మామిడి కాత నిరాశజనకంగా ఉంది. జిల్లాలో 18,170 ఎకరాలలో మామిడి తోటలు విస్తరించి ఉండగా కాత అంతంత మాత్రంగానే ఉంది. దీంతో రానున్న రోజుల్లో మామిడి పండ్లు, పచ్చడి కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఉగాది తర్వాత పచ్చళ్లు..

మామిడి పచ్చళ్లను ఉగాది పండగ తర్వత పెట్టుకోవడం అనవాయితీగా వస్తుంది. ఉగాది తర్వాత పెట్టుకునే పచ్చళ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయని నమ్మకం. దీంతో పండుగ తర్వాత ధరలు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

ఎగుమతి అంతంతే..

జిల్లాలోని మామిడికి వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. జిల్లా నుంచి ఏటా సుమారు పది వేల టన్నులకుపైగా మామిడి ఎగుమతి అవుతుంది. ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉండడంతో ఎగుమతి అంతంత మాత్రంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కాయ తక్కువ కాయడంతో ఇక్కడే ధరలు ఎక్కువగా ఉండడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లి అమ్ముకునే భారం తప్పిందని రైతులు చెబుతున్నారు.

మస్కాపూర్ కేజీబీవీ విద్యార్థినికి అస్వస్థత



నిర్మల్‌లో విద్యార్థినిని పరామర్శిస్తున్న నవీన్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతున్న గుండేటి మౌనిక స్వల్ప అస్వస్థతకు గురైంది. షుగర్ లెవెల్స్ దాటడంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. దీంతో తల్లిదండ్రులు ఆమెను నిర్మల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మౌనికను ఈ నెల 5న ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు రాగా కేజీబీవీ సిబ్బంది అనుమతించలేదు. ఆమె అనారోగ్యంగా ఉండడంతో పెంబి మండలం రాయదారి గ్రామంలోని తమ ఇంటికి తీసుకెళ్లారు. శనివారం అంబులెన్స్‌లో తీసుకువెళ్లి నిర్మల్ ఆస్పత్రిలో చేర్పించారు. తమ కూతురు అనారోగ్యానికి గురైనా కేజీబీవీ సిబ్బంది పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నవీన్, విద్యార్థిని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని నవీన్ పరామర్శించారు.

పులిదాడిలో లేగదూడ హతం

- బెజ్జూర్ రేంజ్‌లో పెద్దపులి కదలికలు

బెజ్జూర్(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ రేంజ్‌లో పెద్దపులి ఓ లేగదూడను హతమార్చింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన గుర్లె శంకర్ అనే రైతు లేగదూడ శనివారం ఉదయం సిద్దాపూర్ అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో వెతకగా.. అటవీ ప్రాంతంలో ఆదివారం కళేబరం కనిపించింది. చిన్నసిద్దాపూర్ బీట్ అధికారి వెంకటేశ్ ఘటనా స్థలాన్ని సందర్శించి, రేంజ్ పరిధిలో పులి కదలికలు ఉన్నట్లు నిర్ధారించారు. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని నివేదిస్తామని తెలిపారు. ఆర్థిక సాయం అందించాలని బాధిత రైతు ఎఫ్ఆర్‌వో దయాకర్ దరఖాస్తు చేసుకోగా.. తక్షణ సాయం కింద రూ.5వేలు అందించారు.



లేగదూడ కళేబరం వద్ద రైతు

పెండింగ్ వేతనాలు ఇప్పించండి

- గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న గెస్టు లెక్చరర్లు

మంచిర్యాలటౌన్: డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్టు లెక్చరర్ల పెండింగ్ వేతనాలను ఇప్పించి తమను ఆటో రెన్యువల్ చేయాలని తెలంగాణ స్టేట్ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు డి.రమాదేవి కోరారు. ఈమేరకు మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు మంచిర్యాలలో ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గెస్టు లెక్చరర్లు రాంచందర్, విలాస్, మాధవి కృష్ణ, ప్రశాంత్, మల్లేశం, రమేశ్, శ్రీనివాస్, మారుతి, రమ్య పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం



శ్రీధర్‌ని సన్మానిస్తున్న సభ్యులు.

నస్పూర్: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని నస్పూర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెంచాల శ్రీధర్, కార్యదర్శిగా తూండ్ల శ్రీనివాస్, కోశాధికారిగా తూర్పాటి వెంకటేశ్, పలువురిని సభ్యులుగా ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఎన్నికల అబ్జర్వర్లుగా అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విష్ణువర్ధన్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సభ్యుడు మారయ్య, జిల్లా అథ్లెటిక్ కార్యదర్శి, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాంచందర్ వ్యవహరించారు. కార్యక్రమంలో గడ్డం సాయికుమార్, శీలం సాయికుమార్, నరేశ్, ప్రేంసాయి, కౌశిక్, మహేశ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల డేగకళ్లు
- జిల్లాలో రూ.36లక్షల నగదు, మద్యం పట్టివేత



చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికలపై పోలీసుశాఖ డేగకన్ను వేసింది. సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్‌బాస్ పర్యటించడంతోపాటు అంతర్‌రాష్ట్ర పోలీసు అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఓటర్లు స్వేచ్ఛ, ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. నగదు, మద్యం, విలువైన వస్తువుల ప్రవాహంపై నిరంతర తనిఖీ చేస్తున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా నగదు అక్రమంగా తరలిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అంతర్ జిల్లాలతో పాటు అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ వీటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈక్రమంలో రూ.5.61లక్షల విలువైన మద్యం, రూ.29.02లక్షల నగదు, రూ.1.86లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ప్రధానంగా నియోజకవర్గాలు, జిల్లాలు, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా తీవ్రతరం చేశారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు ఆధారాలు లేకుండా తరలిస్తే పట్టుకుని స్వాధీనం చేసుకుని జప్తు చేస్తున్నారు. అలాగే ఆధారాలు లేకుండా తరలిస్తున్న 32గోడగడియాలను చెన్నూర్ నియోజకవర్గంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో నిఘా

రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసుశాఖ.. నిఘా తీవ్రతరం చేసింది. చెక్‌పోస్టుల నుంచి వచ్చివెళ్లే వాహనాలను నంబర్లను నమోదు చేయడంతోపాటు కారులో తనిఖీలు చేసి వీడియో రికార్డింగ్ చేస్తున్నారు. అనుమానాస్పద వాహనాలను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో తనిఖీ చేస్తున్నారు.

11 చెక్‌పోస్టుల ఏర్పాటు

పోలీస్ కమిషరేట్ పరిధిలో 11 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇందన్‌పల్లి ఫారెస్ట్, తాండూర్ ఐబీ, జన్నారం కలమడుగు బ్రిడ్జి, ఇందారం ఫారెస్ట్ చెక్‌పోస్టులను మంచిర్యాల జిల్లాలో ఏర్పాటు చేశారు. గోదావరిఖని గోదావరి బ్రిడ్జి, దుబ్బపల్లి, గుంపుల మానేర్ బ్రిడ్జి, ఎగ్లాస్‌పూర్ ఫారెస్ట్, ఎల్లంపల్లి, వేంనూర్‌లో చెక్‌పోస్టులను పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేశారు. ఇక్కడ పోలీసులు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు.

రామగుండం కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం విలువ(రూ.లలో)

నియోజకవర్గం	మద్యం	నగదు	గంజాయి
చెన్నూర్	1,58,143	1,82,500	80,000
బెల్లంపల్లి	1,48,038	21,24,920	28,750
మంచిర్యాల	82,310	1,53,800	-
ఖానాపూర్	1,05,900	-	-
ధర్మపురి	11,554	2,80,000	-
రామగుండం	87,141	31,650	-
మంథని	23,276	46,500	-
పెద్దపల్లి	91,175	55,500	-

నిఘా పటిష్టం

సరిహద్దు చెక్‌పోస్టుల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. నిరంతర తనిఖీలు చేస్తున్నాం. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు తరలిస్తే తగిన ఆధారాలు చూపాలి. నగదు, మద్యం, మత్తు పదార్థాల రవాణాపై డేగకన్నువేశాం. ఇప్పటివరకు రూ.36.59 లక్షల విలువైన నగదు, మద్యం, గంజాయి స్వాధీనం చేసుకున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి పనిచేయాలి.

– శ్రీనివాస్, సీపీ, రామగుండం





వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: మాసశివరాత్రిని పురస్కరించుకుని వేములవాడ రాజన్న ఆలయంలో ఆదివారం రాత్రి మహాలింగార్చన వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చన పూజలు చేశారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం మట్టితో చేసిన 366 మృత్తికలు, పిండితో చేసిన 366 జ్యోతులను లింగాకారంలో ఏర్పాటు చేసి అభిషేకం నిర్వహించారు.

మంచిమాట



తానెంతో జగమంత

ప్రతిమనిషి, సరిగా చెప్పాలంటే ప్రతి జీవి ప్రపంచం అంతా తన వంటిదనే అనుకుంటుంది. తన దృష్టికోణంలోనే చూస్తుంది. అందుకే అబద్ధాలాడేవారికి అందరూ అబద్ధాలు చెపుతారనే అభిప్రాయమే ఉంటుంది. ఎవరి మాటనీ ఒక పట్టాన నమ్మరు. తాను అబద్ధం చెప్పినప్పుడు ఎదుటివారు అబద్ధం చెపుతున్నారేమో అనే అనుమానం ఎందుకు వస్తుంది? పైగా తను చెప్పేది నిజం అని నమ్మమని ఒకటికి పదిసార్లు నొక్కి వక్కాణిస్తూ ఉంటారు. అవతలి వారు నమ్మరేమోననే సందేహం ఎందుకు వస్తుంది? తాను చెప్పే మాట మీద తనకే నమ్మకం లేదు కనుక.

ఇతరులని మోసం చేసే గుణం ఉన్నవారు ఇతరులు తమని మోసం చేస్తారేమో నని భయపడుతూనే ఉంటారు. మోసం చేసే బుద్ధి తనకి లేక పోతే ఎదుటి వారు తనని మోసం చేస్తారేమో ననే అనుమానం కూడా రాదు. పరాయి ఆడపిల్లలని చెడుదృష్టితో చూసేవారు తమ ఇంటి ఆడవారిని బయటకు పంపటానికి ఇష్టపడరు. దీనికి పెద్ద ఉదాహరణ రావణుడే. కనపడిన ప్రతి స్త్రీని కామదృష్టితో చూసి, చేజిక్కించుకోవాలనుకునే గుణం ఉన్నవాడు కనుకనే తన భార్యలని కట్టడిలో ఉంచాడు. మేలిముసుగు లేకుండా వారిని బయటికి రానిచ్చేవాడు కాదు. ఆ విషయాన్ని రావణ వధానంతరం యుద్ధభూమిలో పడి ఉన్న రావణుణ్ణి చూసి మండోదరి ''మేలిముసుగు లేకుండా నీ భార్యల మైన మేము ఇక్కడికి వస్తే ఏమి అనటం లేదేమి?'' అని ప్రశ్నించటంలో తెలుస్తుంది. అదే రావణుడు తన చెల్లెలు శూర్పణఖ విషయంలో అవేవీ పాటించ నక్కర లేదని చెప్పి స్వేచ్ఛగా వదిలేశాడు. రాక్షసవంశంలోనే పుట్టిన ప్రహ్లాదుణ్ణి ''కన్నుదోయి కన్యకాంత లడ్డం బైన మాతృభావము చేసి మరలువాడు'' అని పోతనామాత్యుల వారు వర్ణించారు. స్త్రీల పట్ల సద్భావం కలవాడు కనుక తన తల్లిని, ఇతర స్త్రీలని కూడా గౌరవభావంతో చూడటం తటస్థించింది.



జంతువులన్నీ ఇతర జంతువులు, ముఖ్యంగా మనుషుల మీద దాడి చేయటానికి కారణం వాటికి ఉన్న అభద్రతా భావం. అవి ఎదుటి జంతువులని తినటమో, బాధించటమో చేస్తాయి కనుక ఎదుటి జంతువులు కూడా తమని బాధిస్తాయేమోనని ఎదురు దాడి చేస్తాయి. నాగుపాముని చూస్తే ఈ విషయం బాగా అర్థమౌతుంది. మంచి జాతి సర్పం ఎదురు పడగానే మనిషి భయపడితే అది కూడా భయ పడుతుంది. దాని వంక ప్రేమగా, లేక భక్తితో చూస్తే అది కూడా అదే భావంతో చూసి తొలగిపోతుంది. అందుకే త్రాచు పాము కనపడగానే చేతులు జోడించి నమస్కారం చేసి కదల కుండా ఉండమని చెపుతారు. తేలుకి ఎదుటి ప్రాణి తనని బాధిస్తుందనే సందేహం ఉంటుంది కనుక ఏది అడ్డు తగిలితే దానిని కుట్టుకుంటూ పోతుంది. ఇటువంటి లక్షణాలే మనుషులలో కూడా కనిపిస్తాయి. అకారణంగా ఇతరులని బాధించేవారు, భయం వల్లనే బాధిస్తారు. పచ్చకామెర్ల రోగికి లోకం అంతా పచ్చగా కనిపిస్తుంది కదా!

అదేవిధంగా ''ఆత్మవత్ సర్వభూతాని'' అని భావించి ఎదుటివారి కష్టం తనది భావించి తదనుగుణంగా స్పందించేవారు, ఎవరికి మేలు కలిగినా తమకే కలిగి నంతగా సంతోషించేవారు ఉన్నారు. ఎవరికి ఆపద కలిగినా వీరి కళ్ళలో నీళ్ళు వస్తాయి. ఎవరికి మంచి జరిగినా వీరు పండగ చేసుకుంటారు. అంటే, ఈ కోవకి చెందిన వారు జంతు ప్రవృత్తి నుండి కొంత ఎదిగినట్లు చెప్పవచ్చు.

ఈ విధంగా ఉండి అందరు తన లాగానే ఉంటారు అనుకోవటం వల్ల లౌకికంగా నష్టపోయిన వారూ ఉన్నారు. కాని, మానవతా దృక్పథంలో వారు ఉన్నత స్థానానికి చేరుకున్నారని అర్థం. ప్రతిస్పందన కన్న సహానుభూతి ఉత్తమ స్థాయి.

– ఎన్. అనంతలక్ష్మి

తాత్త్వికథ

చెట్టునీడ



ఒకరోజు జ్ఞాని దగ్గరకు కోటీశ్వరుడు వెళ్లి స్వామి నా దగ్గర కోటానుకోట్ల డబ్బు ఉన్నది. పూర్తి ఆరోగ్యవంతుడిని. ఇక నేను ఎవరిపైనా ఆధారపడవల్సిన అవసరం లేదు. ఎవరినీ సహాయం చేయమని అర్థించాల్సిన అవసరం లేదని చాలా గొప్పగా చెప్పుకున్నాడు.

ఆ మాటలు విన్నాక జ్ఞాని నవ్వుతూ ''బాబు నాతో కాస్త దూరం నడవగలవా''

అని అడిగాడు. అయన ఆలా అడగడంతో నిరాకరించడం బాగుండదని తలచిన ఆ వ్యక్తి జ్ఞానితో కలిసి అడుగులు వేశాడు.

అలా నడుస్తూ నడుస్తూ అలసిపోయిన వ్యక్తి దరిదాపులలో ఏదైనా చెట్టు కనిపిస్తుందేమో... ఆ చెట్టు నీడలో కాసేపు సేద తీరాలని చుట్టూ చూసాడు. ఎక్కడా ఏ చెట్టూ కనిపించలేదు.

ఇది గమనించిన జ్ఞాని ''ఏంటి బాబూ... వెతుకుతున్నావు?'' అని అడిగాడు.

''అయ్యా చాల దూరం వచ్చాము. కాసేపు చెట్టునీడలోకి వెళ్లి సేదతీర్చుకుని ఆ తర్వాత తిరిగి ముందుకు సాగుదాం''అని చెప్పాడు.

అతడి మాటలకు ఆ జ్ఞాని ''చెట్టునీడ నీకెందుకు బాబూ... నీ నీడలో నువ్వు సేద తీర్చుకో'' అన్నాడు.

''నా నీడలో నేను ఎలా ఉండగలను స్వామీ! ఏం మాట్లాడుతున్నారు మీరు?'' అని కాస్తంత ఆశ్చర్యంగా మరి కాస్త నిష్ఠురంగానూ అడిగాడు ఆ వ్యక్తి.

అందుకు ఆ జ్ఞాని, చిరునవ్వుతో అతడి వైపు చూస్తూ... అదేంటి, నీ నీడలో నువ్వు తల దాచుకోలేవా? నువ్వే కదా బాబూ, నాదగ్గర అన్నీ ఉన్నాయి. నేను ఎవరిని ఆశ్రయించాల్సిన అవసరం లేదు అన్నావు, చూశావా! ఇప్పుడు నీ నీడ సైతం నీకు ఉపయోగపడలేదు'' అన్నారు.

ఇప్పుడు ఆ ఐశ్వర్యవంతుడికి నిజంగా జ్ఞానోదయం అయింది ఏ చెట్టు కిందకూ వెళ్ల కుండానే.

అందుకే పెద్దలన్నారు... అహంకరించవద్దు అని. ఎంత ధనవంతులైనా, వారికి ఎన్ని ఉన్నా ఎప్పుడు ఎవరికీ ఏది అవసరం అవుతుందో తెలియదు ఈ లోకంలో.

అన్నింటికీ మించి మనపైన మనకు నమ్మకం ఉండాలి అహం ఉండకూడదు. మన పైన మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. అతేకానీ, ఇతరులపైన ఏమాత్రం చులకన భావం ఉండకూడదు... మనసులోకి రాకూడదు.

గృహస్థాశ్రమ విశిష్టత

పెళ్ళి... ఇద్దరి మధ్య వ్యవహారం కాదు



ధర్మం, కామం, అర్థం సమంగా ఉంటే... మోక్షం అనేది కొత్తగా ప్రయత్నించి తెచ్చుకోనక్కర లేదు. అదే వస్తుంది. అంటే ధర్మబద్ధమైన అర్థం, ధర్మబద్ధమైన కామం ఉండాలి. నేను డబ్బు సంపాదిస్తే ధార్మికంగా సంపాదించానా ? ఖర్చుపెడితే.. ధర్మంకోసం ఖర్చు పెట్టానా? నాకు మనసులో ఒక కోరిక పుడితే ఇది ధర్మచట్రంలో ఇముడుతుందా? దీనిని నేను నెరవేర్చుకోవచ్చా? ... ఈ పరిశీలన అలవాటయితే అర్థం. కామం ధర్మానికి ముడిపడిపోయినట్టే. సామాన్యులకు కూడా ప్రయోజనం చేకూరాలని మన రుషులు ప్రవేశపెట్టిన మార్గం ఇది.. అదే గృహస్థాశ్రమం.

గృహస్థు అంటే కేవలం ఒక గృహంలో ఉన్నవాడని కాదు. గృహస్థాశ్రమ స్వీకారం చేశాడు... అంటే ధర్మాన్ని స్వీకరించాడు.. అని. తరువాత నిత్యకర్మ చేయకుండా ఎలా ఉంటాడు? అది సాధ్యం కాదు. ఏదో కర్మ చేయవలసిందే. దీనివల్ల చివరకు ప్రత్యేకంగా ప్రయత్నించకపోయినా మోక్షమే కలుగుతుంది. జ్ఞానాన్ని ఇచ్చిన భగవంతుడు మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు.

రామాయణంలో భరతుడు ఒక మాటంటాడు. నాలుగు ఆశ్రమాలలోకి గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనది -అని. అంతకన్నా గొప్పది మరొకటి లేదు.

కోటలో యుద్ధం చేయడం గృహస్థాశ్రమం. కోట బయట చేసేవి ఇతర ఆశ్రమాలు. అవి జన్మతః వైరాగ్యం కలిగిన మహాపురుషులకే సాధ్యం. ఎన్నో జన్మల అనుష్ఠాన బలం వారిది. వారు కారణజన్ములు. చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు, చంద్రశేఖర భారతీ మహాస్వామివారు, ఒక రామకృష్ణ పరమహంస, ఒక వివేకానందుడు, అరుణాచల భగవాన్ రమణులు... ఇటువంటివారు ఎక్కడో కోట్లలో ఒకరుంటారు.

కానీ అందరికి అందుబాటులో ఉండేది, అర్థకామములను ధర్మం తో ముడివేసుకోవడానికి యోగ్యమైనది – గృహస్థాశ్రమం. దీని ప్రవేశం... కేవలం ఒక పురుషుడికో, ఒక స్త్రీకో సంబంధించినది కాదు. అంటే పెళ్ళి ఎప్పుడూ పూర్తిగా వ్యక్తిగత విషయం కానే కాదు. ఇక్కడ సక్రమంగా ప్రవర్తించకపోతే... దాని చెడు ప్రభావం సమాజం మీద పడుతుంది. కచ్చితంగా మూడవ వ్యక్తి మీద అది ప్రభావం చూపి తీరుతుంది. అదే దంపతులిద్దరూ అన్యోన్యంగా బతకగలిగితే... మూడవ వ్యక్తికి ఆదర్శంగా నిలుస్తారేమో గానీ, సమాజాన్ని అది చెడుగా ప్రభావితం చేసే అవకాశమేలేదు.

వాళ్ళిద్దరూ పుట్టుకనుంచి కలిసి ఉన్నవారు కాదు, కలిసి చదువుకోలేదు, కలిసి బతకలేదు. అకస్మాత్తుగా ఇద్దరు కలుసుకుని జీవిత ప్రయాణానికి, ఒక ఆశ్రమ నియమానికి కట్టుబడటానికి సిద్ధమవుతున్నారు. మనం ఒక ఉద్యోగంలో చేరితేనే... సవాలక్ష నియమాలకు అంగీకరించినప్పడే దానిలో కొనసాగగలం. అటువంటిది ఒక జీవితకాలం పూర్తిగా కలిసి ఇద్దరూ ప్రయాణించాలి. పుట్టిన సంతానానికి మార్గదర్శకంగా నిలవాలి... అంటే దానికి ఎంతో పరిణతి ఉండాలి. జీవితం అంటే పూలపడవ కాదు కదా... వెలుతురు, చీకటి, కష్టాలు, సుఖాలు... అన్నింటినీ చక్కగా సమన్వయంతో, అవగాహనతో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా వంశాభివృద్ధి చేసుకుంటూ సంసారనావను నడపాల్సి ఉంటుంది. అటువంటి సంసారంలో మంచి జరిగినా, చెడు జరిగినా అది సమాజాన్ని సానుకూలంగా కానీ, ప్రతికూలంగా కానీ ప్రభావితం చేస్తుంటుంది. అందుకే పెళ్ళి ఎప్పుడూ ఇద్దరి మధ్య వ్యవహారం కాదు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

వార్‌కు రెడీ!


ఎన్టీఆర్

బాలీవుడ్ 'వార్'కు రెడీ అవుతున్నారు ఎన్టీఆర్. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. 2019లో హిట్‌గా నిలిచిన హిందీ చిత్రం 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. 'వార్'కి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించగా, 'వార్ 2'కు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఇప్పటికే 'వార్ 2' చిత్రీకరణ మొదలైందని, హృతిక్‌రోషన్ పాల్గొనగా కొంత చిత్రీకరణ కూడా జరిపారని టాక్. కాగా ఈ వారంలో 'వార్ 2' సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అవుతారని బాలీవుడ్ సమాచారం. ఎన్టీఆర్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపిస్తారని టాక్. 'వైఆర్ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. 'వార్ 2' చిత్రాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లుగా ఇప్పటికే చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

చలో రాజమహేంద్రవరం


రామ్‌చరణ్


'గేమ్‌చేంజర్' కోసం రాజమహేంద్రవరం వెళ్లనున్నారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, నవీన్‌చంద్ర, ప్రియదర్శి, జయరాం, సునీల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ రాజమహేంద్రవరంలో జరగనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. రామ్‌చరణ్‌తో పాటు ముఖ్యతారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ ఈ నెలాఖరులో ప్రారంభం కానుందని తెలిసింది. కథ రీత్యా సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట శంకర్. రాజమహేంద్రవరం షెడ్యూల్ పూర్తయిన తర్వాత వైజాగ్‌కు వెళ్తారట యూనిట్. తమన్ ఈ సినిమాకు స్వరకర్త. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.. రిలీజ్ డేట్‌పై త్వరలోనే స్పష్టత రానుంది.

అక్టోబర్‌లో వేట్టయాన్


రజనీకాంత్

అక్టోబర్‌లో థియేటర్స్‌కు వస్తున్నాడు 'వేట్టయాన్'. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ 'వేట్టయాన్'. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్, జీకేఎమ్ తమిళ కుమరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబరులో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రజనీకాంత్ ఓ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, కిషోర్, రితికా సింగ్, దుషార విజయన్ ఇతర పాత్రల్లో నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాకు అనిరుద్ రవిచందర్ సంగీత దర్శకుడు.

పవర్‌ఫుల్ పాత్రలో...


జగపతి బాబు

రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అన్నది ట్యాగ్‌లైన్. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్న జగపతిబాబు లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. చెస్ మూవ్‌ని చేతిలో పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న లుక్ బాగుంది. ''మిస్టర్ బచ్చన్'లో జగపతి బాబు పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. రవితేజ, జగపతిబాబులను తెరపై చూడటం కనుల పండువగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ సిరీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: అయనంక బోస్.

పెళ్లి పేరుతో మోసం చేశాడు

– సన్నీలియోన్



'ఓ వ్యక్తి ప్రేమ, పెళ్లి పేరుతో నన్ను మోసం చేశాడు' అన్నారు బాలీవుడ్ నటి సన్నీలియోన్. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మరాఠి, బెంగాలి, మలయాళ భాషల్లోని పలు చిత్రాల్లో ప్రత్యేక పాటలతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు ఈ బ్యూటీ. 'కరెంట్ తీగ (2014) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన సన్నీలియోన్ 'పీఎస్‌వీ గరుడవేగ', 'జిన్నా' వంటి సినిమాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె 'రంగీలా', 'వీరమదేవి', 'కొటేషన్ గ్యాంగ్', 'షీరో', 'కోకా కోలా', 'యుఐ' వంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. అదేవిధంగా 'స్ప్లిట్స్ విల్లా' అనే ఓ రియాలిటీ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు సన్నీ. తాజాగా ఈ షోలో ఆమె మాట్లాడుతూ–''కొన్నేళ్ల క్రితం ఒక వ్యక్తిని చాలా ప్రేమించాను. తన కూడా నన్ను ప్రేమించాడు. మా ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. ఆ తర్వాత ఏదో తప్పు జరుగుతోందని, అతడు నన్ను మోసం చేస్తున్నాడేమోనని నా మనసుకు అనిపించింది. దీంతో 'నువ్వు నన్ను ఇంకా ప్రేమిస్తున్నావా?' అని ప్రశ్నిస్తే లేదన్నాడు. మరో రెండు నెలల్లో మా పెళ్లిని ప్లాన్ చేసుకున్నాం. హవాయి దీవుల్లో గ్రాండ్‌గా, జీవితాంతం గుర్తుండిపోయేలా వివాహం జరగాలని ప్లాన్ చేసుకున్నాం. ఇందుకోసం అన్నీ బుక్ చేసుకుని డబ్బులు కూడా ఇచ్చేశాను. పైగా పెళ్లి షాపింగ్ కూడా అయిపోయింది. ఇలాంటి సమయంలో తను అలా చెప్పడంతో నా మనసు ముక్కలైంది.. ఎంతో బాధపడ్డాను. ఆ తర్వాత భగవంతుడు నా జీవితంలో అద్భుతమైన మార్పులు తీసుకువచ్చాడు. డానియల్ వెబర్‌ను పరిచయం చేశాడు. నా తల్లితండ్రులు చనిపోయినప్పుడు తను ఎంతో అండగా నిలిచాడు. మా ఇద్దరి మనసులు కలవడంతో పెళ్లి(2011) చేసుకున్నాం. ఎప్పటికీ నా భర్త చేయి వదలను'' అన్నారు.

అది రహస్యం కాదు!


అదితీరావ్, సిద్ధార్థ్


''నేను, అదితీరావ్ హైదరీ కలిసి రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నామని చాలామంది అంటున్నారు. సీక్రెట్, ప్రైవేట్ అనే పదాలకు ఎంతో తేడా ఉంది. ఎవర్నీ పిలవకుండా, ఎవరికీ చెప్పకుండా చేసుకుంటే అది సీక్రెట్ అవుతుంది. కానీ, మా ఇరు కుటుంబసభ్యులతో కలిసి మేము ప్రైవేట్ ఫంక్షన్ చేసుకున్నాం. మా వారి సమక్షంలో జరిగిన నిశ్చితార్థం సీక్రెట్ ఎలా అవుతుంది'' అన్నారు హీరో సిద్ధార్థ్. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీ మార్చి 17న వనపర్తి జిల్లాలోని శ్రీరంగపురంలోని ఆలయంలో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ వేడుకలో పాల్గొన్న సిద్ధార్థ్‌కి నిశ్చితార్థం ఎందుకు రహస్యంగా చేసుకున్నారు? పెళ్లెప్పుడు? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనికి సిద్ధార్థ్ స్పందిస్తూ– ''నా ప్రేమ విషయాన్ని తొలిసారి అదితీరావుకి చెప్పినప్పుడు తన నుంచి ఏం జవాబు వస్తుందా? అని ఎదురుచూశాను. కానీ, తను నా ప్రేమను అంగీకరించడంతో చాలా సంతోషపడ్డాను. ఇక మా పెళ్లి ముహూర్తం నా చేతుల్లో లేదు.. మా ఇరుకుటుంబ పెద్దలు నిర్ణయిస్తారు'' అన్నారు సిద్ధార్థ్.

ఎమోషనల్ థ్రిల్లర్


వరలక్ష్మి

విలక్షణ నటి వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'శబరి'. ఈ మూవీ ద్వారా అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయవుతున్నారు. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో నిర్మించారు. ఈ సినిమాని మే 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ–''స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రమిది. కథ, కథనాలు ఇన్నోవేటివ్‌గా ఉంటాయి. వరలక్ష్మి నటించిన గత సినిమాలకు పూర్తి భిన్నంగా 'శబరి' ఉంటుంది. ముఖ్యంగా ఆమె నటన వావ్ అనేలా ఉంటుంది. తెలుగు, తమిళ వెర్షన్స్ ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. అన్ని భాషల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడి శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: గోపీ సుందర్.

రైతు గంగమ్మ


పార్వతి

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. పా. రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కాగా ఆదివారం(ఏప్రిల్ 7) పార్వతీ తిరువోతు బర్త్ డే. ఈ సందర్భంగా 'తంగలాన్' లో ఆమె నటించిన గంగమ్మ పాత్ర ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. లుక్ చూస్తే మహిళా రైతు పాత్రలో ఆమె నటించినట్లు తెలుస్తోంది. ''కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనలతో 'తంగలాన్' రూపొందింది. విక్రమ్‌ని విభిన్నమైన క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు పా.రంజిత్. త్వరలోనే ఈ సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.



భారత హాకీ జట్టుకు రెండో పరాజయం

ఆస్ట్రేలియా పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసింది. ఆదివారం పెర్త్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా 2-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున జుగ్‌రాజ్ సింగ్ (9వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఆస్ట్రేలియా తరఫున జెరెమి హేవార్డ్ (6వ, 34వ ని.లో) రెండు గోల్స్ సాధించగా... జేకబ్ అండర్సన్ (42వ ని.లో), నాథన్ ఎఫ్రామ్స్ (45వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.

మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్‌గా హరేంద్ర సింగ్!

ఏడేళ్ల తర్వాత రెండోసారి భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్‌గా హరేంద్ర సింగ్ రానున్నారు. 2017 సెప్టెంబర్‌లో తొలిసారి మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా నియమితులైన హరేంద్ర సింగ్ ఆరు నెలలపాటు ఈ పదవిలో ఉన్నారు. ఆ తర్వాత హరేంద్రను పురుషుల జట్టుకు కోచ్‌గా నియమించారు. 2018 పురుషుల ప్రపంచకప్‌లో టీమిండియా వైఫల్యం తర్వాత ఆయనను కోచ్ పదవి నుంచి తొలగించారు. అనంతరం హరేంద్ర స్వదేశం వీడి అమెరికా జట్టుకు కోచ్‌గా వెళ్లిపోయారు.



42 ఏళ్ల తర్వాత...


సుమిత్

మోంటెకార్లో (మొనాకో): ఈ ఏడాది తన నిలకడైన ప్రదర్శన కొనసాగిస్తూ... భారత టెన్నిస్ నంబర్ వన్ సుమిత్ నగాల్ ప్రతిష్టాత్మక మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 95వ ర్యాంకర్ సుమిత్ 7-5, 2-6, 6-2తో ప్రపంచ 55వ ర్యాంకర్ ఫాకుండో డియాజ్ అకోస్టా (అర్జెంటీనా)పై సంచలన విజయం సాధించాడు. తద్వారా ఈ టోర్నీలో 42 ఏళ్ల తర్వాత సింగిల్స్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందిన తొలి భారతీయ ప్లేయర్‌గా సుమిత్ గుర్తింపు పొందాడు. చివరిసారి భారత్ తరఫున 1982లో రమేశ్ కృష్ణన్ మోంటెకార్లో టోర్నీలో మెయిన్ 'డ్రా'లో పోటీపడి తొలి రౌండ్‌లో ఓడిపోయాడు.

వెర్‌స్టాపెన్‌కు మూడో విజయం



సుజుకా (జపాన్): జపాన్ గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేసులో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ఈ రేసును వెర్‌స్టాపెన్ 'పోల్ పొజిషన్'తో ప్రారంభించాడు. నిర్ణీత 53 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 54 నిమిషాల 23.566 సెకన్లలో పూర్తి చేసి ఈ నెదర్లాండ్స్ డ్రైవర్ అగ్రస్థానాన్ని దక్కించుకొని కెరీర్‌లో 57వ టైటిల్‌ను సాధించాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది మూడో విజయంకాగా... జపాన్ గ్రాండ్‌ప్రిలో వరుసగా మూడో గెలుపు కావడం విశేషం. రెడ్‌బుల్ జట్టుకే చెందిన సెర్జియో పెరెజ్ రెండో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో నాలుగు రేసుల తర్వాత వెర్‌స్టాపెన్ 77 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... 64 పాయింట్లతో పెరెజ్ రెండో స్థానంలో, 59 పాయింట్లతో లెక్‌లెర్క్(ఫెరారీ) మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని ఐదో రేసు చైనా గ్రాండ్‌ప్రి ఈనెల 21న జరుగుతుంది.

ముంబై అదిరే బోణీ...

- 29 పరుగులతో ఢిల్లీపై గెలుపు
- చెలరేగిన రోహిత్, టిమ్ డేవిడ్, కిషన్
- చివరి ఓవర్లో షెఫర్డ్ విధ్వంసం
- పృథ్వీ షా, స్టబ్స్ పోరాటం వృథా


షెఫర్డ్

ముంబై: ఎట్టకేలకు ముంబై ఇండియన్స్ ఐపీఎల్ తాజా సీజన్‌లో గెలుపు బోణీ కొట్టింది. ఆరంభం నుంచి ఆఖరి బంతిదాకా బ్యాటర్లంతా దంచేయడంతో ముంబై 29 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. మొదట ముంబై 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 234 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (27 బంతుల్లో 49; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (23 బంతుల్లో 42; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (21 బంతుల్లో 45 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రొమారియో షెఫర్డ్ (10 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) విధ్వంసం ఢిల్లీ బౌలర్లను చేష్టలుడిగేలా చేసింది. అక్షర్ పటేల్‌కు 2 వికెట్లు దక్కాయి. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేయగలిగింది. పృథ్వీ షా (40 బంతుల్లో 66; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (25 బంతుల్లో 71 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) పోరాడినా ఫలితం లేకపోయింది. ముంబై బౌలర్ కొయెట్జీ 4 వికెట్లు తీశాడు.

మూడు దశల్లో ముంబై వీర విహారం

ఓపెనర్లు రోహిత్, ఇషాన్ తొలిదశకు అద్భుతంగా శ్రీకారం చుట్టారు. ఇద్దరు అడ్డుఅదుపులేని బాదుడుతో 4.1 ఓవర్లో ముంబై స్కోరు 50కి చేరింది. ఇంకో మూడు ఓవర్లలోనే జట్టు స్కోరు 80 దాటింది. అక్కడే రోహిత్ అవుట్‌కాగా స్వల్ప వ్యవధిలో సూర్యకుమార్ (0), ఇషాన్ కిషన్‌లు కూడా అవుటయ్యారు. తిలక్‌వర్మ (6) అవుటయ్యాక రెండో దశను హార్దిక్ పాండ్యా (33 బంతుల్లో 39; 3 ఫోర్లు, 1 సిక్స్), టిమ్ డేవిడ్ ధాటిగా నడిపించారు. 16వ ఓవర్లో 150 దాటింది. డేవిడ్ సిక్స్‌లతో విరుచుకుపడటంతో మరో మూడు ఓవర్లలో 200 (19వ ఓవర్లో) మైలురాయిని చేరుకుంది. ఆఖరి దశ మాత్రం షెఫర్డ్ అరివీర బాదుడుతో స్టేడియం ఊగిపోయింది. నోర్జే వేసిన 20వ ఓవర్ అసాంతం ఆడుకున్న షెఫర్డ్ 4, 6, 6, 6, 4, 6లతో ఏకంగా 32 పరుగులు పిండేశాడు. ఏ ఒక్కరు కనీసం ఫిఫ్టీ అయినా బాదకుండా టి20 క్రికెట్‌లో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా ముంబై రికార్డు నమోదు చేసింది.

పృథ్వీషా, స్టబ్స్ మెరుపులు

మ్యాచ్‌లో ఓడింది కానీ... ఢిల్లీ క్యాపిటల్స్ ఆఖరి దాకా పోరాడింది. వార్నర్ (10)తో ఆరంభం కుదరకపోయినా పృథ్వీ షా చక్కని షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అభిషేక్ పోరెల్ (31 బంతుల్లో 41; 5 ఫోర్లు)తో రెండో వికెట్‌కు చకచకా 88 పరుగులు జోడించాక 12వ ఓవర్లో బుమ్రా కళ్లు చెదిరే యార్కర్‌కు పృథ్వీ షా నిష్క్రమించాడు. తర్వాత స్టబ్స్ భారీ సిక్సర్ల విధ్వంసంతో ముంబై ఇండియన్స్ బౌలర్లను వణికించాడు. కానీ అవతలి వైపు నిలిచే బ్యాటరే కరువవడంతో ఛేజింగ్‌లో వెనుకబడింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) అక్షర్ 49; కిషన్ (సి అండ్ బి) అక్షర్ 42; సూర్యకుమార్ (సి) సబ్-ఫ్రేజర్ (బి) నోర్జే 0; హార్దిక్ (సి) సబ్-ఫ్రేజర్ (బి) నోర్జే 39; తిలక్ వర్మ (సి) పటేల్ (బి) ఖలీల్ 6; టిమ్ డేవిడ్(నాటౌట్) 45; షెఫర్డ్ (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 234. వికెట్ల పతనం:** 1-80, 2-81, 3-111, 4-121, 5-181. **బౌలింగ్:** ఖలీల్ 4-0-39-1, ఇషాంత్ 3-0-40-0, రిచర్డ్‌సన్ 4-0-40-0, అక్షర్ 4-0-35-2, లలిత్ 1-0-15-0, నోర్జే 4-0- 65-2.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (బి) బుమ్రా 66; వార్నర్ (సి) పాండ్యా (బి) షెఫర్డ్ 10; పోరెల్ (సి) డేవిడ్ (బి) బుమ్రా 41; స్టబ్స్ (నాటౌట్) 71; రిషభ్ పంత్ (సి) హార్దిక్ (బి) కొయెట్జీ 1; అక్షర్ పటేల్ (రనౌట్) 8; లలిత్ (సి) ఇషాన్ (బి) కొయెట్జీ 2; కుశాగ్ర (సి) తిలక్ వర్మ (బి) కొయెట్జీ 0; రిచర్డ్‌సన్ (సి) రోహిత్ (బి) కొయెట్జీ 2; ఎక్స్‌ట్రాలు 3, **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 205. వికెట్ల పతనం:** 1-22, 2-110, 3-144, 4-153, 5-194, 6-203, 7-203, 8-205. **బౌలింగ్:** కొయెట్జీ 4-0-34-4, బుమ్రా 4-0-22-2, ఆకాశ్ మధ్వాల్ 4-0-45-0, రొమారియో షెఫర్డ్ 4-0-54-1, నబీ 2-0-17-0, పీయూశ్ చావ్లా 2-0- 32-0.

ఐపీఎల్‌లో నేడు

చెన్నై X కోల్‌కతా
వేదిక: చెన్నై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	4	4	0	8	1.120
కోల్‌కతా	3	3	0	6	2.518
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	4	2	2	4	0.517
హైదరాబాద్	4	2	2	4	0.409
పంజాబ్	4	2	2	4	-0.220
గుజరాత్	5	2	3	4	-0.797
ముంబై	4	1	3	2	-0.704
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

లక్నో 'హ్యాట్రిక్' విక్టరీ

33 పరుగులతో గుజరాత్ ఓటమి • 5 వికెట్లతో అదరగొట్టిన యశ్ ఠాకూర్


యశ్ ఠాకూర్

లక్నో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో లక్నో సూపర్ జెయింట్స్ ఐపీఎల్ 17వ సీజన్‌లో 'హ్యాట్రిక్' విజయాన్ని నమోదు చేసింది. గత సీజన్ రన్నరప్ గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు 33 పరుగుల తేడాతో గెలిచింది. మొదట లక్నో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో లక్నో 18 పరుగులకే 2 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (31 బంతుల్లో 33; 3 ఫోర్లు), స్టొయినిస్ (43 బంతుల్లో 58; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఆఖర్లో నికోలస్ పూరన్ (22 బంతుల్లో 32; 3 సిక్స్‌లు), ఆయూశ్ బదోని (11 బంతుల్లో 20; 3 ఫోర్లు) ధాటిగా ఆడారు. అనంతరం సులువైన లక్ష్యమే ఎదురైనా... గుజరాత్ బ్యాటర్ల నిర్లక్ష్యం జట్టును ముంచింది. చివరకు గుజరాత్ 18.5 ఓవర్లలో 130 పరుగులకే కుప్పకూలింది. మీడియం పేసర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశ్ ఠాకూర్ (5/30), స్పిన్నర్ కృనాల్ పాండ్యా (3/11) గుజరాత్‌ను దెబ్బ తీశారు. 54 పరుగుల వరకు వికెట్ కోల్పోని గుజరాత్ అనూహ్యంగా మరో 76 పరుగుల వ్యవధిలో 10 వికెట్లు చేజార్చుకోవడం గమనార్హం. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (19; 2 ఫోర్లు)ను యశ్ ఠాకూర్ బౌల్డ్ చేయగా, రవి బిష్ణోయ్ కళ్లు చెదిరే రిటర్న్ క్యాచ్‌తో కేన్ విలియమ్సన్ (1) నిష్క్రమించాడు. కృనాల్ పాండ్యా కూడా స్పిన్‌తో తిప్పేయడంతో గుజరాత్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) నూర్ (బి) ఉమేశ్ 6; కేఎల్ రాహుల్ (సి) తెవాటియా (బి) దర్శన్ 33; పడిక్కల్ (సి) శంకర్ (బి) ఉమేశ్ 7; స్టొయినిస్ (సి) శరత్ (బి) దర్శన్ 58; పూరన్ (నాటౌట్) 32; బదోని (సి) ఉమేశ్ (బి) రషీద్ ఖాన్ 20; కృనాల్ పాండ్యా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 163. వికెట్ల పతనం:** 1-6, 2-18, 3-91, 4-112, 5-143. **బౌలింగ్:** ఉమేశ్ 3-0-22-2, జాన్సన్ 4-0-32-0, రషీద్ 4-0-28-1, మోహిత్ 3-0-34-0, నూర్ 4-0-22-0, దర్శన్ 2-0-21-2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) రవి బిష్ణోయ్ (బి) కృనాల్ 31; గిల్ (బి) యశ్ ఠాకూర్ 19; విలియమ్సన్ (సి అండ్ బి) రవి బిష్ణోయ్ 1; శరత్ (సి) బదోని (బి) కృనాల్ 2; విజయ్ శంకర్ (సి) రాహుల్ (బి) యశ్ 17; దర్శన్ (సి) యశ్ ఠాకూర్ (బి) కృనాల్ 12; తెవాటియా (సి) పూరన్ (బి) యశ్ 30; రషీద్ ఖాన్ (సి) సబ్-హుడా (బి) యశ్ ఠాకూర్ 0; ఉమేశ్ (సి) డికాక్ (బి) నవీనుల్ 2; జాన్సన్ (నాటౌట్) 0; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) యశ్ ఠాకూర్ 4; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (18.5 ఓవర్లలో ఆలౌట్) 130. వికెట్ల పతనం:** 1-54, 2-56, 3-58, 4-61, 5-80, 6-93, 7-93, 8-102, 9-126, 10-130. **బౌలింగ్:** సిద్ధార్థ్ 4-0-29-0, నవీనుల్ 4-0-37-1, మయాంక్ 1-0-13-0, యశ్ ఠాకూర్ 3.5-1- 30-5, కృనాల్ 4-0-11-3, రవి బిష్ణోయ్ 2-0-8-1.

హంపి మూడో గేమ్ 'డ్రా'... ప్రజ్ఞానంద, వైశాలి విజయం



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసింది. టాన్ జోంగి (చైనా)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హంపి 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. మరో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి తొలి విజయాన్ని అందుకుంది. సలీమోవా నుర్గుల్ (బల్గేరియా)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో తమిళనాడు అమ్మాయి వైశాలి 33 ఎత్తుల్లో గెలిచింది. ఓపెన్ విభాగంలో వైశాలి తమ్ముడు ప్రజ్ఞానంద కూడా తొలి విజయం సాధించాడు. భారత్‌కే చెందిన విదిత్ సంతోష్ గుజరాతితో జరిగిన మూడో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద 45 ఎత్తుల్లో నెగ్గాడు. నెపోమ్‌నియాషి (రష్యా)తో జరిగిన గేమ్‌ను భారత గ్రాండ్ మాస్టర్ గుకేశ్ 40 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ పీజీసెట్-2024

ఏపీ ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యూనివర్శిటీలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షను ఆంధ్ర యూనివర్శిటీ నిర్వహించనుంది.

- » **పీజీ కోర్సులు:** ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంసీజే, ఎంఎల్ఐబీఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీటెక్ తదితరాలు.
- » **అర్హత:** సంబంధిత సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. చివరి సంవత్సరం పరీక్ష రాస్తున్న విద్యార్థులు అర్హులే.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఎంపీఈడీ మినహా)లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- » **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) విధానంలో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నాపత్రం 100 మార్కులకు ఉంటుంది. లాంగ్వేజ్ స్పెషలైజేషన్ పేపర్లు మినహా మిగతా అన్ని ప్రశ్నాపత్రాలు ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటాయి. ఆబ్జెక్టివ్ రూపంలో ప్రశ్నలు ఉంటాయి. నెగిటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం 90 నిమిషాలు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.05.2024.
- » **ప్రవేశ పరీక్షలు ప్రారంభం:** 10.06.2024.
- » **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

హెచ్ఎస్‌సీసీ, నోయిడాలో 38 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

నోయిడాలోని హాస్పిటల్ సర్వీసెస్ కన్సల్టెన్సీ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్ఎస్‌సీసీ).. రెగ్యులర్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 38
- » **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్-19, డిప్యూటీ మేనేజర్-08, మేనేజర్-07, సీనియర్ మేనేజర్-03, డిప్యూటీ జనరల్ మేనేజర్-01.
- » **విభాగాలు:** సివిల్, హెచ్ఆర్ఎం, బయో మెడికల్, ఫార్మసీ, లీగల్, ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సిస్టమ్, ఫైనాన్స్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాత, నైపుణ్య పరీక్షలు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటరాక్షన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2024.
- » **వెబ్‌సైట్:** http://www.hsccltd.co.in

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 1,113 ట్రేడ్ అప్రెంటిస్‌లు

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే రాయ్‌పూర్ డివిజన్, వాగన్ రిపేర్ షాప్(రాయ్‌పూర్)లో 2024-25 సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 1,113
- » **ట్రేడులు:** వెల్డర్, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్, హిందీ), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెషినిస్ట్, మెకానిక్ డీజిల్, మెషిన్ రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండిషనర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్.
- » **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 02.04.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్ష మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.05.2024.
- » **వెబ్‌సైట్:** https://secr.indianrailways.gov.in

సిపెట్ అడ్మిషన్ టెస్ట్-2024

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీఐపీఈటీ) దేశవ్యాప్తంగా ఉన్న సిపెట్ కేంద్రాల్లో డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి సిపెట్ అడ్మిషన్ టెస్ట్-2024 నిర్వహించనుంది. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- » **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ-మూడేళ్ల వ్యవధి.**
- » **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ-మూడేళ్ల వ్యవధి.**
- » **పోస్ట్-గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెషన్-టెస్టింగ్-రెండేళ్ల వ్యవధి.**
- » **పోస్ట్-గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ -క్యాడ్/క్యామ్-ఏడాదిన్నరేళ్ల వ్యవధి**
- » **అర్హత:** కోర్సును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2024.
- » **పరీక్షతేది:** 09.06.2024.
- » **కోర్సు ప్రారంభం:** 2024 ఆగస్ట్ మొదటి వారం
- » **వెబ్‌సైట్:** https://cipet24.onlineregistrationform.org/

ఎమ్మెస్సీకి బెస్ట్.. నెస్ట్

- » నైసర్, సీఈబీఎస్‌లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ
- » నెస్ట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం ఖరారు
- » ఇంటర్మీడియెట్ అర్హతతోనే దరఖాస్తుకు అవకాశం

సైన్స్ సబ్జెక్ట్‌లతో ఇంటర్మీడియెట్ పూర్తి చేశారా! సైన్స్ రంగంలో కెరీర్ కోరుకుంటున్నారా!! అందుకు చక్కటి మార్గం.. నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్). దేశంలో సైన్స్ విద్య, పరిశోధనలో ప్రత్యేక గుర్తింపు పొందిన నైసర్‌తో పాటు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్‌లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో నెస్ట్ స్కోర్‌తో ప్రవేశం పొందొచ్చు. ఆ తర్వాత పీహెచ్‌డీ దిశగా అడుగులు వేయొచ్చు! తాజాగా.. నెస్ట్-2024కు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. నెస్ట్-2024తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, ఈ టెస్ట్‌లో బెస్ట్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..

సాధారణంగా ఎమ్మెస్సీలో చేరాలంటే.. బీఎస్సీ పూర్తి చేయాలి. నెస్ట్ ద్వారా ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో చేరే అవకాశం ఉంది. అది కూడా దేశంలో సైన్స్ ఎడ్యుకేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (భువనేశ్వర్), అదే విధంగా భారత అణుశక్తి విభాగం నేతృత్వంలో ముంబై యూనివర్సిటీలో ప్రత్యేకంగా నెలకొల్పిన సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్(సీఈబీఎస్)లలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో అడుగుపెట్టొచ్చు.

మొత్తం 257 సీట్లు


నైసర్-భువనేశ్వర్‌లో 200 సీట్లు; సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్ (యూనివర్సిటీ ఆఫ్ ముంబై)లో 57 సీట్లు ఉన్నాయి. నైసర్‌లో ఒక మేజర్ సబ్జెక్ట్‌తోపాటు బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సును అందిస్తున్నారు. విద్యార్థులు వీటిలో తమకు ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌తోపాటు బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, లేదా ఫిజిక్స్‌లను మైనర్ సబ్జెక్ట్‌గా ఎంచుకునే అవకాశం ఉంది. అణుశక్తి శాఖ నేతృత్వంలోని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్‌లో.. బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు అందుబాటులో ఉంది.

అర్హతలు

సైన్స్ గ్రూప్‌లతో 2022, 2023లో 60 శాతం మార్కులతో 10+2/ఇంటర్మీడియెట్ ఉతీర్ణత ఉండాలి. 2024లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకోనున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 60 ఇంటర్‌లో శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది.

ప్రవేశ ప్రక్రియ

నెస్ట్ స్కోర్ ఆధారంగా విద్యార్థులు రెండు ఇన్‌స్టిట్యూట్‌లకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులు, అభ్యర్థులు పొందిన నెస్ట్ ర్యాంకు, రిజర్వేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకొని అడ్మిషన్ ఖరారు చేస్తారు. కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత నైసర్‌లో సీటు పొందిన విద్యార్థులకు హోమిబాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్, సీఈబీఎస్‌లో చేరిన విద్యార్థులకు యూనివర్సిటీ ఆఫ్ ముంబై నుంచి సర్టిఫికెట్లు అందిస్తారు.


నెస్ట్ 2024

స్కాలర్‌షిప్ సదుపాయం

నెస్ట్ స్కోర్ ఆధారంగా నైసర్, సీఈబీఎస్‌లలో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ పేరిట ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ అమలు చేస్తున్న దిశ ప్రోగామ్ ద్వారా.. ఏటా రూ.60 వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది. దీంతోపాటు సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేసేందుకు వీలుగా ప్రతి ఏటా రూ.20 వేల గ్రాంట్ కూడా అందిస్తారు.

రీసెర్చ్‌కు కేరాఫ్

ఈ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు వ్యవధి ఐదేళ్లు. పది సెమిస్టర్లుగా ఉంటుంది. విద్యార్థులు చివరి ఆరు సెమిస్టర్లలో సదరు క్యాంపస్ ఫ్యాకల్టీ సభ్యులు చేస్తున్న రీసెర్చ్‌లో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుంది. దీని ఆధారంగానూ అభ్యర్థులకు మార్కులు, క్రెడిట్స్ కేటాయిస్తారు. ఫలితంగా విద్యార్థులకు పీజీ స్థాయిలోనే పరిశోధనలపై ఆసక్తి, అవగాహన కలుగుతాయి.

బార్క్‌లో పీహెచ్‌డీ

నెస్ట్ స్కోర్‌తో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో చేరిన విద్యార్థులు భవిష్యత్‌లో ప్రతిష్టాత్మక పరిశోధన కేంద్రం బాబా అటామిక్ రీసెర్చ్(బార్క్) సెంటర్ ట్రైనింగ్ స్కూల్‌లో నేరుగా పీహెచ్‌డీలో చేరే అవకాశం ఉంది. ఇందుకోసం అభ్యర్థులు ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో నిర్దిష్ట మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ మార్కులను ప్రతి ఏటా బార్క్ నిర్దేశిస్తుంది. వీరికి ఇంటర్వ్యూ ద్వారా పీహెచ్‌డీలో అడ్మిషన్ కల్పిస్తారు.

పరీక్ష ఇలా

నెస్ట్‌ను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. రెండు సెషన్లుగా పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు ఏదో ఒక సెషన్‌కు హాజరు కావచ్చు. పరీక్షను నాలుగు సెక్షన్లుగా 260 మార్కులకు నిర్వహిస్తున్నారు. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి విభాగం/సబ్జెక్ట్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు చొప్పున ప్రతి సెక్షన్ 60 మార్కులకు ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. మొత్తం నాలుగు సెక్షన్లలో కలిపి 240 మార్కులకు పరీక్ష ఉంటుంది. నెస్ట్‌లో ప్రతి సెక్షన్‌లోనూ అభ్యర్థులు కనీస అర్హత మార్కులు పొందాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఎక్కువ మార్కులు పొందిన మూడు సెక్షన్లనే పరిగణనలోకి తీసుకుని 180 మార్కుల ప్రాతిపదికగా మూల్యాంకన చేస్తారు.

ఫైనల్ కటాఫ్ నిబంధన

నెస్ట్‌లో సెక్షన్ వారీ కటాఫ్‌తోపాటు.. మినిమమ్ అడ్మిషబుల్ పర్సంటైల్ పేరుతో ఓవరాల్ కటాఫ్‌ను కూడా నిర్దేశిస్తున్నారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 95 పర్సంటైల్, ఓబీసీ అభ్యర్థులు 90 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీ అభ్యర్థులు 75 పర్సంటైల్ సాధించాల్సి ఉంటుంది.

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

నైసర్, సీఈబీఎస్‌లలో ప్రవేశానికి వీలుగా నెస్ట్‌లో విజయం సాధించాలంటే.. విద్యార్థులు ఇంటర్మీడియెట్ స్థాయిలో తాము చదివిన అకడమిక్స్‌పై పట్టు సాధించాలి. ప్రధానంగా బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాలకు సంబంధించి అడిగే ప్రశ్నలు.. విద్యార్థుల్లోని విశ్లేషణాత్మక దృక్పథం, సంగ్రహణ సామర్థ్యం, తులనాత్మక విశ్లేషణను గుర్తించేలా ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి కాన్సెప్ట్‌లపై అవగాహనతోపాటు వాటిని వాస్తవ పరిస్థితుల్లో అన్వయించగలిగే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇందుకోసం చదువుతున్న అంశాలను ప్రాక్టీస్ చేయడం ఎంతో లాభిస్తుంది.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో మేలు

నెస్ట్ ఎంట్రన్స్.. విభాగాల వారీగా సిలబస్‌కు సంబంధించి గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే.. ప్రశ్నలు సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగా అడుగుతున్నట్లు తెలుస్తోంది. కాబట్టి అభ్యర్థులు పది, పదకొండు, పన్నెండు తరగతుల సీబీఎస్‌ఈ పుస్తకాలను ఔపోసన పట్టడం మంచిది. ముఖ్యంగా కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి.

ఇలా అకడమిక్ సబ్జెక్ట్‌ల కాన్సెప్ట్‌లతోపాటు అప్లికేషన్ దృక్పథంతో ప్రిపరేషన్ సాగిస్తే నెస్ట్‌లో విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు. జేఈఈ-మెయిన్, జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు.. అదే సన్నద్ధతతో నెస్ట్‌కు కూడా హాజరై ప్రతిభ చూపే అవకాశం ఉంది. గత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ద్వారా పరీక్షలో అడుగుతున్న ప్రశ్నల తీరుపైనా అవగాహన లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మే 31
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** 2024, జూన్ 15
- **నెస్ట్ తేదీ:** 20024, జూన్ 30
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nestexam.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	21	74,248
నిఫ్టీ ▽	1	22,514

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	16,249	▲ 199
డోజోన్స్	38,904	▲ 307
ఎఫ్‌టీఎస్ఈ 100	7,911	▽ 65
డాక్స్	18,164	▽ 240
షాంఘై (గురువారం ముగింపు)	3,069	▽ 6
నికాయ్	38,010	▽ 808

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎగుమ	83.04	84.05
£	బ్రిటన్ పౌండ్	ఎగుమ	104.22	106.77
€	యూరో	ఎగుమ	89.38	91.74
¥	జపాన్ ఎన్ (100)	ఎగుమ	54.64	55.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎగుమ	53.98	55.90
S$	సింగపూర్ డాలర్	దిగుమతి	59.51	64.17
SAR	సౌదీ రియాల్	దిగుమతి	21.32	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	దిగుమతి	21.79	23.57
¥	చైనా యువాన్	దిగుమతి	10.39	12.47

పన్ను భారం తగ్గేదెలా..?



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి రిటర్నులు దాఖలు చేసే వారికి నూతన పన్ను విధానం డిఫాల్ట్‌గా ఎంపికై ఉంటుంది. పాత పన్ను వ్యవస్థతోనే కొనసాగాలనుకుంటే విధిగా దానిని ఎంపిక చేసుకోవాల్సిందే. లేదంటే కొత్త విధానం అమలవుతుంది. పాత వ్యవస్థతో పోలిస్తే కొత్త పన్ను విధానంలో పన్ను భారం తక్కువ. కానీ, పాత విధానంలో పన్ను మినహాయింపులు, తగ్గింపులు ఎక్కువ. వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే కనుక కొత్త విధానంతో పోలిస్తే గణనీయమైన పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చు. దీంతో నికరంగా చెల్లించే పన్ను తగ్గిపోతుంది. మరి వీటిల్లో తమకు ఏది అనుకూలమో తేల్చుకోవాలంటే, ఈ వివరాలు తెలుసుకోవాల్సిందే.

ఆదాయపన్ను భారాన్ని సాధ్యమైనంత తగ్గించుకోవాలని కోరుకునే వారికి.. పాత, కొత్త పన్ను విధానాల్లో ఎంపిక కీలకం అవుతుంది. చట్టప్రకారం మీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంటే, అప్పుడు విధిగా రిటర్నులు దాఖలు చేసి నిబంధనల ప్రకారం పన్ను చెల్లించాలి. పాత, కొత్త పన్ను రేట్లను ఒకసారి పరిశీలిద్దాం.

ఈ రెండు వ్యవస్థల్లోనూ కొంత పన్ను రాయితీ ఉంది. పాత విధానంలో నికరంగా రూ.5 లక్షలు, నూతన విధానంలో నికరంగా రూ.7 లక్షలు మించకుండా పన్ను వర్తించే ఆదాయం ఉంటే సెక్షన్ 87ఏ కింద ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల ప్రయోజనాన్ని కూడా కలిపి చూస్తే వేతన జీవులు పాత విధానంలో రూ.5.50,000 ఆదాయం, కొత్త విధానంలో రూ.7,50,000 మించని ఆదాయంపై రూపాయి పన్ను కట్టక్కర్లేదు. ఆదాయపన్ను చట్టంలోని వివిధ సెక్షన్ల కింద వేర్వేరు సాధనాల్లో ఇన్వెస్ట్ చేసి పన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోలేని వారికి నూతన విధానమే అనుకూలం. పాత విధానంలో సెక్షన్ 80సీ, 80డీ, 24 ఇలా పలు సెక్షన్ల కింద పన్ను తగ్గింపులు, మినహాయింపులను వినియోగించుకుంటే, రూ.5 లక్షలకు పైన ఆదాయం ఉన్నవారు సైతం గణనీయమైన ప్రయోజనాన్ని పొందొచ్చు. ఇంతకుమించి ఆదాయం కలిగిన వారు ఈ రెండింటిలో ఏది లాభదాయకమో తేల్చుకోవాలంటే కొంత కసరత్తు అవసరం.

పాత విధానం

ఆదాయం (రూ.)	పన్ను రేటు (శాతం)
2,50,000	లేదు
2,50,001-5,00,000	5
5,00,001-10,00,000	20
10,00,001 ఆ పైన	30

కొత్త విధానం

ఆదాయం (రూ.)	పన్ను రేటు (శాతంలో)
3,00,000	లేదు
3,00,001-6,00,000	5
6,00,001-9,00,000	10
9,00,001-12,00,000	15
12,00,001-15,00,000	20
15,00,001 ఆ పైన	30 శాతం

పీపీఎఫ్, సుకన్య సమృద్ధి



దీని కింద పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఈ మొత్తంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. జీవిత బీమా పాలసీకి చెల్లించే ప్రీమియం, పిల్లల ట్యూషన్ ఫీజులను కూడా ఈ సెక్షన్ కింద చూపించుకోవచ్చు. గృహ రుణం తీసుకుని, ఒక ఆర్థిక సంవత్సరంలో దీనికి చెల్లించే అసలును (ప్రతి ఈఎంఐలో అసలు, వడ్డీ భాగం ఉంటుంది) సెక్షన్ 80సీ కింద చూపించి, ఆ మొత్తంపై పన్ను లేకుండా చేసుకోవచ్చు.

హెల్త్ ఇన్సూరెన్స్



హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను సెక్షన్ 80డీ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. 60 ఏళ్లలోపు వయసున్న వారు రూ.25,000 వరకు, అంతకుమించిన వయసు వారికి రూ.50,000 వరకు పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుంది. ఇదే సెక్షన్ కింద హెల్త్ చెకప్‌లకు చేసే వ్యయం రూ.5,000 వరకు పన్ను మినహాయింపు ఉంది.

విరాళాలు ఇస్తే..



అర్హత కలిగిన సంస్థలకు విరాళాలు ఇస్తే, ఆ మొత్తంపై సెక్షన్ 80జీ కింద పన్ను భారం ఉండదు. ఇక సెక్షన్ 80టీటీఏ కింద సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్లపై ఆర్జించే వడ్డీ రూ.10,000 మొత్తంపై పన్ను లేదు. అదే 60 ఏళ్లు నిండిన వారికి వడ్డీ ఆదాయం రూ.50,000పై పన్ను లేదు. ఇవన్నీ పాత పన్ను విధానంలో ఉన్న చక్కని పన్ను మినహాయింపు ప్రయోజనాలు.

పన్ను ఆదా, పెట్టుబడులు

పాత వ్యవస్థలో ఉన్న పన్ను ఆదా ప్రయోజనాలను ఉపయోగించుకుంటే, మరింతగా పన్ను ఆదా చేసుకోవచ్చని లాడర్7 ఫైనాన్షియల్ అడ్వైజర్స్ వ్యవస్థాపకుడు సురేష్ శడగోపన్ పేర్కొన్నారు. వివిధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఒకవైపు పెట్టుబడులపై రాబడిని, మరోవైపు పన్ను ఆదా చేసుకోవడానికి వీలుంటుంది. కొత్త పన్ను విధానంలో పెట్టుబడులకు ఎలాంటి ప్రోత్సాహం లేదు. అంటే ఇది పెట్టుబడులను నిర్బంధం చేయదు.

ఎన్‌పీఎస్



వేతన జీవులు, స్వయం ఉపాధిలోని వారు, ప్రభుత్వరంగ ఉద్యోగులకు ఎన్‌పీఎస్‌పై పన్ను ప్రయోజనాలు ఉన్నాయి. వేతన జీవులు అయితే తమ మూలవేతనం, డీఏలో 10 శాతం మేర ఎన్‌పీఎస్‌కు చందా జమ చేయడం ద్వారా ఆ మొత్తంపై పన్ను లేకుండా చేసుకోవచ్చు. స్వయం ఉపాధిలో ఉన్న వారు తమ మొత్తం ఆదాయంలో 20 శాతంపై ఈ ప్రయోజనాన్ని పొందొచ్చు. ఈ సెక్షన్ కింద ఈ రెండు వర్గాలకు గరిష్ట ప్రయోజనం రూ.1.5 లక్షలు. ఇక 80సీసీడీ (1బి) కింద వేతన జీవులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు రూ.50,000 జమలపై పన్ను మినహాయింపు పొందొచ్చు. పైన చెప్పుకున్న రూ.1.5 లక్షలకు ఇది అదనం. 80సీసీడీ(2) కింద వేతన జీవులకు అదనపు ప్రయోజనం ఉంది. ఉద్యోగి ఎన్‌పీఎస్ ఖాతాలో సంస్థ చేసే జమలు దీనికింద వస్తాయి. ప్రభుత్వరంగ ఉద్యోగులు అయితే తమ మూలవేతనం, డీఏలో 14 శాతం, ప్రైవేటు ఉద్యోగులు 10 శాతం మేర యాజమాన్యం జమలపై పన్ను మినహాయింపు పొందొచ్చు. ఇక్కడ గరిష్ట పరిమితి రూ.7.5 లక్షలు. ఈపీఎఫ్ జమలు కూడా ఈ పరిమితిలో భాగమే.

హెచ్ఆర్ఏ



అద్దె ఇంట్లో ఉంటూ, పనిచేసే సంస్థ నుంచి ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) పొందుతుంటే అప్పుడు కూడా పన్ను ప్రయోజనాన్ని అందుకోవచ్చు. మెట్రోల్లో నివసించే వారు తమ మూల వేతనం, డీఏలో 50 శాతం మేర సెక్షన్ 10(13ఏ) కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. నాన్ మెట్రోల్లోని వారికి ఈ పరిమితి 40 శాతంగా ఉంది. అలాగే, హెచ్ఆర్ఏ రూపంలో ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న మొత్తం.. మూలవేతనం, డీఏలో 10 శాతాన్ని వాస్తవంగా చెల్లించిన అద్దె నుంచి తీసివేయగా వచ్చే మొత్తం.. ఈ మూడింటిలో ఏది తక్కువ అయితే ఆ మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. పనిచేసే ప్రాంతంలో సొంత ఇంట్లో నివాసం ఉండే వారికి హెచ్ఆర్ఏపై పన్ను మినహాయింపు రాదు. పనిచేసే చోట అద్దె ఇంట్లో ఉంటూ, వేరే ప్రాంతంలో సొంతిల్లును అద్దెకు ఇచ్చిన వారు సైతం హెచ్ఆర్ఏపై పన్ను మినహాయింపును పొందొచ్చు. లీవ్ ట్రావెల్ అలవెన్స్ (ఎల్‌టీఏ) పన్ను పరిధిలోకి వస్తుంది. ప్రయాణాలకు చేసిన ఖర్చును చూపించి, పన్ను భారం తొలగించుకోవచ్చు.

గృహ రుణం/విద్యా రుణం



రుణంపై ఇంటిని కొనుగోలు చేసే ధోరణి పెరిగింది. ఉద్యోగంలో చేరిన తొలి నాళ్లలోనే ఇప్పుడు యువత సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నారు. ఇలాంటి వారు కొంత డౌన్ పేమెంట్ చెల్లించి, మిగిలిన మొత్తానికి రుణం తీసుకుంటున్నారు. ఈ రుణానికి చేసే అసలు చెల్లింపులు ఒక ఏడాదిలో రూ.1.5 లక్షలను సెక్షన్ 80సీ కింద, వడ్డీ చెల్లింపులు రూ.2 లక్షల మేర సెక్షన్ 24(బి) కింద చూపించుకుని ఆ మొత్తంపై పన్ను కట్టక్కర్లేదు. సొంతగా నివాసం ఉన్నా లేదా అద్దెకు ఇచ్చినా సరే ఈ ప్రయోజనానికి అర్హులే. విద్యా రుణానికి ఒక ఆర్థిక సంవత్సరంలో చేసే వడ్డీ చెల్లింపులు ఎంత ఉన్నా సరే ఆ మొత్తాన్ని రిటర్నుల్లో చూపించుకుని పన్ను లేకుండా మినహాయింపు పొందొచ్చు.

మీకు ఏది అనుకూలం?

పాత విధానంలో ఇక్కడ పేర్కొన్న మినహాయింపులను పూర్తిగా వినియోగించుకుంటే.. సెక్షన్ 80సీ కింద 1.50 లక్షలు, 80 సీసీడీ (1బి) కింద రూ.50,000 (ఎన్‌పీఎస్), స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000, గృహ రుణం వడ్డీ రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.9.5 లక్షలపై పన్ను లేనట్టే. అలాగే, ప్రైవేటు ఉద్యోగులు పనిచేసే సంస్థ ద్వారా ఎన్‌పీఎస్ ఖాతాకు గరిష్టంగా రూ.7.5 లక్షల మేర జమ చేయించుకుంటే అప్పుడు మొత్తం రూ.17 లక్షలపై పన్ను లేనట్టు అవుతుంది. కొత్త విధానంలో రూ.7 లక్షల మొత్తంపై సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ కల్పించారు. దీనికి రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్ అదనం. అంటే రూ.7.5 లక్షలపై పన్ను లేదు. ఆదాయం రూ.7,50,001 ఉన్న వారికి 87ఏ రాయితీ వర్తించదు. వారు తమ ఆదాయంపై పూర్తి పన్ను చెల్లించాలి. మొదటి మూడు లక్షలపై పన్ను లేదు. 3-6 లక్షలపై 5 శాతం ప్రకారం రూ.15,000. రూ.6.-7.51 లక్షలపై 10 శాతం ప్రకారం రూ.15,000 కలిపి మొత్తం రూ.30,000, దీనికి సెస్ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. 7.51 లక్షల ఆదాయంపై పాత విధానంలో రిటర్నులు వేసుకునేట్టు అయితే.. 87ఏ రిబేటు, స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.5.5 లక్షల వరకు పన్ను లేదు. 80సీ సాధనంలో 1.5 లక్షలు ఇన్వెస్ట్ చేసుకుని, దీనికి అదనంగా ఎన్‌పీఎస్‌లో రూ.50,000 ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా రూపాయి పన్ను లేకుండా చూసుకోవచ్చు.

విధానాన్ని మార్చుకోవచ్చు..

పాత పన్ను నుంచి కొత్త పన్నుకు.. తిరిగి పాత పన్నుకు మారడంపై ఆంక్షలు ఉన్నాయి. వ్యాపారం లేదా వృత్తి రూపంలో ఆదాయం పొందని వారు ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ పాత, కొత్త పన్ను వ్యవస్థల్లో ఏదో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. వృత్తి లేదా వ్యాపారం నుంచి ఆదాయం పొందుతున్న వారు సెక్షన్ 115బీఏసీ కింద నూతన పన్ను విధానం నుంచి వైదొలిగే ఆప్షన్‌ను వినియోగించుకోవచ్చు. అప్పుడు తిరిగి నూతన పన్ను విధానానికి ఒక్కసారి మాత్రమే మారే అవకాశం ఉంటుంది. ''తక్కువ పన్ను శ్లాబుల పరిధిలో ఆదాయం కలిగిన వారికి నూతన పన్ను విధానమే మెరుగైనది. అధిక రేటు శ్లాబుల్లో ఉన్నవారు, అన్ని రకాల మినహాయింపులు వినియోగించుకుంటే వారికి పాత విధానం అనుకూలం'' అని రైట్ హారిజాన్స్ సీఈవో అనిల్ రెగో సూచించారు.

పన్నుపై సర్‌చార్జ్ రేట్లు

ఆదాయం(రూ.లలో)	సర్‌చార్జ్ (పాత విధానం)	సర్‌చార్జ్ (కొత్త విధానం)
50 లక్షల నుంచి కోటి వరకు	10 శాతం	10 శాతం
కోటి నుంచి రెండు కోట్లు	15	15
రెండు నుంచి మూడు కోట్లు	25	25
ఐదు కోట్లకు పైన	37	25

సెలెక్ట్ మొబైల్స్ ఉగాది డిస్కౌంట్లు



హైదరాబాద్: సెలెక్ట్ ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఎండీ వై గురు మాట్లాడుతూ, ఆఫర్లలో భాగంగా విక్రయాలపై 7.5 శాతం నుంచి 75 శాతం వరకూ తగ్గింపును ప్రకటించారు. ప్రతి మొబైల్ కొనుగోలుపై ఉచిత బహుమతులను సొంతం చేసుకోవచ్చని తెలిపారు. టీవీ, ల్యాప్‌టాప్, యాక్సెసరీస్‌పై కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు వెల్లడించారు. సెలెక్ట్ మొబైల్ స్టోర్లు అన్నింటిలో ఆఫర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

బీన్యూ పండుగ ఆఫర్లు



హైదరాబాద్: ఉగాది పండుగ సందర్భంగా బీన్యూ తెలుగు ప్రజలకు ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. ఈ మేరకు వెలువడిన ప్రకటన ప్రకారం ప్రతి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువగల స్మార్ట్‌వాచ్ లేదా బడ్స్ వినియోగదారుకు అందించనుంది. బజాజ్ ఫైనాన్స్ ద్వారా ప్రతి కొనుగోలుపై రూ.6,000 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉంది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కొనుగోలుపై రూ.5,000 వరకూ క్యాష్ బ్యాక్, హెచ్‌డీబీ ద్వారా కొనుగోలుపై 10 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్లు ఇస్తోంది. ఐఫోన్, టీవీ, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై కూడా పలు ఆఫర్లను అందిస్తున్నట్లు ఈడీ సాయి నితీష్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	405-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390-00
విజయవాడ	390-00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00

స్టాక్ స్కోప్

కజారియా సిరామిక్స్ — ఎమ్‌కే గ్లోబల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,251 టార్గెట్: రూ. 1,450



ఎందుకంటే: టైల్స్ రంగ దిగ్గజం కజారియా సిరామిక్స్ గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా అమ్మకాలు విస్తరిస్తూ వచ్చింది. పరిశ్రమ పరిమాణం 2,070 మిలియన్ చదరపు మీటర్లు(ఎంఎస్ఎం)కాగా.. 100 కంటే అధికంగా విక్రయాలు నిర్వహిస్తోంది. తద్వారా గరిష్ట స్థాయిలో పోటీ, అత్యధిక కంపెనీలు గల టైల్స్ మార్కెట్‌లో అఖిలభారత స్థాయిలో పటిష్టతను చాటుకుంటోంది. కంపెనీ నాయకత్వ స్థానం, పటిష్ట బ్రాండ్ గుర్తింపు, భారీ పంపిణీ వ్యవస్థ(నెట్‌వర్క్) తదితర అంశాలు గత దశాబ్ద కాలంలో మార్కెట్ వాటాను పెంచుకోవడంలో దోహదపడ్డాయి. వెరసి పరిశ్రమకంటే 3 శాతం అధికంగా వార్షిక ప్రాతిపదికన ఆదాయం 10 శాతం చొప్పున వృద్ధిని అందుకుంది. భవిష్యత్‌లోనూ మార్కెట్ వాటా పెంపు కొనసాగవచ్చని భావిస్తున్నాం. గత ఐదేళ్లలో ఏడాదికి రూ. 300 కోట్లు చొప్పున పెట్టుబడులు వెచ్చిస్తూ వచ్చిన కంపెనీకి 2023-26 మధ్య కాలంలో దాదాపు రెట్టింపు పెట్టుబడుల ఆవశ్యకత ఏర్పడింది. మరోవైపు రానున్న కాలంలో మార్జిన్లు, రిటర్న్ రేషియోలను మెరుగుపరచుకునేందుకు విలువ జోడింపు ప్రాజెక్టులపై కంపెనీ దృష్టి పెట్టింది. దీంతో రెండేళ్ల కాలం(2024-26)లో మొత్తం ఆదాయం 13 శాతం, నికర లాభం 19 శాతం చొప్పున పుంజుకోగలవని విశ్వసిస్తున్నాము. అధిక వృద్ధి, రిటర్న్ రేషియోలు, పటిష్ట బ్యాలెన్స్‌షీట్ కారణంగా షేరుకి ప్రీమియం విలువ లభిస్తోంది. నికర నగదుగల బ్యాలెన్స్‌షీట్‌కుతోడు అత్యుత్తమ బ్రాండ్, టైల్స్ రంగంలో విస్తారిత అమ్మకాలు, వృద్ధి అవకాశాలు కంపెనీకి సానుకూలతలుగా పేర్కొనవచ్చు.

సిగ్నేచర్ గ్లోబల్ — ఐసీఐసీఐ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,310 టార్గెట్: రూ. 1,705



ఎందుకంటే: రియల్టీ రంగ దిగ్గజం సిగ్నేచర్‌గ్లోబల్ ఇండియా రెండేళ్ల కాలంలో సాధించనున్న అమ్మకాల బుకింగ్స్‌పై 9 రెట్లు సగటు అంచనా నిర్వహణ లాభం (ఇబిటా) చొప్పున షేరుకి విలువ మదింపు చేసి టార్గెట్‌ను ప్రకటించాం. గురుగ్రామ్ కేంద్రంగా ఎన్‌సీఆర్ ప్రాంతంలో కార్యకలాపాలు విస్తరించిన కంపెనీ బ్యాంకింగ్ బిజినెస్ మోడల్‌ను అనుసరిస్తోంది. కొనుగోళ్ల నుంచి డెలివరీ వరకూ వేగవంత ఎగ్జిక్యూషన్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. తద్వారా భవిష్యత్ వృద్ధి అవసరాలకు సమర్థవంతరీతిలో అంతర్గత వనరులను వినియోగించుకుంటోంది. గత రెండేళ్ల కాలం (2021-23)లో వార్షిక ప్రాతిపదికన 43 శాతం అమ్మకాల బుకింగ్స్‌ను డెలివరీ చేయగలిగింది. వీటిలో ప్రధానంగా అందుబాటు, మధ్యస్థాయి ఆదాయ హౌసింగ్ ప్రాజెక్టులే ఉన్నాయి. అయితే ప్రస్తుతం గురుగ్రామ్‌లోని ప్రధాన ప్రాంతాలలోని ప్రీమియం గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టులలోకి ప్రవేశించింది. వెరసి రానున్న రెండేళ్ల(2024-26)లో పటిష్ట ప్రాజెక్టుల విడుదల ద్వారా రూ. 40,000 కోట్ల విలువైన స్థూల డెవలప్‌మెంట్ విలువ(జీడీవీ)ను సాధించగలదని భావిస్తున్నాం. వార్షిక ప్రాతిపదికన అమ్మకాల బుకింగ్స్‌లో 38 శాతం వృద్ధిని నమోదు చేయగలదని అంచనా వేస్తున్నాం. వెరసి 2025-27 మధ్య కాలంలో ఏడాదికి రూ. 10,000-12,000 కోట్ల స్థాయిలో అమ్మకాల బుకింగ్స్‌ను సాధించే వీలుంది. సగటున ఒక్కో చదరపు అడుగుకు రూ. 13,000 కంటే అధిక ధర(రియలైజేషన్) లభించగలదని అంచనా. అయితే అంతర్గత వనరులను గురుగ్రామ్‌లో భూముల కొనుగోళ్లకు తిరిగి వినియోగించవలసి ఉంటుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

విప్రోకి సీఈవో డెలాపోర్ట్ రాజీనామా

కొత్త సీఈవోగా శ్రీనివాస్ పలియా నియామకం



శ్రీనివాస్ డెలాపోర్ట్

న్యూఢిల్లీ: ఆర్థిక ఫలితాల వేళ ఐటీ దిగ్గజం విప్రోలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కంపెనీ సీఈవో పదవికి థియెరీ డెలాపోర్ట్ రాజీనామా చేశారు. దీంతో ఆయన స్థానంలో కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ పలియా నియమితులయ్యారు. శ్రీనివాస్ నియామకం అయిదేళ్ల పాటు అమల్లో ఉంటుందని విప్రో తెలిపింది. బాధ్యతల బదలాయింపు ప్రక్రియలో భాగంగా మే 31 వరకు డెలాపోర్ట్ కంపెనీలో కొనసాగుతారు. గత నాలుగేళ్లుగా సంస్థలో గణనీయమైన పరివర్తనకు దోహదపడిన డెలాపోర్ట్ ఇతర వ్యాపకాలపై దృష్టి పెట్టేందుకు సీఈవో పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు విప్రో వెల్లడించింది. డెలాపోర్ట్ 2020 జూలైలో విప్రో సీఈవోగా చేరారు. గత కొన్నాళ్లుగా పోటీ సంస్థలతో పోలిస్తే విప్రో అంత ఆశావహ పనితీరు కనపర్చకపోవడం, పలువురు పైస్థాయి ఉద్యోగులు వరుసగా నిష్క్రమిస్తుండటం తదితర అంశాల నేపథ్యంలో డెలాపోర్ట్ రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీనివాస్ సుమారు మూడు దశాబ్దాల క్రితం విప్రోలో చేరారు. ప్రస్తుతం ఆయన సంస్థ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యునిగా ఉన్నారు.

ఏబీ గ్రూప్‌నకు వొడాఫోన్ షేర్లు

రూ. 2,075 కోట్ల సమీకరణకు బోర్డు ఓకే

న్యూఢిల్లీ: రుణ భారంతో సతమతమవుతున్న మొబైల్ టెలికం రంగ దిగ్గజం వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణకు బోర్డు తాజాగా ఓకే చెప్పింది. ప్రమోటర్ సంస్థ ఆదిత్య బిర్లా గ్రూప్ రూ. 2,075 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు బోర్డు అనుమతించినట్లు వొడాఫోన్ ఐడియా వెల్లడించింది. అధీకృత వాటా మూలధనాన్ని రూ. లక్ష కోట్లకు పెంచేందుకు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలియజేసింది. మే 8న నిర్వహించనున్న అసాధారణ సర్వసభ్య సమావేశం(ఈజీఎం)లో వాటాదారుల అనుమతిని సైతం కోరనున్నట్లు పేర్కొంది. దీంతో ఓరియానా ఇన్వెస్ట్‌మెంట్స్(ఏబీ గ్రూప్)నకు రూ. 10 ముఖ విలువ గల 139 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. రూ. 14.87 ధర(రూ. 4.87 ప్రీమియం)లో వీటిని కేటాయించనుంది. తద్వారా రూ. 2,075 కోట్లు అందుకోనుంది. ప్రస్తుత రూ. 75,000 కోట్ల అధీకృత వాటా మూలధనాన్ని రూ. లక్ష కోట్లకు పెంచేందుకు సైతం బోర్డు అనుమతించినట్లు వొడాఫోన్ ఐడియా పేర్కొంది. ఏప్రిల్ 2న జరిగిన ఈజీఎంలో సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 20,000 కోట్లు సమకూర్చుకునేందుకు వాటాదారులు ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే.

ఏథర్ నుంచి రిజ్టా

ఫ్యామిలీ స్కూటర్ ధర రూ. 1.09 లక్షల నుంచి ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తాజాగా రిజ్టా పేరిట ఫ్యామిలీ స్కూటర్‌ను ఆవిష్కరించింది. ఇది మూడు వేరియంట్స్‌లో లభిస్తుంది. ధర రూ. 1,09,999 లక్షల నుంచి రూ. 1,44,999 వరకు (ఎక్స్‌షోరూం బెంగళూరు) ఉంటుంది. కుటుంబ అవసరాలకు అనుగుణంగా విశాలమైన సీటు, స్టోరేజీతో ఈ స్కూటర్‌ను తీర్చిదిద్దినట్లు ఏథర్ కమ్యూనిటీ డే కార్యక్రమంలో దీన్ని ఆవిష్కరించిన సందర్భంగా సంస్థ సీఈవో తరుణ్ మెహతా తెలిపారు. వేరియంట్‌ను బట్టి ఒక్కసారి చార్జి చేస్తే 123 కి.మీ. నుంచి 160 కి.మీ. వరకు రేంజ్ ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు, హేలో పేరిట స్మార్ట్ హెల్మెట్‌ను కూడా ఆవిష్కరించారు. దీన్ని ఫోన్, స్కూటర్‌కి అనుసంధానం చేసుకోవచ్చు. రెండు మోడల్స్‌లో లభించే ఈ హెల్మెట్ ధర రూ. 4,999-రూ. 12,999గా ఉంది. అప్‌గ్రేడెడ్ సాఫ్ట్‌వేర్ ఏథర్‌స్టాక్ 6.0ను కూడా సంస్థ ఆవిష్కరించింది.

ఎగుమతులపైనా దృష్టి పెట్టాలి ..

దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మరింత పెరిగేందుకు ఇంటరాపరబుల్ చార్జర్ల ఆవశ్యకత ఉందని కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ తెలిపారు. 2030 నాటికి 100 శాతం ద్విచక్ర, త్రిచక్ర ఎలక్ట్రిక్ వాహనాల లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి జరగాలని పేర్కొన్నారు. దేశీయంగా తయారీ సామర్థ్యాలను పెంచుకుని, ఎలక్ట్రిక్ వాహనాలను పెద్ద ఎత్తున ఎగుమతి చేయడంపై కంపెనీలు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

అదానీ గ్రూప్ రూ. 2.3 లక్షల కోట్ల పెట్టుబడులు

పునరుత్పాదక ఇంధన కార్యకలాపాలపై ప్రణాళికలు



ఖావ్డా/అహ్మదాబాద్ (గుజరాత్): వ్యాపార దిగ్గజం అదానీ గ్రూప్ పునరుత్పాదక ఇంధనాల కార్యకలాపాలపై భారీగా ఇన్వెస్ట్ చేయనుంది. 2030 నాటికి పునరుత్పాదక శక్తి విభాగం విస్తరణ, సౌర..పవన విద్యుత్ పరికరాల తయారీకి సంబంధించి సామర్థ్యాల పెంపు మొదలైన వాటిపై రూ. 2.3 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్) ఎండీ వినీత్ ఎస్ జైన్ తెలిపారు. గుజరాత్‌లోని ఖావ్డాలో సౌర, పవన విద్యుదుత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడంపై రూ. 1.5 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా అదే తరహా ఇతర ప్రాజెక్టులపైనా రూ. 50,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు జైన్ వివరించారు. గుజరాత్‌లోని ముంద్రాలో సోలార్ సెల్, విండ్ టర్బైన్ తయారీ సామర్థ్యాలను పెంచుకునేందుకు అదానీ న్యూ ఇండస్ట్రీస్ (ఏఎన్ఐఎల్) దాదాపు రూ. 30,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 10.93 గిగావాట్లుగా ఉన్న పునరుత్పాదక శక్తి సామర్థ్యాలను 2030 నాటికి 45 గిగావాట్లకు పెంచుకోవాలని ఏజీఈఎల్ నిర్దేశించుకుంది.

ఊరంతా చుట్టాలే!

ఆ ఊర్లో అందరూ ఒకే సామాజిక వర్గం

- ఆపదొస్తే ఒకరికొకరు అండగా..
- కామారెడ్డి జిల్లాలో ఆ నాలుగు ఊర్లు ప్రత్యేకం


నర్సాపూర్ గ్రామం

సాక్షి, కామారెడ్డి: ఆ ఊర్లలో కుటుంబాలన్నీ ఒకే సామాజిక వర్గానికి చెందినవి. ఇంటి పేరు వేరైనా, దాదాపు అన్ని కుటుంబాలతో బంధుత్వం ఉండే ఉంటుంది. ఎవరికి ఏ ఆపద వచ్చినా ఒకరికొకరు అండగా నిలుస్తారు. ఏవైనా విభేదాలొస్తే అక్కడే పరిష్కరించుకుంటారు. కామారెడ్డి జిల్లాలో ఉన్న ఆ నాలుగు ఊళ్లపై 'సాక్షి' ప్రత్యేక కథనం.. కామారెడ్డి మండలంలోని కొటాల్‌పల్లి, భిక్కనూరు మండలంలోని అయ్యవారిపల్లి, లింగంపేట మండలంలోని నాగారం, గాంధారి మండలంలోని నర్సాపూర్ గ్రామాల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఉన్నాయి. ఆ ఊళ్లలో అన్ని రాజకీయ పార్టీలు ఉన్నా... ఎన్నికల వరకే రాజకీయాలు. ఆ తరువాత అందరూ కలిసే ఉంటారు. ఏమైనా విభేదాలొస్తే స్థానికంగానే పరిష్కరించుకుంటారు. ఆ గ్రామాల నుంచి గొడవలతో పోలీసు స్టేషన్ దాకా వెళ్లిన ఘటనలు తక్కువే.

మున్నూరుకాపుల కొటాల్‌పల్లి...

కామారెడ్డి మండలంలోని కొటాల్‌పల్లి గ్రామంలో 101 కుటుంబాలు ఉండగా జనాభా 425. ఇక్కడ అన్నీ మున్నూరుకాపు కులానికి చెందిన కుటుంబాలే ఉన్నాయి. 255 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. అందరూ వ్యవసాయం అందునా ఆకుకూరలు పండించడంలో సిద్ధహస్తులు. మున్నూరు కాపు కులానికి చెందిన జొనకంటి, కల్లూరి, ఆకుల, బచ్చగారి ఇంటిపేర్లతో కుటుంబాలు ఉన్నాయి. దాదాపు అన్ని కుటుంబాలకు వ్యవసాయ భూమి ఉంది. అందరూ వ్యవసాయం చేస్తారు.

ముదిరాజ్‌ల అయ్యవారిపల్లి....

భిక్కనూరు మండలంలోని అయ్యవారిపల్లి 2018 లో పంచాయతీగా ఏర్పడింది. 128 కుటుంబాలుండగా 683 మంది జనాభా ఉన్నారు. గ్రామంలోని అన్ని కుటుంబాలు ముదిరాజ్ కులానికి చెందినవే ఉన్నాయి. వర్షాధారంపై పంటలు సాగు చేస్తారు. బోర్లు ఉన్న రైతులు వాటిపై ఆధారపడి వరి, ఇతర పంటలు సాగుచేస్తారు. భూములు లేని వాళ్లు కొందరు వ్యవసాయ పనులకు కూలీలుగా వెళతారు.

పొలాల మధ్యన నాగారం...


కొటాల్‌పల్లి గ్రామం


అయ్యవారిపల్లి గ్రామం

లింగంపేట మండలం నాగారం అనే కుగ్రామంలో 22 కుటుంబాలు, 120 మంది జనాభా ఉన్నారు. అందరూ ముదిరాజ్ సామాజికవర్గం వారే. వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తారు. కోర్పోల్ పంచాయతీకి అనుబంధ గ్రామం ఇది. కుల వృత్తుల వారితో పనులు ఉంటే కోర్పోల్ గ్రామానికి వెళ్లి చేయించుకుంటారు. ఊరు చుట్టూ పచ్చని పంటలు ఉంటాయి. అందరూ వ్యవసాయం చేస్తారు. అన్ని కుటుంబాల వాళ్లతో బంధుత్వం ఉంది.

చుట్టూ అడవి.. నడుమ నర్సాపూర్....

గాంధారి మండలంలోని నర్సాపూర్ గ్రామం అడవి మధ్యన ఉంటుంది. ఇక్కడ 72 కుటుంబాలు ఉన్నాయి. 298 మంది జనాభా ఉన్నారు. అందరూ ముదిరాజ్ వర్గం వారే. వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వర్షాధార పంటలు ఎక్కువగా పండిస్తారు. బోర్లు, బావులు ఉన్న వారు వరి తదితర పంటలు వేస్తున్నారు.


నాగారం గ్రామం

ఎవరి పనుల్లో వారుంటారు...



అందరం ఒకే కులం వాళ్లం. కలిసిమెలిసే ఉంటాం. ఎవరి పనుల్లో వారు తీరికలేకుండా ఉంటారు. ఏదైనా సమస్య వస్తే కూర్చుని మాట్లాడుకుంటాం. కూరగాయలు.. ముఖ్యంగా ఆకుకూరల సాగులో మా ఊరుకు ఎంతో పేరుంది.

– బాలయ్య, కొటాల్‌పల్లి, కామారెడ్డి మండలం

అందరం కలిసిమెలిసి ఉంటాం...



మా ఊరిలో ఎవరి పని వాళ్లు చేసుకుని బతుకుతారు. ఎలాంటి గొడవలు ఉండవు. పొలం ఉన్న వాళ్లు వ్యవసాయం చేస్తారు. పొలం లేని వాళ్లు పొరుగూళ్లకు వెళ్లి కూలీ నాలీ చేసుకుని వస్తారు. ఒకే కులానికి చెందిన వాళ్లమే కావడంతో చాలా పనులు మాకుగా మేమే చేసుకుంటాం.

– చిన్న రాజయ్య, అయ్యవారిపల్లి, భిక్కనూరు మండలం

3 కుటుంబాలతో ఏర్పడిన గ్రామం



మా తాతల కాలంలో 3 కుటుంబాలతో గ్రామం ఏర్పడింది. తరువాత పెరిగి కుటుంబాల సంఖ్య 22కు చేరుకుంది. అందరం ఒకే కుటుంబం నుంచి వచ్చిన వాళ్లం. గొడవలు లేకుండా అందరం వ్యవసాయం చేసుకుని బతుకుతుంటాం.

– చింతకుంట లక్ష్మీనారాయణ, నాగారం, లింగంపేట మండలం

'మా' అధ్యక్షుడిగా మంచు

విష్ణు కొనసాగింపు

ఏకగ్రీవంగా నిర్ణయించిన జనరల్ బాడీ సభ్యులు



సాక్షి, హైదరాబాద్: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడిగా సినీ హీరో మంచు విష్ణును కొనసాగిస్తూ జనరల్‌బాడీ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆదివారం ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్ సెంటర్‌లో సమావేశం జరిగింది. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు పక్కా భవన నిర్మాణ పనులు చేపట్టబోతున్నందున, 'మా' తరఫున జూలైలో మారిషస్‌లో ఈవెంట్ చేసి, దాని ద్వారా ఫండ్ రైజింగ్ చేయాలనుకున్నారు. ఈ నేపథ్యంలోనే విష్ణుతోపాటు పాత కమిటీ కొనసాగుతుందని మా వైస్‌ప్రెసిడెంట్ మాదాల రవి చెప్పారు. రెండేళ్ల క్రితం జరిగిన 'మా' ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి మంచు విష్ణు, ప్రకాశ్‌రాజ్ పోటీ పడగా, విష్ణు గెలుపొందారు. ఆయన పదవీకాలం పూర్తయింది. 'మా'కు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఫండ్‌రైజింగ్ నేపథ్యంలో పాత కమిటీని కొనసాగిస్తున్నారు.


ల్యాబ్ తయారీ మాంసం తింటారా?

'మీరు ల్యాబ్‌లో తయారు చేసిన మాంసం తింటారా?' కన్జూమర్ ఇన్‌సైట్స్ సర్వే పేరుతో స్టాటిస్టా అనే సంస్థ ఇటీవల వివిధ దేశాల ప్రజల్ని అడిగిన వెరైటీ ప్రశ్న ఇది. మామూలు మాంసాన్ని లొట్టలేసుకొని ఆరగించే నాన్‌వెజ్ ప్రియులకు ఈ ప్రశ్న పెద్దగా రుచించనట్లుంది!! అందుకే చాలా తక్కువ మంది నుంచే సానుకూల స్పందన వచ్చింది. కానీ ఇందులోనూ భారతీయులే కొంత పాజిటివ్‌గా స్పందించడం విశేషం. భారత్ నుంచి సర్వేలో పాల్గొన్న ప్రతి ఐదుగురిలో ఒకరు... అంటే అత్యధికంగా 20 శాతం మంది ల్యాబ్ మాంసం తినేందుకు సై అనగా ఫ్రాన్స్‌లో మాత్రం అతితక్కువగా కేవలం 9 శాతం మందే దీన్ని ట్రై చేస్తామన్నారు. ఇక్కడ మరో విచిత్రం ఏమిటంటే.. ల్యాబ్ తయారీ మాంసం విక్రయాలకు అనుమతిచ్చిన రెండు దేశాల్లో ఒకటైన అమెరికాలోనూ (మరో దేశం సింగపూర్) దీన్ని తినడంపై పెద్దగా సానుకూలత వ్యక్తం కాలేదు. సర్వేలో పాల్గొన్న వారిలో కేవలం 16 శాతం మంది అమెరికన్లే ఇందుకు రెడీ అన్నారు. ఈ సర్వేలో ఒక్కో దేశం నుంచి 2 వేల నుంచి 10 వేల మంది మధ్య నెటిజన్లు పాల్గొన్నారు.

ఎలా తయారు చేస్తారు?

కల్టివేటెడ్ లేదా కల్చర్డ్ మీట్‌గా పేర్కొనే ఈ మాంసం తయారీ కోసం ముందుగా జంతువుల నుంచి కొన్ని స్టెమ్ సెల్స్ (మూల కణాలు)ను బయాప్సీ ద్వారా సేకరిస్తారు. ఆ తర్వాత వాటికి 'పోషక స్నానం' చేయిస్తారు. అంటే కణ విభజన జరిగి అవి కొంత మేర రెట్టింపయ్యేందుకు వీలుగా పోషకాలతో కూడిన ద్రవంలో ముంచుతారు. అనంతరం అవి కణజాలం (టిష్యూ)గా వృద్ధి చెందేందుకు బయోరియాక్టర్‌లోకి చేరుస్తారు. జంతు ప్రేమికుల కోసం లేదా జంతు వధ ద్వారా పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించేందుకు ల్యాబ్ తయారీ మాంసం సూత్రప్రాయంగా ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది.

– సాక్షి, సెంట్రల్ డెస్క్



మాదిగ కార్పొరేషన్

ఏర్పాటు చేయాలి


సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎండీహెచ్ రాష్ట్ర కమిటీ సభ్యులు

లక్డీకపూల్: మాదిగల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని మాదిగ హక్కుల దండోరా (ఎండీహెచ్) కోరింది. ఈ మేరకు ఎండీహెచ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో ఆత్మ గౌరవ భవనాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కొంగరి శంకర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.